ప్రకటనల కోసం సంప్రదించండి
98483 28698

తెలంగాణ స్వరాష్ట్ర సమరయోధ పత్రిక
Estd : 2002
# జనంసాక్షి
www.janamsakshi.org
శుక్రవారం 15.08.2025 | సంపుటి :12 సంచిక : 27 | పేజీలు :12 వెల : రూ. 4/-
RNI NO.TELTEL / 2013 /50370








# భారత్ శక్తివంతమైన దేశం

- 'ఆపరేషన్ సిందూర్'తో గట్టి గుణపాఠం చెప్పాం
- దేశ ప్రజలకు స్వాతంత్ర్య దినోత్సవ శుభాకాంక్షలు
- జాతినుద్దేశించి రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ప్రసంగం

న్యూఢిల్లీ(జనంసాక్షి):స్వావలంబన దేశంగా అవతరించే దిశగా భారత్ దృఢమైన విశ్వాసంతో ముందుకు సాగుతోందని రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము పేర్కొన్నారు. ద్రవ్యోల్బణం తగ్గుముఖం పట్టిందని, ఎగుమతులు పెరిగాయని, అన్ని కీలక సూచీలు దేశ ఆర్థిక వ్యవస్థ బలంగా ఉందని చూపిస్తున్నాయని తెలిపారు. స్వాతంత్ర్య దినోత్సవం పురస్కరించుకుని రాష్ట్రపతి ముర్ము జాతినుద్దేశించి ఈమేరకు ప్రసంగించారు. పహల్గాంలో అమాయక పౌరులపై జరిగిన ఉగ్రదాడిని అమానుషమైన, పిరికిపంద చర్యగా పేర్కొన్నారు. ఉగ్రవాదంపై మానవాళి పోరాటంలో 'ఆపరేషన్ సిందూర్ ఒక ఉదాహరణగా చరిత్రలో నిలిచిపోతుందని చెప్పారు. 'పహల్గాం ఉగ్రదాడిని దేశమంతా ముక్తకంఠంతో ఖండించింది. మిగతా 2లో..

## ఉత్తమసేవలకు పతకాలు

**తెలంగాణకు దక్కిన ఒక గ్యాలంటరీ, రెండు ప్రెసిడెంట్, 11 మెరిటోరియస్ సర్వీస్ మెడల్స్.. ప్రకటించిన కేంద్రం**

న్యూఢిల్లీ(జనంసాక్షి): స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ఉత్తమసేవలు అందించిన అధికారులకు కేంద్రం పతకాలు ప్రకటించింది. తెలంగాణకు మిగతా 2లో..

## రాష్ట్రపతి ముర్ముది ఆలోచనాత్మక ప్రసంగం




**దేశ సమష్టి పురోగతిని, రాబోయే అవకాశాలను ప్రధానంగా ప్రస్తావించారు: ప్రధాని మోదీ**

న్యూఢిల్లీ(జనంసాక్షి):స్వాతంత్ర్యదినోత్సవాన్ని పురస్కరించుకుని.. రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము చేసిన ప్రసంగం ఆలోచనాత్మకంగా ఉందని ప్రధాని నరేంద్ర మోదీ పేర్కొన్నారు. మిగతా 2లో..

# జమ్మూకాశ్మీర్‌లో క్లౌడ్‌బరస్ట్..



## మెరుపువరదలతో విషాదం



- కిష్త్వార్, పహల్గాంలో బీభత్సం
- 38 మంది మృతి.. 220మంది గల్లంతు
- భారీ వర్షంతో పలువురికి తీవ్ర గాయాలు
- స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు, 'సీఎం అట్ హోం'తో సహా ఉత్సవాలు రద్దు
- సహాయక చర్యల్లో ఎన్‌డిఆర్‌ఎఫ్ దళాలు
- ముఖ్యమంత్రి ఒమర్ అబ్దుల్లా విచారం

శ్రీనగర్(జనంసాక్షి):జమ్మూకశ్మీర్‌లో స్వల్ప వ్యవధిలో కిష్త్వార్, పహల్గాంలో రెండో చోట్ల జరిగిన క్లౌడ్ బరస్ట్ కారణంగా మృతుల సంఖ్య అంతకంతకూ పెరుగుతోంది. ఆకస్మికంగా ముంచెత్తిన వరదల కారణంగా గురువారం 38 మంది మరణించారు. 220మంది గల్లంతయ్యారు. ఓవైపు క్లౌడ్ బరస్ట్ మరోవైపు కుండపోత వర్షంతో భారీ ఎత్తున ఆస్తినష్టం, ప్రాణ నష్టం జరిగే అవకాశం ఉందని అధికారులు అంచనా వేస్తున్నారు. గురువారం మధ్యాహ్నం కిష్త్వార్ జిల్లాలోని చషోటీ ప్రాంతాన్ని వరదలు ముంచెత్తాయి. రోడ్లన్నీ కొట్టుకుపోయాయి. స్థానికులు ఏర్పాటు చేసుకున్న గుడారాలు ఎగిరిపోయాయి. కిష్త్వార్‌లో క్లౌడ్ బరస్ట్ అయిన కాసేపటికే పహల్గాంలో క్లౌడ్ బరస్ట్ జరిగింది. పహల్గాంకు సమీపంలో మెరుపు వరదలు ముంచెత్తాయి. జల ప్రవాహం ధాటికి మిగతా 2లో..

# ఓటరు చోరీపై జనంలోకి రాహుల్

## ఎస్ఐఆర్, ఓటర్ల జాబితాలో లోపాలపై బిహార్ రాష్ట్రవ్యాప్తంగా 'ఓట్ అధికార్ యాత్ర'

### ఆగస్టు 17 నుంచి ప్రారంభించనున్న కాంగ్రెస్ అగ్రనేత



న్యూఢిల్లీ(జనంసాక్షి):ఓటర్ల జాబితాలో లోపాలపై ఈసీ, అధికార బీజేపీపై విమర్శలు గుప్పిస్తున్న కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ మరింత దూకుడు పెంచారు. బిహార్ లో 'ఓట్ అధికార్ యాత్ర'ను చేపట్టేందుకు సిద్ధమవుతున్నారు. ఓటర్ల జాబితాల సవరణ, ఓటు చోరీకి వ్యతిరేకంగా తాను చేస్తున్న పోరాటాన్ని ప్రజా ఉద్యమంగా మార్చేందుకు ప్రణాళికలు వేశారు. ఈ క్రమంలో బిహార్?లోని ఇండియా కూటమి నాయకులతో కలిసి రాహుల్ గాంధీ ఆగస్టు 17 నుంచి రాష్ట్రవ్యాప్తంగా 'ఓట్ అధికార్ యాత్ర' చేపట్టనున్నారు. ఈ మేరకు కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ ప్రకటించారు. దేశ ప్రజాస్వామ్యాన్ని రక్షించడానికి పోరాటం వీధుల్లో జరుగుతుందని కేసీ వేణుగోపాల్ తెలిపారు. ఆగస్టు 17 నుంచి లోక్ సభలో విపక్ష నేత రాహుల్ గాంధీ, మిగతా 2లో..

### 'ఓటుచోరీ' పై ఆధారాలివ్వండి

**రాహుల్ ఆరోపణలపై స్పందించిన ఈసీ**

వార్త 2

# తొలగించిన 65 లక్షల మంది పేర్లను బహిర్గతం చేయండి

## మరణించిన ఓటర్ల వివరాలు కూడా వెల్లడించండి

## ఎన్నికల సంఘానికి సుప్రీంకోర్టు కీలక ఆదేశం



- వారిని ఎందుకు తొలగించారో కూడా వివరణ ఇవ్వండి
- బీహార్ ఎస్ఐఆర్‌పై అత్యున్నత ధర్మాసనం అసంతృప్తి

న్యూఢిల్లీ(జనంసాక్షి): బిహార్ అసెంబ్లీ ఎన్నికలకు రెండు నెలల ముందు ఎన్నికల సంఘం చేపట్టిన ప్రత్యేక ఓటర్ల జాబితా సవరణపై మరోసారి సుప్రీంకోర్టు అసంతృప్తి వ్యక్తం చేసింది.ఎన్నికల సంఘం ఏదైతే ఓటర్లను తొలగించామని చెప్పిందో.. ఆ 65లక్షలకు పైగా ఓటర్ల జాబితాను ఎన్నికల సంఘం వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేయాలని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది.అదే సమయంలో వారిని ఎందుకు తొలగించారో పేర్కొంటూ వివరణతో కూడిన ఆ లిస్టును పబ్లిక్‌లోకి తీసుకురావాలని పేర్కొంది ధర్మాసనం. ఈ అంశానికి సంబంధించి గురువారం విచారణ చేపట్టిన సుప్రీంకోర్టు.. 22 లక్షల మందిని చనిపోయారన్న కారణంతో తొలగించడాన్ని సైతం? ప్రశ్నించింది. బూత్ లెవెల్ స్థాయిలో దీనిని ఎందుకు బహిర్గతం చేయలేదని నిలదీసింది. పౌరుల హక్కు రాజకీయ పార్టీలపై ఆధారపడటం మాకు ఇష్టం లేదు' అని ధర్మాసనం వ్యాఖ్యానించింది.'భారత ఎన్నికల కమిషన్ వాదనలను మేము పూర్తిగా విన్నాం. విచారణ సమయంలో, ఈ క్రింది దశలను అంగీకరించారు. 2025 జాబితాలో పేర్లు కనిపించినప్పటికీ, తాజాగా జాబితాలో చేర్చబడని 65 లక్షల మంది మిగతా 2లో..

### తొలగించిన పేర్లను ప్రచురిస్తాం

**జాబితాను బూత్‌ల వారీగా ప్రదర్శిస్తాం**
**సుప్రీంకోర్టుకు తెలిపిన ఎలక్షన్ కమిషన్**

2లో..



# దక్షిణ తెలంగాణలో ఉప్పొంగుతున్న వాగులు

## నల్గొండ, సూర్యాపేట జిల్లాల్లో భారీ వర్షాలు

- కోదాడకూ పొంచివున్న వరద గండం..
- నేడు పలు జిల్లాలకు అతిభారీ వర్ష సూచన
- మెదక్, సంగారెడ్డి, వికారాబాద్ జిల్లాలకు రెడ్‌అలర్ట్
- శ్రీశైలం జలాశయానికి భారీగా వరద ప్రవాహం
- ప్రాజెక్టు ఏడు గేట్లు ఎత్తి దిగువకు నీటి విడుదల

హైదరాబాద్(జనంసాక్షి): నల్గొండ, సూర్యాపేట జిల్లాల్లో విస్తారంగా కురుస్తున్న భారీ వర్షాలు – కోదాడలోని పలు కాలనీల్లో నిలిచిన వరద నీరు – రాకపోకలకు అంతరాయం – నడిగూడెంలో ఇళ్లల్లోకి చేరిన వరద నీరు రాష్ట్రవ్యాప్తంగా భారీ వర్షాలు కురుస్తున్నాయి. గత రెండు రోజులుగా నల్గొండ, సూర్యాపేట జిల్లాల్లో వానలు పడుతున్నాయి. నల్గొండ జిల్లా మిర్యాలగూడ నియోజకవర్గంలో గత రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు వాగులు, వంకలు పొంగిపొర్లుతున్నాయి. మిర్యాలగూడలో 63.2 మిల్లీమీటర్లు, దామరచర్లలో 77.2, వేములపల్లి లో 56.5, అడవిదేవులపల్లి లో 43.6 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదయింది.మిర్యాలగూడ పట్టణంలోని రంగన్న కాలనీ, విద్యానగర్ కాలనీలలోని రోడ్లపై వర్షపు నీరు ప్రవహిస్తుండడంతో మిగతా 2లో..

# ప్రాణ, ఆస్తినష్టం సంభవించొద్దు

- వెంటనే ముందస్తు చర్యలు చేపట్టాలి
- వర్షాలపై అప్రమత్తంగా ఉండండి
- సహాయక చర్యలకు జిల్లాకో రూ.కోటి
- తక్షణ సహాయ చర్యలకు సిద్ధం కావాలి
- కలెక్టర్లకు మంత్రి పొంగులేటి ఆదేశాలు

హైదరాబాద్(జనంసాక్షి): వర్షాల వల్ల ఎలాంటి ప్రాణ, ఆస్తినష్టం జరగకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. తెలంగాణలో భారీ వర్షాలు, సహాయక చర్యలపై ఆయన కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సమీక్షలో సీఎస్ రామకృష్ణారావు పాల్గొన్నారు. ఈసందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. మిగతా 2లో..



## తెలంగాణలో ఆర్థిక పరిస్థితి దివాళా

- కాంగ్రెస్ ప్రభుత్వ అసమర్థ పాలనతోనే రాష్ట్రంలో ఆర్థిక సంక్షోభం
- రెండు నెలలుగా తెలంగాణలో మైనస్ ద్రవ్యోల్బణం
- రాష్ట్ర ఆర్థిక వ్యవస్థ పతనానికి నిదర్శనం:కేటీఆర్



హైదరాబాద్(జనంసాక్షి): వరుసగా రెండు నెలల పాటు తెలంగాణ ద్రవ్యోల్బణం (ఇన్‌ఫ్లేషన్) మైనస్ లోకి పోవడం రాష్ట్ర ఆర్థిక వ్యవస్థ పతనానికి స్పష్టమైన నిదర్శనమని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కే. తారక రామారావు ఆరోపించారు. కేసీఆర్ నాయకత్వంలో తొమ్మిదేండ్ల పాటు దేశానికే ఆదర్శంగా నిలిచిన తెలంగాణ రాష్ట్రం, కేవలం ఎనిమిది నెలల కాంగ్రెస్ పాలనలో ఆర్థికంగా చితికిపోయిందని తీవ్ర ఆవేదన వ్యక్తం మిగతా 2లో..

## దుస్సాహసం చేశారో.. జాగ్రత్త!



- పిచ్చిప్రేలాపనలు మానాలి
- ఆ దేశ నేతలు, అధికారులు నోరు అదుపులో పెట్టుకోవాలి
- ఎలాంటి దుస్సాహసానికి దిగినా హానికర పరిణామాలుంటాయి
- పాకిస్తాన్‌కు భారత్ హెచ్చరిక

న్యూఢిల్లీ(జనంసాక్షి):పాకిస్థాన్ నేతలు, అధికారులకు భారత్ స్ట్రాంగ్ వార్నింగ్ ఇచ్చింది. పాక్ నేతలు, అధికారులు నోరు అదుపులో పెట్టుకోవాలని సూచించింది. ఎలాంటి దుస్సాహసానికి దిగినా హానికర పరిణామాలు ఉంటాయని స్పష్టం చేసింది. "భారత్‌కు వ్యతిరేకంగా పాకిస్థాన్ అగ్రనాయకత్వం ఈ మధ్య కాలంలో తరచూగా విద్వేష వ్యాఖ్యలను చూస్తున్నాం. వారు చేసుకున్న తప్పులను కప్పిపుచ్చడానికి భారత్ వ్యతిరేకంగా విద్వేషాలు రెచ్చగొడుతున్నారు" అని విదేశాంగ శాఖ అధికార ప్రతినిధి రణ్‌ధీర్‌జైశ్వాల్ అన్నారు. ఇటీవల పాకిస్థాన్ నేతలు, సైన్యాధికారులు భారత్‌పై తమ వక్రబుద్ధిని ప్రదర్శిస్తున్నారు. దశాబ్దాల నాటి సింధు జలాల ఒప్పందాన్ని భారత్ నిలిపివేయడంతో ఆర్మీ చీఫ్ ఆసిమ్ మునీర్ నుంచి బిలావల్ భుట్టో, ప్రధాని షరీఫ్ వంకు భారత్‌పై 'అణు' బెదిరింపులకు పాల్పడుతూనే ఉన్నారు. దీనిని తీవ్రంగా పరిగణించిన భారత్, దాయాది నేతలు, అధికారులకు తీవ్ర హెచ్చరికలు చేసింది. సింధు జలాల విషయంలో ఆ దేశ మిగతా 2లో..

## తెలంగాణ మున్సిపల్ చట్ట సవరణ ఆర్డినెన్స్‌కు గవర్నర్ ఆమోదం

హైదరాబాద్(జనంసాక్షి):తెలంగాణ మున్సిపల్ చట్ట సవరణ ఆర్డినెన్స్‌కు గవర్నర్ ఆమోదం లభించింది. ఆర్డినెన్స్ 3కి గవర్నర్ ఆమోదం లభించడంతో న్యాయశాఖ గెజిట్ నోటిఫికేషన్ జారీ చేసింది. ఈ ఆర్డినెన్స్ ద్వారా సంగారెడ్డి జిల్లాలో ఇంద్రీశం, జిన్నారం మున్సిపాలిటీల ఏర్పాటుకు ఆమోదం లభించింది. మున్సిపల్ ఛైర్మన్లు, వైస్ ఛైర్మన్లు, కార్పొరేషన్ల మేయర్లు, డిప్యూటీ మేయర్ల ఎన్నికల్లో రాజ్యసభ సభ్యులకు సైతం ఓటుహక్కు కల్పించేలా తెలంగాణ మున్సిపల్ చట్టంలోని సెక్షన్–20కి సవరణ చేశారు. మిగతా 2లో..

### ఆర్థిక వ్యవస్థ నిర్వహణలో ప్రభుత్వం విఫలం

- ప్రమాదపుటంచున తెలంగాణ ద్రవ్యోల్బణం
- మాజీ మంత్రి హరీశ్‌రావు విమర్శలు

2లో..

## ట్రంప్-పుతిన్ చర్చలు విఫలమైతే భారత్‌పై మరిన్ని సుంకాలు తప్పవేమో!



### ఆంక్షలు కూడా విధిస్తాం: అమెరికా

వాషింగ్టన్(జనంసాక్షి): భారత్ సుంకాలతో దాడి చేసిన అమెరికా.. భారత్‌కు మరో హెచ్చరిక జారీ చేసింది. భారత్‌పై మరిన్ని సుంకాలు లేదంటే ఆంక్షలు తప్పవని అంటోంది. ఉక్రెయిన్ శాంతి చర్చల్లో భాగంగా ఆ దేశ అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్, రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ అలస్కాలో భేటీ కానున్న సంగతి తెలిసిందే.ఈ నేపథ్యంలో.. చర్చల ఫలితాలను బట్టి ట్రంప్ నిర్ణయం ఉంటుందని స్పష్టం చేసింది.రష్యాతో చమురు కొనుగోళ్ల విషయంలో భారత్‌పై ఇప్పటికే సుంకాలు విధించాం. ఒకవేళ.. ట్రంప్–పుతిన్ మధ్య చర్చలు గనుక విఫలమైతే భారత్‌పై మరిన్ని సుంకాలు, ఆంక్షలు తప్పవు. తుది నిర్ణయం చర్చల ఫలితాలను బట్టే ఉంటుంది అని ఆర్థిక కార్యదర్శి స్కాట్ బెస్సెంట్ బుధవారం బ్లూమరాంగ్‌టీవీ ఇంటర్వ్యూలో వెల్లడించారు. భారత్‌పై సెకండరీ టారిఫ్‌లు, లేదంటే పరోక్ష ఆంక్షలు విధించే అవకాశం ఉంది అని స్కాట్ స్పష్టం చేశారు.భారత్ తమ మిత్ర దేశమంటూనే దిగుమతులపై 25 శాతం సుంకాలు విధించింది అమెరికా. అంతేకాదు.. ఉక్రెయిన్‌తో యుద్ధం చేస్తున్న రష్యాకు తమ వాణిజ్యం ద్వారా భారత్ పరోక్షంగా ఆర్థిక సాయం అందిస్తోందంటూ ట్రంప్ ఆ టైంలో ఆరోపించారు. ఈ తరుణంలో.. రష్యాతో చమురు, ఆయుధాల కొనుగోళ్లు ఆపకపో వడంతో పెనాల్టీ కింద మరో 25 శాతం మోపారు. దీంతో భారత్‌పై మిగతా 9లో..

జనంసాక్షి
www.janamsakshi.org
శుక్రవారం
15.08.2025

## భారత్ శక్తివంతమైన దేశం

మనల్ని విభజించాలనుకునే వారికి దీటైన జవాబు ఇచ్చింది. 'ఆపరేషన్ సిందూర్' ద్వారా ఉగ్రమూకలకు గుణపాఠం నేర్పింది. దేశాన్ని కాపాడే విషయంలో మన సాయుధ బలగాలు ఎలాంటి పరిస్థితులనైనా ఎదుర్కోవడానికి సిద్ధంగా ఉన్నాయని ఈ ఆపరేషన్ చాటి చెప్పింది. రక్షణ రంగంలో 'ఆత్మనిర్భర్ భారత్' కార్యక్రమం విజయానికి నిదర్శనంగా నిలిచింది. సుపరిపాలన, అవినీతిని సహించని విధానాలతో భవిష్యత్తు వైపు దేశం పయనిస్తోంది. గత ఆర్థిక సంవత్సరంలో 6.5 శాతం జీడీపీ వృద్ధి రేటుతో.. ప్రపంచంలోని ప్రధాన ఆర్థిక వ్యవస్థల్లో భారత్ అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతోంది. కశ్మీర్ లోయలో రైలు మార్గంతో స్థానికంగా వాణిజ్యం, పర్యాటకం మరింత మెరుగుపడతాయి" అని పేర్కొన్నారు."శుభాంశు శుక్లా అంతరిక్ష ప్రయాణం.. ఒక తరాన్ని గొప్ప కలలు కనేలా ప్రేరేపించింది. అదేవిధంగా దేశ మానవసహిత అంతరిక్ష కార్యక్రమం 'గగన్‌యాన్'కు ఇది చాలా ఉపయోగకరంగా ఉంటుంది. మరోవైపు.. నూతన ఆత్మవిశ్వాసంతో మన యువత క్రీడల్లో తమదైన ముద్ర వేస్తున్నారు. ముఖ్యంగా చదరంగంలో మునుపెన్నడూ లేని విధంగా భారత్ ఆధిపత్యం చెలాయిస్తోంది. 'జాతీయ విద్యా విధానం- 2020' విస్తృత మార్పులు తీసుకొచ్చింది. దేశంలో ఆదాయ అసమానతలు తగ్గుతున్నాయి. ప్రాంతీయ అసమానతలు కూడా కనుమరుగవుతున్నాయి. సామాజిక సంక్షేమంతో కూడిన సమగ్ర ఆర్థిక వృద్ధి.. 2047 నాటికి అభివృద్ధి చెందిన దేశంగా ఎదిగే దిశగా భారత్‌ను ముందుకు నడుపుతోంది" అని తెలిపారు.

### రాష్ట్రపతి ముర్ముది ఆలోచనాత్మక ప్రసంగం

దేశ సమష్టి పురోగతిని, రాబోయే అవకాశాలను ప్రధానంగా ప్రస్తావించారని తెలిపారు. దేశ స్వాతంత్ర్యం కోసం మహనీయులు చేసిన త్యాగాలను గుర్తుచేశారన్నారు. అదేవిధంగా.. దేశ నిర్మాణంలో ప్రతి పౌరుడు భాగస్వామికావాలని రాష్ట్రపతి పిలుపునిచ్చారని ప్రధాని 'ఎక్స్'లో పేర్కొన్నారు.

### ఉత్తమసేవలకు పతకాలు

ఒక గ్యాలంటరీ మెడల్, రెండు ప్రెసిడెంట్ మెడల్స్, 11 మెరిటోరియస్ సర్వీస్ మెడల్స్ ప్రకటించారు.ఏఎస్ఐ సిద్ధయ్య, నిడమానురి హుస్సేన్‌ను ప్రెసిడెంట్ మెడల్స్‌కు ఎంపిక చేశారు. ఆంధ్రప్రదేశ్‌కు రెండు ప్రెసిడెంట్ మెడల్స్, 20 మెరిటోరియస్ సర్వీస్ మెడల్స్ ప్రకటించారు.

## ఈవీఎంలను తెచ్చిందే రాజీవ్

### రాహుల్ పై మండిపడ్డ ఎంపి రఘునందన్

**హైదరాబాద్(జనంసాక్షి):**దేశానికి ప్రతిపక్ష నేతగా ఉన్న వ్యక్తికి వ్యవస్థల మీద నమ్మకం లేకపోవడం దురదృష్టకరమని ఎంపీ రఘునందన్‌రావు అన్నారు. హైదరాబాద్‌లోని ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. బ్యాలెట్ పేపర్ కాదని ఆ నాటి రాజీవ్‌గాంధీ కాంగ్రెస్ ప్రభుత్వం ఈవీఎంల ద్వారా ఎన్నికలు నిర్వహించింది. రాయ్‌బరేలిలో రాహుల్ రాజీనామా చేయాలి. రాహుల్ రాజీనామా చేస్తే బ్యాలెట్ ద్వారా ఎన్నిక నిర్వహిస్తామని అన్నారు. సోనియాగాంధీ, రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ, తెలంగాణ, కర్ణాటకలో కాంగ్రెస్ గెలిస్తే ఈవీఎంలు పనిచేసినట్టు-. బిహార్‌లో ఓడిపోతారు కాబట్టి ఈవీఎంలు పనిచేయడం లేదంటున్నారు. ఈవీఎంలను తెచ్చిందే రాజీవ్‌గాంధీ. రాహుల్‌గాంధీ గెలిచిన రాయ్‌బరేలిలో 2లక్షల ఓట్లు అను మానంగా కనిపిస్తున్నాయి. అక్కడ దొంగ ఓట్లతో గెలిచారు..రాహుల్ ఎ న్నికను రద్దు చేయాలని కోరబోతున్నామని అన్నారు. రాయబరేలి రాజీనామా చేసి బ్యాలెట్ పేపర్‌తో ఎన్నికకు సిద్ధమా? అని రాహుల్ గాంధీని బీజేపీ ఎంపీ రఘునందన్‌రావు ప్రశ్నించారు.

## జమ్మూకాశ్మీర్‌లో క్లౌడ్‌బరస్ట్

రోడ్లు కొట్టుకుపోయాయి. కిష్ట్వార్‌లో మెరుపు వరదలతో 220మంది గల్లంతయ్యారని అధికారులు చెబుతున్నారు.క్లౌడ్ బరస్ట్‌తో అప్రమత్తమైన రెస్క్యూబృందాలు వరదల్లో చిక్కుకున్న వందల మంది బాధితుల్ని రక్షించారు. సహాయక చర్యలు కొనసాగుతున్నాయి. గాయపడ్డ బాధితుల్ని అత్యవసర చికిత్స నిమిత్తం స్థానిక ఆస్పత్రికి తరలించాయి. చషోటీ ప్రాంతంలో ప్రతీ ఏడాది జూలై 25 నుండి సెప్టెంబర్ 5 వరకు మచైల్ మాతా యాత్ర ఉత్సవాలు కొనసాగుతాయి. ఈ ఏడాది చండీ మాత ఉత్సవాల్లో పాల్గొనేందుకు భారీ ఎత్తున భక్తులు తరలివచ్చారు. అయితే క్లౌడ్ బరస్ట్ కారణంగా మచైల్ మాతా ఉత్సవాల్లో పాల్గొన్న భక్తులు, స్థానికుల మరణాలు సంఖ్య పెరిగే అవకాశం ఉందని అధికారులు అంచనా వేస్తున్నారు.వరద సంభవించిన చషోటీ ప్రాంతం మచైల్ మాతా యాత్రకు ప్రారంభ ప్రాంతంతో పాటు కిష్ట్వార్‌లోని హిమాలయ మాతా చండి మందిరానికి వెళ్లే మార్గంలో వాహన సదుపాయం ఉన్న చివరి గ్రామం కూడా. దీంతో క్లౌడ్ బరస్ట్ కారణంగా చషోటీ ప్రాంతంలో భారీ ఎత్తున ప్రాణ నష్టం జరిగే అవకాశం ఉందని తెలుస్తోంది.ఇప్పటికే ముంచెత్తిన వరద నుంచి గ్రామస్తులతో పాటు భక్తులను సురక్షిత ప్రాంతాలకు తరలిస్తున్నట్లు కిష్ట్వార్ జిల్లా డిప్యూటీ కమిషనర్ పంకజ్ శర్మ తెలిపారు. వరదలపై జమ్మూకశ్మీర్ ఉదంపూర్ ఎంపీ, కేంద్రమంత్రి జితేంద్ర సింగ్ అప్రమత్త మయ్యారు. క్లౌడ్ బరస్ట్ జరిగిన ప్రాంతంలోని అధికారుల్ని అడిగి తెలుసుకున్నారు. సహాయకచర్యల్ని వేగవంతం చేయాలని అదేశాలు జారీ చేశారు.మేఘ విస్ఫోటనం అనంతరం చోటు- చేసుకున్న పరిణామాలపై గవర్నర్, సీఎంలతో కేంద్ర మంత్రి అమిత్ షా ఫోన్ చేసి మాట్లాడారు. అలాగే ఎన్డీఆర్ఎఫ్, ఎస్డీఆర్ఎఫ్, భద్రతా దళాలు, పోలీసులు సంయుక్తంగా ఈ సహాయక చర్యల్లో పాల్గొన్నారు. సహాయక చర్యలు కొనసాగుతున్నాయని కేంద్ర మంత్రి జితేంద్ర సింగ్ వెల్లడించారు. అయితే ఈ వర్షాల కారణంగా మరణించిన వారి సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. కిష్టావర్ డిప్యూటీ- కమిషనర్ పంకజ్ కుమార్ శర్మ సహాయక చర్యలను దగ్గరుండి పర్యవేక్షిస్తున్నారు. ఈ ఘటనపై జమ్మూకాశ్మీర్ గవర్నర్ మనోజ్ సిన్హా స్పందించారు. మృతుల కుటు-ంబాలకు సానుభూతి తెలిపారు. అలాగే సహాయక చర్యలు తీసుకోవాలంటూ పౌర, పోలీస్, ఆర్మీ, ఎన్డీఆర్ఎఫ్, ఎస్డీఆర్ఎఫ్ అధికారులకు గవర్నర్ కీలక ఆదేశాలు జారీ చేశారు. ఇంకోవైపు దేశ రాజధాని ఢిల్లీ, హిమాచల్‌ప్రదేశ్‌లో ఎడతెరపి లేని భారీ వర్షాలు కురుస్తున్నాయి. ఈ రోజు అంటే




గురువారం ఢిల్లీ, పరిసర ప్రాంతాల్లో మరింతగా భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని భారత వాతావరణ శాఖ వెల్లడించింది. ఇక హిమాచల్ ప్రదేశ్ అంతటా కురుస్తున్న భారీ వర్షాల కారణంగా రాష్ట్రంలో మౌలిక సదుపాయాలు తీవ్రంగా దెబ్బతిన్నాయి. రాష్ట్రంలో రుతుపవనాలు ప్రవేశించిన నాటి నుంచి ఇప్పటివరకూ 241మంది మరణించారని ఆ రాష్ట్ర ప్రభుత్వం వెల్లడించింది. వారంతా.. వర్షాధార విపత్తులతోనే మరణించారని వివరించింది.

**సీఎం ఒమర్ అబ్దుల్లా విచారం**

ముఖ్యమంత్రి ఒమర్ అబ్దుల్లా కార్యాలయం జిల్లా యంత్రాంగంతో సంప్రదిస్తున్నట్లు, అన్ని సహాయక చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపింది. కిష్ట్వార్‌లో జరిగిన విషాదంపై సీఎం ఒమర్ అబ్దుల్లా విచారం వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలకు సంతాపం తెలిపారు. లెఫ్టినెంట్ గవర్నర్ మనోజ్ సిన్హా పోలీసు,సైన్యం,రెస్క్యూ బృందాలు సహాయక చర్యలను ముమ్మరం చేయాలని ఆదేశించారు. 'కిష్ట్వార్‌లో జరిగిన క్లౌడ్ బరస్ట్ బాధ కలిగించింది. మృతుల కుటుంబాలకు సంతాపం. గాయపడినవారు త్వరగా కోలుకోవాలనేది నా ఆకాంక్ష. పౌరులు, పోలీసు,సైన్యం, ఎన్డీఆర్ఎఫ్, ఎస్డీఆర్ఎఫ్ అధికారులు రక్షణ, సహాయ కార్యకలాపాలను బలోపేతం చేయాలని, బాధితులకు కావాల్సిన సహాయం అందించాలని ఆదేశించినట్లు చెప్పారు.

**ఉత్తరకాశీ విలయానికి.. 'క్లౌడ్ బరస్ట్' కారణం కాదా?**

రెండు ఎన్డీఆర్ఎఫ్ బృందాలు ఇప్పటికే చోసిటీకి తరలి వెళ్లాయి. అదనపు ఎస్డీఆర్ఎఫ్ బృందాలు, హెలికాప్టర్లను సిద్ధం చేస్తున్నారు. మాచైల్ మాతా మందిరం సముద్ర మట్టానికి సుమారు 2,800 మీటర్ల ఎత్తులో ఉంది. జులై 25న ఈ యాత్ర మొదలైంది. జమ్మూ (%జీుఎఎబ ఖుంప్ట్రఎఅతీ%) డివిజన్ నుంచి వేల సంఖ్యలో యాత్రికులు ఇక్కడకు వచ్చారు. సెప్టెంబర్ 5వ తేదీన ఈ యాత్ర ముగియనుంది.

**హిమాచల్ ప్రదేశ్‌లో కూడా..**

హిమాచల్ ప్రదేశ్‌లో కూడా భారీ వర్షాలు కొనసాగుతున్నాయి. అక్కడ బుధవారం క్లౌడ్‌బరస్ట్‌లు చోటు చేసుకొన్నాయి. శిమ్లా, లాహౌల్-స్పితి ప్రాంతాల్లో చాలా నిర్మాణాలు కొట్టుకుపోయాయి. దాదాపు జాతీయ రహదారులతో సహా 300 మార్గాలను మూసివేశారు. శిమ్లాలోని విద్యుత్తు సరఫరా కార్యాలయం కూడా దెబ్బతింది. ఇక కుల్లు జిల్లాలో క్లౌడ్ బరస్ట్ చోటు చేసుకొందని కలెక్టర్ వెల్లడించారు.

**కంట్రోల్ రూమ్ ఏర్పాటు..**

కిశ్త్‌వాడ్ ప్రాంతంలోని చోసిటీలో ఆకస్మిక వరదలతో జమ్మూకశ్మీర్ అధికార యంత్రాంగం అప్రమత్తమైంది . ప్రజలు, యాత్రికులకు సహాయం అందించేందుకు కంట్రోల్ రూమ్, హెల్ప్ డెస్క్‌ను ఏర్పాటు చేసింది. ఐదుగురు అధికారులను కంట్రోల్ రూమ్‌లో అందుబాటులో ఉంచింది. ఈ నంబర్లకు 9858223 125, 6006701934, 9797504078, 84928 86895, 8493801381, 7006463710 కాల్ చేయొచ్చని సూచించారు. అలాగే, కిశ్త్‌వాడ్ జిల్లా కంట్రోల్ నంబర్లు 01995-259555 %ఖఅం% 9484217492, పోలీస్ కంట్రోల్ రూం నంబర్ 9906154100కు కాల్ చేయొచ్చని సూచించింది.





జూబ్లీహిల్స్ నివాసంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసిన ప్రముఖ కవి అందెశ్రీ

## తెలంగాణలో ఆర్థిక పరిస్థితి దివాళా

చేశారు. రేవంత్ నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం అవలంబిస్తున్న అస్తవ్యస్త ఆర్థిక విధానాలతోనే తెలంగాణకు ఈ దుస్థితి వచ్చిందని విమర్శించారు.తెలంగాణ చరిత్రలో తొలిసారిగా జూన్, జులై నెలల్లో ద్రవ్యోల్బణం మైనస్‌లో నమోదైందన్నారు కేటీఆర్. జులైలో రాష్ట్ర ద్రవ్యోల్బణం -0.44%గా ఉండగా, జాతీయ సగటు ం2.10%గా ఉందన్నారు. జూన్‌లో రాష్ట్రంలో -0.93%గా ఉంటే, దేశవ్యాప్తంగా +1.55%గా ఉందని చెప్పారు. గ్రామీణ ప్రాంతాల్లో డిఫ్లేషన్ (ద్రవ్యోల్బణం తగ్గుదల) మరింత తీవ్రంగా ఉందని కేటీఆర్ తెలిపారు.ద్రవ్యోల్బణం తగ్గడం సానుకూల సంకేతం కాదన్న కేటీఆర్, రాష్ట్ర ఆర్థిక వ్యవస్థకు ఇది ప్రమాదకర సంకేతమని హెచ్చరించారు. ప్రజలు అత్యవసరాలకు మాత్రమే ఖర్చు చేస్తున్నారని, వ్యాపార,వాణిజ్య, పారిశ్రామిక రంగాలన్నీ స్తంభించిపోయాయని చెప్పారు. కొత్త ఉద్యోగాల కల్పన లేకపోవడం, ఆర్థిక కార్యకలాపాలు మందగించడమే ఈ పరిస్థితికి కారణమన్న ఆర్థిక నిపుణుల సూచనలను ప్రభుత్వం పట్టించుకోవాలన్నారు.ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం ఆర్థిక కార్యకలాపాలను పూర్తిగా నిర్వీర్యం చేసిందని కేటీఆర్ మండిపడ్డారు. "ఒకప్పుడు దేశంలోనే అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న తెలంగాణ ఇప్పుడు తిరోగమనంలోకి వెళ్లడం బాధాకరం. క్లూలెస్ కాంగ్రెస్ పాలనలో శక్తివంతమైన ఆర్థిక వ్యవస్థ నాశనమవుతోంది," అని విమర్శించారు. "హోప్‌లెస్ గవర్నమెంట్, హెల్ప్‌లెస్ గవర్నెన్స్" అంటూ ప్రభుత్వంపై తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. ఆచరణ సాధ్యం కాని హామీలు ఇచ్చి కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఆశలు చూపించి మోసం చేసిందని కేటీఆర్ విమర్శించారు. ఉద్యోగ కల్పనకు సంబంధించి ప్రభుత్వం దగ్గర ఎలాంటి స్పష్టమైన ప్రణాళిక లేదని ఆరోపించారు.

## దుస్సాహసం చేశారో జాగ్రత్త!

ప్రధాని షెహబాజ్ షరీఫ్ భారత్‌పై బెదిరింపులకు దిగారు. పాకిస్థాన్‌కు చెందిన ఒక్క నీటి చుక్కను కూడా భారత్ గుంజుకునేందుకు అవకాశం ఇవ్వబోమని తెలిపారు. ఒకవేళ పాక్‌కు చెందాల్సిన నీటిని అడ్డుకునేందుకు భారత్ సాహసిస్తే, వాళ్లకు గట్టి గుణపాఠం నేర్పుతామని ప్రేలాపనలు చేశారు. అంతకుముందు పాక్ మాజీ మంత్రి బిలావల్ భుట్టో యుద్ధ బెదిరింపులకు దిగారు. భారత్ చేసిన పని వల్ల పాకిస్థాన్?కు భారీగా నష్టం వాటిల్లిందని అన్నారు. అందుకే భారత ప్రధాని నరేంద్ర మోదీకి వ్యతిరేకంగా పాకిస్థానీ ప్రజలంతా ఏకం కావాలని భుట్టో కోరారు.అంతకుముందు అమెరికాలోని ఫ్లోరిడాలో జరిగిన ఓ కార్యక్రమంలో మాట్లాడిన పాకిస్థాన్ ఆర్మీ చీఫ్ అసీమ్ మునీర్, భారత్‌పై మరోసారి నోరుపారేసుకున్నారు. తమది అణ్వాయుధ సామర్థ్యం కలిగిన దేశమని, ఒకవేళ భవిష్యత్తులో భారత్ నుంచి తమ అస్థిత్వానికి ముప్పు ఎదురైతే తమతో పాటు సగం ప్రపంచాన్ని నాశనం చేస్తామంటూ వ్యాఖ్యానించారు. సింధూ నదిపై భారత్ డ్యామ్‌లు నిర్మించే వరకు ఎదురుచూస్తామని, ఆ తర్వాత వారు కట్టే ఆనకట్టలను 10 క్షిపణులతో పేల్చేస్తామని తెలిపారు.అయితే, ఈ వ్యాఖ్యలపై భారత్ సైతం దీటుగానే బదులిచ్చింది. పాకిస్థాన్ అణ్వాయుధాలు కలిగిన ఉన్మాద దేశమని తీవ్ర స్థాయిలో దుయ్యబట్టింది. అమెరికా అండ చూసుకుని ఇప్పుడు పాకిస్థాన్? తన అసలు రంగు చూపిస్తోందని విరుచుకుపడింది. దేశ భద్రత కోసం అన్ని చర్యలు తీసుకుంటామని పేర్కొంటూ కేంద్ర విదేశాంగ శాఖ ఓ ప్రకటన విడుదల చేసింది.పాకిస్థాన్ సైన్యాధిపతి అసీం మునీర్ అమెరికా పర్యటనకు వెళ్లడం గత రెండు నెలల్లో ఇది రెండోసారి.

## దక్షిణ తెలంగాణతో ఉప్పొంగుతున్న వాగులు

వాహనదారులు ఇబ్బందులు పడ్డారు. వేములపల్లి మండలం లక్ష్మీదేవి గూడెం వద్ద వాగు పొంగి ప్రవహిస్తుండడంతో మిర్యాలగూడ, సూర్యాపేట వయా భీమవరం రాకపోకలు నిలిచిపోయాయి. పోలీసులు ఇరువైపులా కంచ వేసి రాకపోకలను నిలిపివేశారు. అదేవిధంగా శెట్టిపాలెం వద్ద చిత్రపరకవాగు ఉధృతంగా ప్రవహిస్తున్నడంతో పరిసర ప్రాంతాలలోని పొలాలు కొంతమేర నీటమునిగాయి. తుంగపాడు, అడవిదేవులపల్లి మార్గంలో రామన్నపేట వద్ద వాగు ఉధృతంగా ప్రవహిస్తూ వరద నీరు రోడ్డు పైకి రావడంతో రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. వాగు ఉధృతి తగ్గిన తర్వాత గ్రామస్థులు రాకపోకలు కొనసాగిస్తున్నారు. సూర్యాపేట జిల్లా కోదాడలో కురుస్తున్న భారీ వర్షాలకు లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. షిర్డీ సాయి నగర్, తులసీ నగర్, గణేష్ నగర్, నయా నగర్ కాలనీల్లో వరద నీరు నిలిచిపోయింది. కోదాడ పెద్ద చెరువు మత్తడితో అనంతగిరి-కోదాడ ప్రధాన రహదారి మధ్య రాకపోకలు నిలిచిపోయాయి. మోతె మండలం ఉర్లుగొండ వద్ద పాలేరు వాగు ఉప్పొంగడంతో రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. ముంపు ప్రాంతాలను అధికారులు పర్యవేక్షిస్తున్నారు. ప్రజలను అక్కడి నుంచి తరలించే ప్రయత్నాలు చేస్తున్నారు. సూర్యాపేట జిల్లా నడిగూడెం మండల కేంద్రంలోని చౌదరి చెరువు మత్తడి దూకడంతో వరద నీరు భారీగా ప్రవహిస్తుంది. ఎస్సీ, బీసీ కాలనీలోకి వరద ఒకేసారి ప్రవహించడంతో ఇళ్లల్లోకి నీళ్లు చేరాయి. దీంతో కాలనీవాసులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మార్కెట్ కమిటీ చైర్మన్ ఏపూరి తిరుపతమ్మ, అధికారులు సహాయ చర్యల్లో నిమగ్నమయ్యారు. ఇంట్లోకి చేరిన నీరును కాలనీవాసులు బయటకు ఎత్తి పారేస్తున్నారు. చౌదరి చెరువు మత్తడితో నడిగూడెం నుంచి వెళ్లే పలు గ్రామాలకు పూర్తిస్థాయిలో రాకపోకలు బంద్ అయ్యాయి. దేశంలోనే అతి పెద్ద బహుళార్థక ప్రాజెక్టు అయిన నాగార్జున సాగర్‌కు కృష్ణమ్మ పరవళ్లు తొక్కుతున్నది. ఎగువన కురుస్తున్న వర్షాలకు కృష్ణమ్మ శాంతి ఇచ్చేటట్లు కనిపించడం లేదు. దీంతో నాగార్జున సాగర్ 26 క్రస్ట్ గేట్లను ఎత్తి దిగువకు నీటి విడుదల చేస్తున్నారు అధికారులు. అందులో 8 గేట్లు పది అడుగులు, 18 గేట్లు 10 అడుగుల మీద ఎత్తి 2,60,344 క్యూసెక్కుల నీటిని కిందికి వదులుతున్నారు. సాగర్‌కు ఎగువ నుండి ఇన్ ఫ్లో 2,52,840 క్యూసెక్కులు వస్తుండగా, 2,93,110 క్యూసెక్కుల నీటిని ఔట్ ఫ్లో గా దిగువకు విడుదల చేస్తున్నారు. ప్రాజెక్టు పూర్తి స్థాయి నీటి మట్టం 590.00 అడుగులు కాగా ప్రస్తుతం 588.30 అడుగులకు చేరింది. పూర్తి స్థాయి నీటి నిల్వ 312 టీఎంసీలకు గాను ప్రస్తుతం 306.9878 టీఎంసీలుగా కొనసాగుతుంది. జల విద్యుత్ కేంద్రంలో విద్యుత్ ఉత్పత్తి సైతం కొనసాగుతూనే ఉంది. భారీ వర్షాలు నేపథ్యంలో నాగార్జున సాగర్ ఎడమ కాలువకు సాగు నీటి విడుదలను ఎన్నెస్పీ అధికారులు నిలిపివేశారు శ్రీశైలం జలాశయానికి భారీగా వరద ప్రవాహం.. ఏడు గేట్లు ఎత్తి నీరు విడుదల

### ప్రాణ, ఆస్తినష్టం జరగొద్దు

సహాయక చర్యల కోసం ప్రతి జిల్లాకు రూ.కోటి విడుదల చేస్తున్నట్లు- తెలిపారు. సెలవులో ఉన్న అధికారులు, సిబ్బందిని వెనక్కి పిలిపించాలని కోరారు. వర్షాలపై అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్లకు మంత్రి ఆదేశాలు జారీ చేశారు. వచ్చే 3 రోజుల్లో భారీ వర్షాల దృష్ట్యా జాగ్రత్త చర్యలు చేపట్టాలన్నారు. వివిధ జిల్లాల్లోని పరిస్థితి గురించి కలెక్టర్లను మంత్రి పొంగులేటి అడిగి తెలుసుకున్నారు. లోతట్టు ప్రాంతాల్లో చేపట్టాల్సిన రక్షణ చర్యలపై ఆదేశాలు జారీ చేశారు. జీహెచ్ఎంసీలో మున్సిపల్, ట్రాఫిక్ విభాగాలు, మెట్రో వాటర్ బోర్డు సమన్వయంతో పని చేయాలన్నారు.మెదక్, సంగారెడ్డి, వికారాబాద్ జిల్లాలకు వాతావరణ శాఖ అధికారులు రెడ్ జోన్ హెచ్చరికలు జారీ చేశారు. ఈ జిల్లాల్లో అత్యంత భారీ వర్షం కురిసే అవకాశం ఉందని తెలిపారు. నిర్మల్, నిజామాబాద్, కామారెడ్డి, జయశంకర్ భూపాలపల్లి, ములుగు, భద్రాద్రి కొత్తగూడెం, మహబూబాబాద్, సూర్యాపేట, మేడ్చల్ మల్కాజిగిరి జిల్లాలకు ఆరెంజ్ హెచ్చరికలు జారీ చేశారు. ఈ జిల్లాల్లో అతి భారీ వర్షం కురిసే అవకాశం ఉంది. మిగతా అన్ని జిల్లాల్లో భారీ వర్షం కురిసే అవకాశం ఉంది.. ఈ జిల్లాలకు ఎల్లో హెచ్చరికలు జారీ చేశారు.

తెలంగాణ ప్రభుత్వము
రెవిన్యూ (భూసేకరణ) శాఖ
**ఫారం-6**
**(ప్రాథమిక ప్రకటన)**
(తెలంగాణ సవరణ చట్టం 2016లోని ఛాప్టర్ IIIఎ లోని 10ఎ అనుసరించి)
(చట్టంలోని సెక్షన్-11 క్రింద దీనిలో 10ఎ మినహాయింపు కలదు)
(నిబంధన 6/12 చూడుము)

గెజిట్ నెం. 50/2025 తేది:12-08-2025
జిల్లా కలెక్టర్ యాదాద్రి భువనగిరి తేది:07-08-2025
ఫైల్ నెం.జి/2296/2025
స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ (ఎల్ఎ) తేది:05-08-2025
యాదాద్రి భువనగిరి ఫైల్ నెం.ఎ/34/2025

తెలంగాణ ప్రభుత్వం / జిల్లా కలెక్టర్, యాదాద్రి భువనగిరి గారి ఆదేశానుసారం ఈ దిగువ నిర్దిష్టపరిచిన యాదాద్రి భువనగిరి జిల్లా వలిగొండ మండలం రెడ్లరేపాక గ్రామములో విస్తీర్ణం ఎ.0.07 గుంటల భూమి ప్రజా ప్రయోజనార్థం బునాదిగాని కాలువ నిర్మాణములో భాగముగా దిగువ చూపిన భూమి అవసరమైయున్నదని నిర్ణయించినారు.

కావున యాదాద్రి భువనగిరి జిల్లాలో వలిగొండ మండలం రెడ్లరేపాక గ్రామములో విస్తీర్ణం ఎ. 0.07 గుంటల భూమి ప్రజా ప్రయోజనార్థం బునాది గాని కాలువ నిర్మాణములో భాగముగా దిగువ చూపిన భూమి అవసరమైనందున ఈ క్రింద చూపిన విధముగా భూసేకరణ నిమిత్తం (డిక్లరేషన్) జారీ చేయనైనది.

జిల్లా:యాదాద్రి భువనగిరి మండలం: వలిగొండ
గ్రామం: రెడ్లరేపాక

| సర్వే నెం./ భూమి స్వభావం విస్తీర్ణం (ఎ.గుం) | పట్టాదారు పేరు మరియు తండ్రి/ భర్త పేరు | అనుభవదారు పేరు మరియు తండ్రి/ భర్త పేరు | విస్తీర్ణం (ఎ.గుం) | చెట్లు/ కట్టడములు |
|---|---|---|---|---|
| 695 ఖుష్కి/పట్టా 0.07 | మంచోజు జయమ్మ భర్త బ్రహ్మచారి | మంచోజు జయమ్మ భర్త బ్రహ్మచారి | 0.07 | - |
| | గొర్ల భారతమ్మ భర్త బాలయ్య | గొర్ల భారతమ్మ భర్త బాలయ్య | | బోరుబావి,పైప్ లైన్ |
| | గొర్ల స్వామి తండ్రి అచ్చయ్య | గొర్ల స్వామి తండ్రి అచ్చయ్య | | - |
| | గొర్ల జంగయ్య తండ్రి అచ్చయ్య | గొర్ల జంగయ్య తండ్రి అచ్చయ్య | | - |
| | గొర్ల సైదులు తండ్రి అచ్చయ్య | గొర్ల సైదులు తండ్రి అచ్చయ్య | | - |
| | గొర్ల గోపాల్ తండ్రి మల్లయ్య | గొర్ల గోపాల్ తండ్రి మల్లయ్య | | - |
| | మోదెపల్లోజు లావణ్య భర్త చంద్రమౌళి | మోదెపల్లోజు లావణ్య భర్త చంద్రమౌళి | | - |
| | గొర్ల మల్లేశ్ తండ్రి దానయ్య | గొర్ల మల్లేశ్ తండ్రి దానయ్య | | - |
| | కాసాని ప్రశాంతి భర్త కాసాని నర్సింహా | కాసాని ప్రశాంతి భర్త కాసాని నర్సింహా | | - |
| | | మొత్తం | 0.07 | |

సెక్షన్ 15 (కేంద్ర చట్టం 30/2013) క్రింద భూసేకరణపై వచ్చిన అభ్యంతరాలను పరిశీలించిన పిదప ఇట్టి ప్రకటన (డిక్లరేషన్) జారీ చేయనైనది. ఈ భూసేకరణ వలన నిర్వాసితులు కానందున పునరావాసం కల్పించబడు విస్తీర్ణం శూన్యం.

భూసేకరణ తలపెట్టిన భూమిలో బొగ్గు, ఇనుము, స్లేట్ మరియు ఇతర ఖనిజములు ఇట్టి భూములలో లేదా కొంత భాగములో లభ్యమైనచో, ఆ ఖనిజాలు ప్రాజెక్టు నిర్మాణమునకు ఉపయోగమున్న పక్షములో, వాటిని స్వీకరించబడును లేనిచో స్వీకరించబడవు.

పైన భూమిని భూసేకరణ చేయు భూముల యొక్క నమూనా ప్రత్యేక ఉప కలెక్టరు (భూసేకరణ), యాదాద్రి భువనగిరి జిల్లా నందు కార్యాలయపు పనివేళనందు చూసుకొనవచ్చును.

సం/- ప్రత్యేక ఉప కలెక్టర్ (భూ.సే) ఆర్ అండ్ ఆర్, విభాగము-2, ఇరిగేషన్ ప్రాజెక్ట్స్, యాదాద్రి భువనగిరి జిల్లా
సం/- అదనపు కలెక్టర్, యాదాద్రి భువనగిరి
సం/- జిల్లా కలెక్టర్, యాదాద్రి భువనగిరి

DIPR RO.No.486/LA/PP/Advt/Pub/2025-26

## ఆర్థిక వ్యవస్థ నిర్వహణలో ప్రభుత్వం విఫలం

### ప్రమాదపుటంచున తెలంగాణ ద్రవ్యోల్బణం: హరీశ్‌రావు

**హైదరాబాద్(జనంసాక్షి):** రాష్ట్ర ఆర్థిక వ్యవస్థ నిర్వహణలో రేవంత్‌రెడ్డి ప్రభుత్వం విఫలమైందని భారత రాష్ట్ర సమితి నేత, మాజీ మంత్రి హరీశ్‌రావు విమర్శించారు. రాష్ట్రంలో ద్రవ్యోల్బణం ప్రమాదకర స్థితికి చేరుకుందన్నారు. ఆర్థిక వ్యవస్థ తిరోగమనంలో వెళ్తోందనడానికి ఇదో ప్రమాదకర సంకేతమని.. రేవంత్ ప్రభుత్వం మాత్రం చోద్యం చూస్తోందని ఆక్షేపించారు. ప్రభుత్వ తప్పిదాలే దీనికి కారణమన్నారు.

## ఎప్పటికైనా అఖండ భారత్ ఏర్పాటు తప్పదు: గడ్కరీ

**నాగపూర్(జనంసాక్షి):**అనివార్య పరిస్థితుల్లో ఆనాడు దేశ విభజన జరిగిందని కేంద్రమంత్రి నితిన్ గడ్కరీ అన్నారు. భారత్-పాకిస్థాన్‌లు విభజనను గుర్తుచేసుకుంటే.. అనివార్య పరిస్థితుల్లోనే నాడు దేశ విభజన జరిగిందని గుర్తించాలని అన్నారు. ఏదో ఒకరోజు మళ్లీ అఖండ దేశంగా భారత్ మారుతుందని గడ్కరీ పేర్కొన్నారు. భారత్‌ను సూపర్ పవర్, విశ్వగురువుగా మార్చాలని కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ పిలుపునిచ్చారు. ప్రతి రంగంలో మనం బలంగా ఉంటేనే ప్రపంచం భారత్ మాట వింటుందన్నారు. నాగ్‌పుర్‌లో రాష్ట్ర నిర్మాణ్ సమితి ఆధ్వర్యంలో నిర్వహించిన ఓ కార్యక్రమంలో మాట్లాడిన ఆయన.. అప్పట్లో భిన్నత్వంలో ఏకత్వం భావనతో భారత్ దూసుకెళ్తోందన్న ఆయన.. సాయుధ బలగాల పనితీరుపై ప్రశంసలు కురిపించారు. ప్రపంచంలో మూడో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దేందుకు మోదీ ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. ఆత్మనిర్భరత సాధించడంతోపాటు- విశ్వగురువుగా భారత్ మార్చేందుకు కృషి చేయాలని గడ్కరీ పిలుపునిచ్చారు. ప్రతి రంగంలో భారత్ బలంగా ఉంటేనే ప్రపంచం మన మాట వింటుందన్నారు. అన్నిరంగాల్లో అగ్రగామిగా ఉండటంతోపాటు- ప్రతి పౌరుడు దేశభక్తితో ఉన్నప్పుడే 'విశ్వగురువు'గా మారుతుందన్నారు.

## తొలగించిన 65 లక్షల మంది పేర్లను బహిర్గతం చేయండి

ఓటర్ల జాబితాను జిల్లా స్థాయి వెబ్‌సైట్‌లలో ప్రదర్శించాలి' అని సుప్రీంకోర్టు తన ఉత్తర్వులో పేర్కొంది.కాగా, బీహార్లో ఎన్నికల సంఘం హడావుడిగా చేపట్టిన ప్రత్యేక ఓటర్ల జాబితాల సవరణను ప్రతిపక్షాలు తప్పుబడుతున్నాయి. మరోవైపు ఈ జాబితా సవరణలోని లోపాలు ప్రతీ రోజూ బయటపెడుతూనే ఉన్నాయి. వీటిపై సుప్రీంకోర్టులో పలు పిటిషన్లు దాఖలయ్యాయ. మరొకవైపు ఈసీ తన నిర్ణయాన్ని సమర్థించుకుంటూ, అనర్హులైన ఓటర్లను తొలగిస్తూ, ఓటర్ల జాబితాను శుద్ధి చేసేందుకే ఈ ప్రక్రియ చేపట్టినట్లు వివరణ ఇస్తూ వస్తోంది.. ప్రతిపక్షాలు సవరణ ప్రక్రియపై పలు అనుమానాలు వ్యక్తం చేస్తూనే ఉన్నాయి. ఇంతలో రాహుల్ మహారాష్ట్ర, కర్నా టకలలో ఓటర్ల జాబితాలో ఓట్ల చోరీని ఆధారాలతో సహా బయటపెట్టడంతో పాటు బీహార్ లో చేపట్టిన ప్రత్యేక ఓటర్ల జాబితా సవరణపైనా విమర్శలు గుప్పిస్తున్నారు.

### తొలగించిన పేర్లను ప్రచురిస్తాం


**న్యూఢిల్లీ(జనంసాక్షి):**బిహార్‌లో ఓటర్ జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ ద్వారా తొలగించిన 65 లక్షల మంది పేర్ల జాబితాను బూత్‌ల వారీగా ప్రదర్శిస్తామని ఎలక్షన్ కమిషన్ గురువారం సుప్రీంకోర్టుకు తెలిపింది. ఎలక్షన్ కమిషన్ బిహార్‌లో ఎస్ఐఆర్ చేపట్టి ఒక ముసాయిదా జాబితాను ప్రచురించింది. అందులో ఏకంగా 65 లక్షల మంది పేర్లను తొలగించినట్లు పేర్కొంది. దీనిపై ప్రతిపక్షాలు తీవ్రస్థాయిలో మండిపడ్డారు. ఓట్ల చోరీ జరిగిందని ఆరోపించాయి. దీనిపై కొందరు సుప్రీంను ఆశ్రయించారు. దీనిపై విచారణ జరిపిన సర్వోన్నత న్యాయస్థానం, తొలగించిన 65 లక్షల మంది ఓటర్ల జాబితాను ప్రచురించాలని ఈసీని ఆదేశించింది. వలస వెళ్లడం, డబుల్ రిజిస్ట్రేషన్, మరణం- ఇలా తొలగింపునకు గల కారణాలను కూడా పేర్కొనాలని ఈసీకి స్పష్టం చేసింది. దీనికి తాజాగా ఈసీ అంగీకారం తెలిపింది. తాజా నిర్ణయంతో బిహార్?లో తొలగించిన 65 లక్షల మంది పేర్లను బూత్‌ల వారీగా ప్రదర్శిం చనున్నారు. అంటే బూత్ స్థాయి అధికారి కార్యాల యాల్లో, పంచాయితీ కార్యాలయాల్లోని నోటీస్ బోర్డుల్లో ఓటర్ జాబితా నుంచి తొలగించిన వారి పేర్లను ప్రదర్శించనున్నారు. దీని వల్ల ప్రజలు నేరుగా గా తమ పేర్లను చూసుకోవడానికి వీలవుతుంది. ఒక వేళ తొల గించబడిన వ్యక్తుల జాబితాలో ఎవరైనా అర్హులైన ఓట ర్లు ఉంటే, వారు కచ్చితంగా తమ వాదనలను ఈసీ ఎదుట వినిపించవచ్చు. ఇందుకోసం వారు ఆధార్? కా ర్డు కాపీతో తమ విజ్ఞాపన పత్రాన్ని సమర్పించాల్సి ఉంటుంది.

### మైనర్ బాలికపై అత్యాచారం,హత్య కేసులో

## నిందితుడికి ఉరిశిక్ష

### నల్లగొండ పోక్సో కోర్టు సంచలన తీర్పు

**నల్గొండ,ఆగస్ట్14(జనంసాక్షి):**నల్గొండ పోక్సో కోర్టు సంచలన తీర్పు వెల్లడించింది. మైనర్ బాలికపై అత్యాచారం చేసి, ఆపై హత్య చేసిన నిందుతుడికి ఉరిశిక్ష విధిస్తూ సంచలన తీర్పు ఇచ్చింది. పోక్సో, హత్య కేసులో నిందుతుడికి ఉరిశిక్ష విధించింది. అంతేకాదు జరిమానాగా లక్షా పది వేల రూపాయలు కట్టాలని ఆదేశించింది. నిందుతుడికి ఉరిశిక్ష విధించిన నల్గొండ కోర్టుపై బాధిత కుటుంబసభ్యులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. తమ కూతురికి ఇన్నాళ్లకు న్యాయం



జరిగిందని ఆనందం వ్యక్తం చేస్తున్నారు. 2013లో మోహమీ ముక్రమ్ అనే వ్యక్తి 12 ఏళ్ల మైనర్ బాలికపై అత్యాచారం చేశాడు. బాలిక ఇంట్లో ఒంటరిగా ఉండటం చూసి అత్యాచారం చేశాడు. అనంతరం మైనర్ బాలికను హత్య చేశాడు. హత్య అనంతరం మృతదేహాన్ని నాలాలో పడేశాడు. మూడు రోజుల తర్వాత పోలీసులు బాలిక మృతదేహాన్ని గుర్తించారు. నిందితుడిపై నల్లగొండ వన్ టౌన్ పోలీస్ స్టేషన్లో కేసు నమోదైంది. 2015లో ఛార్జ్ షీట్ దాఖలు అయింది. గత 10 ఏళ్లుగా జిల్లా కోర్టులో వాదనలు జరిగాయి. పోక్సో, హత్య నేరం కేసులో తాజాగా నల్గొండ పోక్సో కోర్టు సంచలన తీర్పు వెల్లడించింది. పోక్సో కోర్టు ఇన్‌ఛార్జి న్యాయమూర్తి రోజా రమణి తీర్పు వెలువరించారు. మైనర్ బాలికపై అత్యాచారం చేయడంతో పాటు- హత్యకు పాల్పడిన కేసులో నిందితుడికి పోక్సో చట్టం కింద కోర్టు ఉరిశిక్ష విధించింది. 2013లో నిందితుడు మోహమ్మి ముకట్టుము, 12 ఏళ్ల బాలిక నల్గొండలోని ఇంట్లో ఒంటరిగా ఉండటం చూసి అత్యాచారానికి పాల్పడ్డాడు. అనంతరం ఆమెను హత్య చేసి మృతదేహాన్ని కాలువలో పడేశాడు. దీనిపై వన్‌టౌన్ పోలీసులు నిందితుడిపై పోక్సో చట్టం, హత్యా నేరం కింద కేసు నమోదు చేశారు. ఈ ఘటనపై గత 10 ఏళ్లుగా జిల్లా కోర్టులో వాదనలు జరగగా, నేడు పోక్సో కోర్టు ఇన్‌ఛార్జి న్యాయమూర్తి రోజా రమణి తుదితీర్పు వెలువరించారు.

# పోలీసులకు డిగ్రీ కనీస విద్యార్హత

- డిగ్రీ పూర్తిచేయలేని వారికోసం అవకాశం
- ఓపెన్ వర్సిటీతో తెలంగాణ పోలీస్ శాఖ ఒప్పందం




హైదరాబాద్, ఆగస్టు14 (జనంసాక్షి) : డాక్టర్ బీఆర్ అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ, తెలంగాణ పోలీసుశాఖ మధ్య అవగాహన ఒప్పందం కుదిరింది. దూరవిద్య విధానంలో కానిస్టేబుళ్లు డిగ్రీ చదివేందుకు వీలుగా యూనివర్సిటీ, పోలీసు అధికారులు ఎంఓయూ చేసుకున్నారు. ఈ మేరకు ఒప్పంద పత్రాలను డీజీపీ జితేందర్, వర్సిటీ–ఉన్నతాధికారులు మార్చుకున్నారు. డిగ్రీ పూర్తికాని కానిస్టేబుళ్లు, ఏఎస్సైలకు దూరవిద్య విధానం అమలు చేయనున్నారు. కానిస్టేబుళ్లకు కోర్సు మెటీ–రియల్, స్టడీ సెంటర్ యాక్సెస్ ఇస్తామని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ అధికారులు తెలిపారు. దేశంలోనే తొలిసారిగా తెలంగాణా పోలీస్ డిపోర్ట్‌మెంట్‌లో విధులు నిర్వహిస్తున్న వారందరికీ గ్రాడ్యుయేషన్ ఉండాలని నిర్ణయించామని డీజీపీ జితేందర్ తెలిపారు. అందులోభాగంగా గురువారం హైదరాబాద్‌లో తెలంగాణా పోలీస్, బీఆర్ అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీల మధ్య ఒప్పందం జరిగింది. ఈ సందర్భంగా డీజీపీ జితేందర్ మాట్లాడుతూ.. పోలీస్ డిపోర్ట్‌మెంట్‌లో 10వ తరగతి, ఇంటర్ చదివి గతంలో ఈ పోలీస్ శాఖలో చేరారని గుర్తు చేశారు. అయితే వారికి గ్రాడ్యుయేషన్ కల్పించాలని పోలీస్ శాఖ నిర్ణయం తీసుకుందన్నారు. వాని గ్రాడ్యుయేషన్ చేయించాలనే ఉద్దేశంతో అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీతో ఒప్పందం కుదుర్చుకున్నామని వివరించారు. డిపార్ట్‌మెంట్‌లో దాదాపు కానిస్టేబుల్, హెడ్ కానిస్టేబుల్స్.. 30 వేల మంది గ్రాడ్యుయేషన్ పూర్తి చేయని వారు ఉన్నట్లు తాము గుర్తించామని పేర్కొన్నారు. వచ్చే ఐదేళ్లలో పోలీస్ డిపార్ట్‌మెంట్‌లో అందరూ గ్రాడ్యుయేషన్ చేసిన వారిగా ఉండాలని తమ సంకల్పమని ఈ సందర్భంగా డీజీపీ జితేందర్ స్పష్టం చేశారు. ఇక అంబేద్కర్ యూనివర్సిటీ– వీసీ గంటా చక్రపాణి మాట్లాడుతూ.. దేశంలోని అన్ని రాష్ట్రాల పోలీస్ శాఖలకంటే.. మనం అన్ని రకాలుగా ఉత్తమ స్థానంలో ఉన్నామన్నారు. డీజీపీ జితేంద్రకి వచ్చిన అలోచనే ఇప్పుడు కార్యరూపం దాల్చిందని పేర్కొన్నారు. పోలీస్ శాఖలో ప్రస్తుతం వివిధ విభాగాల్లో, పలు పోస్టుల్లో పని చేస్తున్న వారిలో కొందరికి డిగ్రీ అర్హత లేదని తెలిపారు. పలు కారణాలతో డిగ్రీ చేయకపోవడం లేదా డిగ్రీ మధ్యలోనే ఆపేసిన వాళ్లు సైతం ఉన్నారని వివరించారు. అలాంటి వారికి మా యూనివర్సిటీ– ద్వారా ఓపెన్ డిగ్రీ చేసే అవకాశం కల్పిస్తున్నామన్నారు. అంతే కాకుండా.. వీళ్లకు అదనంగా పోలీసింగ్‌కి కావాల్సిన శిక్షణ సైతం అందిస్తామని తెలిపారు. ఒక వైపు విధులు నిర్వహిస్తూనే.. మరోవైపు చదువుకునే వెసులుబాటు–కల్పించనున్నామని తెలిపారు. పోలీస్ శాఖ ఆధ్వర్యంలోని ట్రైనింగ్ సెంటర్లను తాము ఈ అభ్యర్థుల కోసం వినియోగించుకోనున్నామని వీసీ ఘంటా చక్రపాణి చెప్పారు.

# ఏపీహెచ్‌ఎంఈఎల్ ప్రపంచంతో పోటీపడాలి

- సింగరేణి అనుబంధ సంస్థ అభివృద్ధికి చర్యలు తీసుకుంటాం
- విజయవాడ సమీపంలోని ఇబ్రహీంపట్నంలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు



ఇబ్రహీంపట్నం(జనంసాక్షి): ప్రపంచంతో పోటీ పడే స్థాయికి ఏపీహెచ్‌ఎంఈఎల్ (ఆంధ్ర ప్రదేశ్ హెవీ మిషనరీ ఇంజనీరింగ్ లిమిటెడ్) ఎదగాలని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు అన్నారు. గురువారం ఆయన ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని విజయవాడ పట్టణానికి సమీపంలో ఉన్న ఇబ్రహీం పట్నంలోని సింగరేణి అనుబంధ సంస్థ ఏపీహెచ్‌ఎంఈఎల్‌ను సింగరేణి సిఎండి బలరాం తో కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన కార్మికులతో తదుపరి మీడియాతో మాట్లాడారు. ప్రపంచవ్యాప్తంగా కొత్త పరిశ్రమల విడిభాగాలు తయారీ, పాత విడిభాగాలను మరమ్మతు చేసి సరఫరా చేస్తున్న ఇంజనీరింగ్ సంస్థలకు ఏపీహెచ్‌ఎంఈఎల్ కన్నా మించి మిషనరీ, మానవ వనరులు లేవని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు అన్నారు. సంస్థలో పనిచేసే అధికారులు, కార్మికులకు కావాల్సింది ఒక నిబద్ధత, ప్రపంచంతో పోటీ పడగలం అన్న ఆలోచన, ఉన్న వ్యవస్థను సక్రమంగా వాడుకోవడం ఎలా అన్న తపన ఉంటే చాలని, మనం కూడా ప్రపంచంతో పోటీ పడగలమని డిప్యూటీ సీఎం భరోసా కల్పించారు. ఈ సంస్థను ఉన్నతంగా తీర్చిదిద్దేందుకు త్వరలోనే ఒక కన్సల్టెన్సీ ని నియమిస్తాం వారు స్థానిక పరిస్థితులను అధ్యయనం చేసి నివేదిక ఇస్తారని తెలిపారు. ఆ నివేదిక ఆధారంగా ఏ తరహాలో ముందుకు పోవాలో ఆలోచన చేసి నిర్ణయం తీసుకుంటాం అన్నారు. అధికారులు, సిబ్బంది ఎంత బాగా పనిచేస్తే అంత బాగా లాభాలు సాధిస్తాం, స్థానిక యువతకు ఉద్యోగ అవకాశాలు ఉంటాయి, రాష్ట్రాల ప్రగతికి దోహదపడవచ్చు అని తెలిపారు. సంస్థను, ఉన్న మిషనరీని పరిశుభ్రంగా ఉంచాలి, యంత్రాలకు ఓవరాలింగ్ చేయాలి, రంగులు వేయాలని డిప్యూటీ సీఎం ఆదేశించారు. పనిచేసే సిబ్బంది తప్పకుండా భద్రతా చర్యలు పాటించాలని ఆదేశించారు. కార్మికుల శ్రమ, ఉన్నత ఆలోచనలతోనే ఈ పరిశ్రమ ముందుకు పోతుందని తెలిపారు. ఈ పరిశ్రమ సింగరేణి కాలరీస్ కు అవసరమైన కొత్త యంత్రాలు తయారు చేయడం, పాత యంత్రాల మరమ్మత్తు వరకే పరిమితం కాకుండా రాష్ట్రంలోనే కాదు, దేశానికి అవసరమైన ఆర్డర్స్ తీసుకొని బీహెచ్‌ఈఎల్ మాదిరిగా ఏపీహెచ్‌ఎంఈఎల్ పనిచేస్తుందని, థర్మల్ పవర్ స్టేషన్స్ కు అవసరమైన యంత్రాలు, యంత్రాల మరమ్మత్తు చేస్తుందని, ఈ సంస్థను భవిష్యత్తులో ఏ విధంగా అభివృద్ధి చేయాలని ఆలోచనలో రాష్ట్ర ప్రభుత్వం ఉందని డిప్యూటీ సీఎం తెలిపారు.

# స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా వ్యాస రచన పోటీలు

- స్పోకెన్ ఇంగ్లీష్ ట్రైనర్, సోషల్ సర్వీస్ ఆర్గనైజర్ హమీద్ షేక్



హైదరాబాద్ (జనంసాక్షి) : స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా వ్యాస రచన పోటీలను నిర్వహించనున్నట్లు స్పోకెన్ ఇంగ్లీష్ ట్రైనర్, సోషల్ సర్వీస్ ఆర్గనైజర్ హమీద్ షేక్ పేర్కొన్నారు. 6 నుంచి పదో తరగతి చదువుతున్న విద్యార్థులు ఈ పోటీల్లో పాల్గొనేందుకు అర్హులని ప్రకటించారు. "భారత స్వాతంత్ర్య సముపార్జన సాధనలో పండిత్ జవహర్ లాల్ నెహ్రూ పాత్ర' (ద రోల్ ఆఫ్ పండిత్ జవహర్ లాల్ నెహ్రూ ఆన్ అటెయినింగ్ ఫ్రీడమ్ ఫర్ ఇండియా)' అంశంపై ఆరు ఏ-4 సైజ్ పేపర్ లకు మించకుండా ఇంటి వద్ద నుంచి లేదా ఉపాధ్యాయుల సమక్షంలో వ్యాసం రాసి తమకు పంపాలని కోరారు. ఉత్తమ వ్యాసాలను ఎంపిక చేసి బహుమతులు అందజేయనున్నట్టు తెలిపారు. మిర్యాలగూడ నియోజకవర్గంలోని పాఠశాలల్లో చదువుతున్న తెలుగు, ఇంగ్లీష్, ఉర్దూ మీడియం విద్యార్థులు ఈ పోటీలో పాల్గొనవచ్చని తెలిపారు. వ్యాసాలు రాసిన అనంతరం పాఠశాల ప్రిన్సిపాల్/ సంబంధిత తరగతి ఉపాధ్యాయుడు/ తల్లిదండ్రులచే ధ్రువీకరణ చేయించుకున్న వ్యాసాలను న్యూ మున్సిపల్ కాంప్లెక్స్ లో డైమండ్ బేకరీ పక్కన ఉన్న ఎంఎస్ మొబైల్స్ లో ఆగస్టు 16వ తేదీ సాయంత్రం 7 గంటల లోపు అందజేయాలని కోరారు. వ్యాసం రాసిన పేపర్‌పై భాగంపై పేరు, తండ్రి పేరు, తరగతి, ఫోన్‌నెంబర్, స్కూల్ పేరు, పాఠశాల నెంబర్ కచ్చితంగా రాయాలని కోరారు. ఉత్తమ వ్యాసాలను అందించిన విద్యార్థులకు జ్ఞాపికలు, పతకాలను అందజేయనున్నట్టు హమీద్ షేక్ పేర్కొన్నారు.

# సింగపూర్ తెలుగు సమాజం స్వర్ణోత్సవాలకు కేటీఆర్‌కు ఆహ్వానం

హైదరాబాద్ (జనంసాక్షి) : ఆగస్టు 31న మెరీనా బే సాండ్స్ లో జరిగే వేడుకలకు హాజరుకావాలంటూ సింగపూర్ తెలుగు సమాజం లేఖ రాసింది. తెలంగాణ సాంస్కృతిక,రాజకీయ వారసత్వానికి ప్రతినిధి అయిన కేటీఆర్ రాక సింగపూర్ తెలుగు సమాజానికి స్ఫూర్తి–అధ్యక్షుడు బొమ్మారెడ్డి శ్రీనివాసరెడ్డి ఆయన్ని ఆహ్వానించారు. సింగపూర్‌లోని ప్రముఖ తెలుగు సాంస్కృతిక సంస్థ 'సింగపూర్ తెలుగు సమాజం' తన స్వర్ణోత్సవ వేడుకలకు తెలంగాణ శాసనసభ సభ్యులు, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కే. తారక రామారావు ను ప్రధాన అతిథిగా ఆహ్వానించింది. ఆగస్టు 31 తేదీన మెరీనా బే సాండ్స్ సింగపూర్ వేదికగా ఈ వేడుకలు జరగనున్నాయి. ఈ మేరకు కేటీఆర్‌కు సింగపూర్ తెలుగు సమాజం అధ్యక్షుడు బొమ్మారెడ్డి శ్రీనివాసరెడ్డి అధికారికంగా లేఖ రాశారు. తెలుగు భాష, సంస్కృతి సంప్రదాయాల పరిరక్షణ కోసం సింగపూర్ తెలుగు సమాజం కృషి చేస్తుందని శ్రీనివాసరెడ్డి ఆ లేఖలో తెలిపారు. సింగపూర్ లో ఉండే తెలుగు ప్రజల మధ్య ఐక్యత పెంపొందించేందుకు ఈ కార్యక్రమం దోహదపడుతుందన్నారు. తెలంగాణ సాంస్కృతిక, రాజకీయ వారసత్వానికి ప్రతినిధి అయిన కేటీఆర్ రాక సింగపూర్ తెలుగు సమాజానికి స్ఫూర్తిగా నిలుస్తుందన్నారు. ఈ స్వర్ణోత్సవ వేడుకల్లో పాల్గొని తమ సంస్థకు గౌరవం ఇవ్వాల్సిందిగా ఆయన కేటీఆర్‌ను కోరారు. సింగపూర్ తెలుగు సమాజం ఆహ్వానాన్ని కేటీఆర్ అంగీకరించారు.

# ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ అరెస్టు అక్రమం : కేటీఆర్

హైదరాబాద్ (జనంసాక్షి) : బీఆర్ఎస్ ప్రధాన కార్యదర్శి ఆర్.ఎస్. ప్రవీణ్ కుమార్ సహా ఇతర నాయకులను అక్రమంగా అరెస్ట్ చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని బి ఆర్ ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. పోడు భూముల పట్టాల కోసం ఉద్యమిస్తున్న కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా దిందా రైతన్నలకు మద్దతుగా నిలిచినందుకు బీఆర్ఎస్ ప్రధాన కార్యదర్శి ఆర్.ఎస్. ప్రవీణ్ కుమార్ సహా ఇతర నాయకులను అక్రమంగా అరెస్ట్ చేయడాన్ని తీవ్రంగా ఖండించారు. రైతుల చేతులకు సంకెళ్లు వేసి, వారి పక్షాన పోరాడుతున్న వారిని అక్రమంగా నిర్బంధించడం రేవంత్ ప్రభుత్వ గుండాగిరికి నిదర్శనమన్నారు. పోడు రైతులను వేధించడం ఆపి, వారికి వెంటనే పట్టాలు ఇవ్వాలని, కుట్రపూరిత అరెస్టులను మానుకుని కౌటాల పోలీసుల అదుపులో ఉన్న ఆర్.ఎస్. ప్రవీణ్ కుమార్ తో సహా బీఆర్ఎస్ నాయకులను తక్షణమే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేస్తూ, ప్రజల పక్షాన పోరాడుతున్న బీఆర్ఎస్ నాయకులపై కర్కశంగా విరుచుకుపడుతున్న రేవంత్ రెడ్డి ప్రభుత్వ పతనం దగ్గర్లోనే ఉందన్నారు.

# శివగిరి ప్రదక్షిణలో ఉప్పల



హైదరాబాద్ (జనం సాక్షి) : తమిళ నాడులోని అరుణాచలంలో మహదేవుడి శివగిరి ప్రదక్షిణ పూర్తి చేసుకొని, స్వామి వారిని టీపీసీసీ ప్రధాన కార్యదర్శి అంతర్జాతీయ ఆర్య వైశ్య ఫెడరేషన్ జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్, రాష్ట్ర అధ్యక్షుడు ఉప్పల శ్రీనివాస్ గుప్త కుటుంబ సభ్యులు, బంధువులు దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అరుణాచలం గిరిప్రదక్షిణ అంటే అరుణాచలం కొండ చుట్టూ 14 కిలోమీటర్ల దూరం నడుస్తూ చేసే ఒక పవిత్రమైన ప్రదక్షిణ అని దీనిని గిరివలం అని కూడా అంటారు. ఇది ఆధ్యాత్మికంగా చాలా ప్రాముఖ్యత కలిగి ఉంది, భక్తులు దీనిని పాపాలు పోగొట్టుకోవడానికి, అంతర్గత శాంతిని పొందడానికి మరియు దైవిక ఆశీర్వాదాలను పొందడానికి చేస్తారు అని ఆయన అన్నారు. ఆ స్వామి వారి దయతో అందరూ సుఖ సంతోషాలతో ఉండాలని ఆయన ఆకాంక్షించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో కాంగ్రెస్ ప్రభుత్వం దేవాలయాల అభివృద్ధి కి అన్ని విధాలా కృషి చేస్తుంది అని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో ఉప్పల శ్రీనివాస్ గుప్త వారి సతీమణి, ఐవీఎఫ్ ప్రథమ మహిళ ఉప్పల స్వప్న పెద్ద కుమారుడు సాయి కిరణ్ ,కోడలు శర్వారి , చిన్న కుమారుడు ఉప్పల సాయి తేజ వారి బంధువులు తదితరులు పాల్గొన్నారు.

# టూరిస్టుల భద్రత కోసం ప్రత్యేక పోలీస్ దళం

- తొలిదశలో టూరిజం శాఖకు 80 మంది పోలీసుల కేటాయింపు
- పోలీస్ శాఖ,టూరిజంల మధ్య సమన్వయ సమావేశంలో డిజిపి



హైదరాబాద్, ఆగస్టు14 (జనంసాక్షి) : తెలంగాణ రాష్ట్రంలో టూరిస్టుల భద్రత కోసం త్వరలో టూరిస్ట్ పోలీసులను కేటాయించనట్టు–రాష్ట్ర డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ డాక్టర్ జితేందర్ వెల్లడించారు. తెలంగాణ టూరిజం శాఖ, పోలీస్ శాఖల మధ్య సమన్వయ సమావేశం బుధవారం నాడు డిజిపి కార్యాలయంలో జరిగింది. టూరిజం శాఖ స్పెషల్ సీఎస్ జయేష్ రంజన్, శాంతి భద్రతల అడిషనల్ డిజిపి మహేష్ ఎం భగవత్ , టూరిజం శాఖ ఎం.డి వి.క్రాంతి, ఫిలిం డెవలప్మెంట్ కార్పొరేషన్ ఎం.డి సిహెచ్ .ప్రియాంక, ఇతర పోలీసు అధికారులు ఈ సమన్వయ సమావేశం లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా డిజిపి మాట్లాడుతూ.... తొలిదశలో టూరిజం శాఖకు అవసరమైన 80 మంది పోలీసు సిబ్బందిని త్వరలో కేటాయిస్తామని తెలియజేశారు. సెప్టెంబర్ 27వ తేదీన జరగనున్న వరల్డ్ టూరిజం డే సందర్భంగా టూరిస్ట్ పోలీసుల వ్యవస్థ సిద్ధం చేయాలని భావిస్తున్నట్లు– పేర్కొన్నారు. రాష్ట్రంలో ఉన్న పర్యాటక ప్రాంతాలైన అనంతగిరి, సోమశిల, రామప్ప, యాదగిరిగుట్ట, పోచంపల్లి, నాగార్జునసాగర్ ,బుద్ధవనం, భద్రాచలం, అమ్రాబాద్ తదితర ప్రాంతాలలో టూరిస్ట్ పోలీసులు పని చేస్తారని అన్నారు. రాష్ట్రంలో టూరిజం అభివృద్ధి చెందేందుకు పోలీస్ శాఖ పర్యాటక శాఖకు పూర్తిగా సహకరిస్తుందని తెలిపారు. షూటింగ్ పర్మిషన్లు కోసం, ప్రత్యేక కార్యక్రమాల నిర్వహణ కోసం పర్యాటక శాఖ విధి విధానాలను రూపొందించాలని డిజిపి సూచించారు. తద్వారా ఆయా కార్యక్రమాలకు భద్రత కల్పించడం పోలీస్ సిబ్బందికి సులభం అవుతుందని తెలిపారు. ప్రత్యేక కార్యక్రమాల నిర్వహణ కోసం సినీ నిర్మతలు ముందుగా తెలియజేస్తే కార్యక్రమాలకు భద్రత కల్పించే సమయం దొరుకుతుందన్నారు. సమావేశంలో స్పెషల్ సీఎస్ శ్రీ జయేష్ రంజన్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో టూరిజం అభివృద్ధి కోసం వివిధ కార్యక్రమాలను చేపట్టనునట్లు–తెలిపారు. విదేశీ టూరిస్టులతో పాటు దేశంలో ఉన్న టూరిస్టులు విస్తృతంగా పర్యాటక ప్రాంతాలను సందర్శిస్తారని వారికి భద్రత కల్పించేందుకు టూరిస్ట్ పోలీసు అవసరం ఉందని తెలిపారు. ఆధ్యాత్మిక, మెడికల్, వినోదాత్మక పర్యాటక ప్రాంతాలను సందర్శించేందుకు వచ్చే వారి భద్రత కోసం టూరిస్ట్ పోలీసులను కేటాయించాల్సి ఉందన్నారు. హైదరాబాద్ అడిషనల్ కమిషనర్ విక్రమ్ సింగ్ మాన్, మల్టీ జోన్ -2 ఐజిపి తఫ్సీర్ ఇక్బాల్, సైబరాబాద్ జాయింట్ కమిషనర్ గజరావు భూపాల్, రాచకొండ డిసిపి ఇందిర, ఏఐజి రమణ కుమార్, తదితరులు సమన్వయ సమావేశంలో పాల్గొన్నారు.

# వరదల్లో ప్రాణ, ఆస్తి నష్టం సంభవించకుండా పటిష్ట చర్యలు


- వరద సహాయక చర్యల కోసం జిల్లాలకు ముందస్తుగా కోటి రూపాయలు విడుదల
- భారీ వర్షాల నేపథ్యంలో తీసుకోవాల్సిన జాగ్రత్తల పై వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించిన మంత్రులు




ఖమ్మం, ఆగష్టు 14(జనం సాక్షి) : మంత్రిపొంగులేటి శ్రీనివాసరెడ్డి హైదరాబాద్ సచివాలయం నుంచి, మంత్రివర్యులు తుమ్మల నాగేశ్వరరావు ఖమ్మం కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుండి భారీ వర్షాల నేపథ్యంలో తీసుకోవాల్సిన జాగ్రత్తల పై సీఎస్ కే. రామకృష్ణారావు తో కలిసి అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు.ఈ సమావేశానికి కలెక్టరేట్ నుంచి జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి, పోలీస్ కమిషనర్ సునీల్ దత్, అదనపు కలెక్టర్లు డా. పి. శ్రీజ, పి. శ్రీనివాస రెడ్డి, ఖమ్మం నగరపాలక సంస్థ కమీషనర్ అభిషేక్ అగస్త్య లతో కలిసి పాల్గొన్నారు.ఈ సందర్భంగా మంత్రివర్యులు పొంగులేటి శ్రీనివాస రెడ్డి మాట్లాడుతూ 2 రోజుల నుంచి భారీ నుంచి అతి భారీ వర్షాలు రాష్ట్రంలోనే కొన్ని ప్రాంతాలలో కురుస్తున్నాయని అన్నారు. వాతావరణ శాఖ సూచనల ప్రకారం వరదల సమయంలో ఆస్తి, ప్రాణ నష్ట నివారణకు చర్యలు చేపట్టాలని అన్నారు. వరద పరిస్థితుల పై ముఖ్యమంత్రి ఎప్పటికప్పుడు సమీక్షిస్తున్నారని, వరద సహాయక చర్యలు చేపట్టేందుకు రాష్ట్రవ్యాప్తంగా జిల్లాలకు ముందస్తుగా కోటి రూపాయల చొప్పున ప్రభుత్వం విడుదల చేసిందని, అవసరమైతే మరిన్ని నిధులు కూడా విడుదల చేస్తామని అన్నారు. ఉమ్మడి జిల్లాలకు ఒక ప్రిన్సిపల్ కార్యదర్శి స్థాయి అధికారిని నియమించి, పర్యవేక్షణ చేస్తున్నట్లు అన్నారు. మంత్రివర్యులు తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడుతూ, ఖమ్మం జిల్లాకు సంబంధించి ఇప్పటి వరకు సమస్యలు లేవని, ఆకేరు, మున్నేరు, పాలేరు, వైరా, లంకాసాగర్ లు నిలకడగా ఉన్నాయని, ప్రమాదకర స్థితిలో లేవని అన్నారు. పొరుగున ఉన్న మహబూబాబాద్, వరంగల్ జిల్లాల్లో వర్షపాతాన్ని బట్టి ముందస్తు జాగ్రత్తలు చేపట్టాలని తెలిపారు. పాఠశాలలకు సెలవులు ప్రకటించామన్నారు. ఎస్డిఆర్ఎఫ్ మరో టీమ్ జిల్లాకు కేటాయించేలా చర్యలు తీసుకోవాలని అన్నారు. వర్షాలు పడిన చోట యుద్ధప్రాతిపదికన పారిశుద్ధ్య చర్యలు చేపట్టాలని, ఫీవర్ సర్వే ప్రారంభించాలని, పరీక్షలు ర్యాండం గా చేయాలని కలెక్టర్ అన్నారు.ఈ సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారిణి ఏ. పద్మశ్రీ, జిల్లా వ్యవసాయ అధికారి పుల్లయ్య, జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారిణి డా. కళావతి బాయి, ముఖ్య ప్రణాళిక అధికారి శ్రీనివాస్, ఎస్ఇ శ్రీనివాసా చారి, ఎం. వెంకటేశ్వర్లు, వెంకట్ రెడ్డి, మిషన్ భగీరథ ఇఇ లు పుష్పలత, వాణిశ్రీ, జిల్లా మత్స్య శాఖ అధికారి శివప్రసాద్, జిల్లా అగ్నిమాపక, ఎన్డిఆర్ఎఫ్, ఎస్డిఆర్ఎఫ్ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# పెద్దమ్మ గుడి కూల్చివేతపై విచారణ

- అమ్మవారి విగ్రహం భద్రపర్చండి
- కూల్చివేత వివరాలు తెలపాలన్న హైకోర్టు




హైదరాబాద్, ఆగస్టు14 (జనంసాక్షి) : బంజారాహిల్స్ రోడ్ నెం.12 పెద్దమ్మ గుడి కూల్చివేతపై గురువారం హైకోర్టు విచారణ చేపట్టింది. పెద్దమ్మ తల్లి విగ్రహాన్ని భద్రంగా భద్రపరచాలని సూచించింది. విగ్రహం కూల్చివేతపై పూర్తి వివరాలు సమర్పించాలని ప్రభుత్వాన్ని హైకోర్టు ఆదేశించింది. తదుపరి విచారణను ఈ నెల 18కు వాయిదా వేసింది. పెద్దమ్మ గుడి కూల్చివేతపై హైకోర్టులో లంచ్ మోషన్ పిటిషన్ నమోదైంది. అక్రమంగా కూల్చిన ఆలయాన్ని తక్షణమే నిర్మించాలని పల్లె వినోద్ కుమార్ అనే న్యాయవాది పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్‌పై ఇవాళ విచారణ చేపట్టిన న్యాయస్థానం విగ్రహాన్ని భద్రపరిచి.. కూల్చివేతలకు గల ఆధారాలను సమర్పించాలని ప్రభుత్వాన్ని ఆదేశించింది. బంజారాహిల్స్‌లోని పెద్దమ్మగుడి కూల్చివేతపై కొద్ది రోజులుగా వివాదం సాగుతోంది. కూల్చివేతకు నిరసనగా హిందూ సంఘాలు పెద్దఎత్తున నిరసనలు తెలిపారు. ఈ మేరకు గత మంగళవారం కుంకుమార్చాన పూజకు పిలుపునిచ్చారు హిందూ సంఘాల ప్రతినిధులు. ఈ పిలుపుతో పోలీసులు అప్రమత్తమయ్యారు. బంజారాహిల్స్‌కు వెళ్లే అన్ని మార్గాలనూ మూసివేశారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా పెద్దమ్మగుడి దగ్గర భారీగా పోలీసులను మోహరించారు. కాగా, తాజాగా ఈ ఘటనపై హైకోర్టులో విచారణ జరిగింది.

# ఓటు చోరీపై జనంలోకి రాహుల్

- ఎస్ఐఆర్, ఓటర్ల జాబితాలో లోపాలపై బీహార్ రాష్ట్రవ్యాప్తంగా 'ఓట్ అధికార్ యాత్ర'
- ఆగస్టు 17 నుంచి ప్రారంభించనున్న కాంగ్రెస్ అగ్రనేత

ఇండియా కూటమి నాయకులు బిహార్ అంతటా ఓటు అధికార్ యాత్రను చేపడతారని పేర్కొన్నారు. "ప్రమాదకరమైన ఎస్ఐఆర్, ఓటు చోరీకి వ్యతిరేకంగా యుద్ధాన్ని ప్రజా ఉద్యమంగా మార్చడానికి ఈ యాత్ర. యాత్రకు సన్నాహాలు, జన సమీకరణ వంటి ఏర్పాట్లపై చర్చించేందుకు బుధవారం ససారంలో ఇండియా బ్లాక్ నాయకులను కలిశాను. ఓటు అధికార్ యాత్ర సెప్టెంబర్ 1న పట్నాలోని గాంధీ మైదానంలో జరిగే ర్యాలీతో ముగుస్తుంది" అని కేసీ వేణుగోపాల్ ఎక్స్ పోస్ట్‌లో పేర్కొన్నారు. ఓటు చోరీ అనేది తమకు డూ ఆర్ డై సమస్య అని కాంగ్రెస్ పార్టీ మంగళవారం పేర్కొంది. ఆగస్టు 14 సాయంత్రం 'లోక్ తంత్ర బచావో మషాల్ మార్చ్‌లు'తో సహా వివిధ కార్యకలాపాల ద్వారా ఓటు చోరీపై తమ గొంతుకను ప్రజల్లోకి తీసుకెళ్లడానికి ఒక రోడ్ మ్యాప్‌ను ప్రకటించింది. పార్టీ ప్రధాన కార్యదర్శులు, ఇన్ ఛార్జ్‌లతో సమావేశం అనంతరం కాంగ్రెస్ పార్టీ చీఫ్ మల్లికార్జున ఖర్గే ఈ ప్రకటన చేశారు. కాంగ్రెస్ పార్టీ ఓటు చోరీ, ఎస్ఐఆర్ ను మూడు ముఖ్యమైన కార్యక్రమాలతో ప్రజల్లోకి తీసుకెళ్తుందని హస్తం పార్టీ నాయకుడు కన్హయ్య కుమార్ తెలిపారు. "ఆగస్టు 14న స్వాతంత్ర్య దినోత్సవానికి ముందు రోజు, అన్ని జిల్లా ప్రధాన కార్యాలయాలలో 'లోక్ తంత్ర బచావో మషాల్ మార్చ్' జరుగుతుంది. ఆగస్టు 22–సెప్టెంబర్ 7 మధ్య అన్ని రాష్ట్ర ప్రధాన కార్యాలయాలలో కాంగ్రెస్ 'ఓట్ చోర్, గద్దీ చోర్' (ఓటు దొంగలు, అధికారాన్ని వదులుకోండి) ర్యాలీలను నిర్వహిస్తుంది. సెప్టెంబర్ 15– అక్టోబర్ 15 మధ్య ప్రజలు తమ ఓటు హక్కును కాపాడుకోవడానికి సంతకాలు చేసే కార్యక్రమానికి చేపడతాం. ఈ కార్యక్రమాలపై ఇండియా కూటమి ఒకే మాటపై ఉంది" అని కన్హయ్య కుమార్ తెలిపారు. బిహార్‌లో ఓటరు జాబితా నుంచి దాదాపు 65 లక్షల మంది ఓటర్లను తొలగించింది ఈసీ. ఈ మేరకు ఇటీవల ముసాయిదాను రిలీజ్ చేసింది. దీంతో ఓటర్ల జాబితాలో అక్రమాలు జరిగాయని విపక్ష పార్టీలు ఆరోపణలు గుప్పిస్తున్నాయి. ఈ క్రమంలో ఈసీ, బీజేపీపై కాంగ్రెస్ అగ్రనేత, లోక్ సభలో విపక్ష నేత రాహుల్ గాంధీ విమర్శలు గుప్పిస్తున్నారు. స్కాన్ చేసిన ఓటరు జాబితా చిత్రాలను పోస్టు చేయడానికి బదులుగా డిజిటల్ ఓటరు జాబితాలను విడుదల చేయాలని డిమాండ్ చేస్తున్నారు. రాజ్యాంగాన్ని, ప్రజాస్వామ్యాన్ని కాపాడేందుకే ఈ పోరాటం చేస్తున్నట్లు పేర్కొన్నారు. అలాగే పార్లమెంట్ ఉభయసభల్లోనూ బిహార్ లో జరిగిన ఎస్ఐఆర్, ఓటు చోరీ అంశంపై విపక్షాలు ఆందోళనలు చేపట్టాయి. దీంతో పలుమార్లు సభాకార్యక్రమాలు వాయిదాపడ్డాయి. అలాగే ఎస్ఐఆర్‌ను వ్యతిరేకిస్తూ దేశ రాజధాని దిల్లీలో విపక్ష ఎంపీలు పార్లమెంట్ నుంచి ఈసీ ప్రధాన కార్యాలయం వరకు ఇటీవల ర్యాలీగా వెళ్లారు. ఈ ర్యాలీకి అనుమతి లేదంటూ దిల్లీ పోలీసులు వారిని అడ్డుకునే ప్రయత్నం చేశారు. దీంతో ఇండియా కూటమి ఎంపీలు బారికేడ్లు ఎక్కి నిరసన తెలియజేశారు. దీంతో రాహుల్ , ప్రియాంక గాంధీ సహా విపక్ష ఎంపీలను అదుపులోకి తీసుకుని అక్కడి నుంచి బస్సులో తరలించారు పోలీసులు. ఒక్కసారిగా అప్పుడు ఉద్రిక్త వాతావరణం ఏర్పడింది.

# 'ఓటుచోరీ'పై ఆధారాలివ్వండి

- రాహుల్ ఆరోపణలపై స్పందించిన ఈసీ

న్యూఢల్లీ (జనంసాక్షి) : దేశంలో అనేక చోట్ల ఓటర్ల జాబితాలో అవకతవకలు జరిగాయంటూ కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ సహా విపక్ష పార్టీలు చేస్తున్న ప్రచారంపై కేంద్ర ఎన్నికల సంఘం మరోసారి తీవ్రంగా స్పందించింది. ఈ క్రమంలో 'ఓటు చోరీ' అనే పదాన్ని పదే పదే వినియోగించడాన్ని తప్పుపట్టిన ఈసీ.. తప్పుడు కథనాలకు కారణమయ్యే 'అసభ్యకర పదాలు' ప్రచారం చేసే బదులు ఆధారాలు చూపించాలని పేర్కొంది."ఒక వ్యక్తి–ఒకే ఓటు'కు సంబంధించిన నిబంధన తొలి ఎన్నికలు జరిగిన 1951–52 నాటి నుంచి అమల్లో ఉంది. ఏ ఎన్నికల్లోనైనా ఎవరైనా రెండుసార్లు ఓటు వేసినట్లు ఆధారాలు ఉంటే లిఖితపూర్వక అఫిడవిట్ ఎన్నికల సంఘానికి ఇవ్వండి. ఎటువంటి ఆధారాలు లేకుండా దేశంలోని ఓటర్లందర్నీ 'చోర్'గా పిలవడం సరికాదు" అని ఎన్నికల సంఘం పేర్కొంది. ఇటువంటి చెడు పదబంధాలు ప్రచారం చేయడం కోట్లాది మంది ఓటర్లు, లక్షలాది మంది ఎన్నికల సిబ్బందిపై దాడిగా అభివర్ణించింది.ఓటర్ల జాబితాలో అవకతవకలు జరిగాయని ఆరోపిస్తున్న కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ.. కర్ణాటకలోని ఒక్క మహాదేవపుర నియోజకవర్గంలోనే లక్ష ఓట్లు చోరీకి గురయ్యాయని ఇటీవల ఆరోపించారు. బెంగళూరు సెంట్రల్ లోక్‌సభ పరిధిలో ఉన్న ఈ అసెంబ్లీ స్థానంలో ఓడిపోవడం వల్లే కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి అక్కడ ఓటమి పాలయ్యారని అన్నారు. వీటిపై స్పందించిన ఎన్నికల సంఘం.. ఆరోపణలకు లిఖితపూర్వంగా డిక్లరేషన్ ఇవ్వాలని కోరిన విషయం తెలిసిందే. అయినప్పటికీ ఓటరు జాబితాల్లో తప్పిదాలకు సంబంధించి వివిధ అంశాలను లేవనెత్తుతూ ఎన్నికల సంఘం పనితీరుపై కాంగ్రెస్ నేత విమర్శలు గుప్పిస్తూనే ఉన్నారు.

## ధీరుల త్యాగఫలం



ఎన్నో బెదిరింపు చర్యల ఎదిరింపు పరంపర
ఎన్నెన్నో తిరగబడి బిగించిన ఉక్కు పిడికిళ్ళు
మరెన్నో బలిదానాల నెత్తుటి మరకల పేజీలు
ఇంకెన్నో ఉవ్వెత్తున ఎగిసిపడే అగ్నికెరటాలు!
ఆంగ్ల వలస పాలన విముక్తికై
తూటాలకు ఎదురొడ్డి
బానిస బంధన ఛేదనకై
ఉరికంబానికి ఊయలలూగి
ఓ అహింసా వాదం
మరో సాయుధ పోరు మార్గం
కుల మత భాషా బేషజాలకు
నిప్పంటించిన వైనం !

లాల్ బాల్ పాల్ గాంధీ అంబేద్కర్ సరోజినీ
భగత్ ఆజాద్ అల్లూరి నేతాజీ వీరనారి ఝాన్సీ
వేలవేల ఉద్యమ దివిటీల ఉత్ప్రేరక కారకం
అంచెలంచెల క్విట్ ఇండియా ఉద్యమ శిఖరం

అఖండ భరత అశేష జన నినాదం
కవి గాయక నాయక చైతన్య ప్రవాహం
ఎదఎదలో దేశభక్తి సమైక్య గీతాలాపనం
నిద్రాణ జాతి యావత్తు జాగృతమైన వైనం!

అమెరికా పౌరహక్కుల సమరానికి ప్రేరణగా
దక్షిణాఫ్రికా వర్ణ వివక్ష పోరుకు మార్గదర్శిగా
ఒకటా రెండా శతవసంతాల పోరాట
ఘనచరిత
భరతమాత చరణాల చెంత నెత్తుటి
దీపారాధన!

దేశమిచ్చిన దేహం కణకణం దేశానికే
అర్పితం తల్లీ!
నీకోసం మరణం నా జన్మ ధన్యమనే సంకేతం
ధీరుల త్యాగగుణం భావితరం
ఆశల వారధి కోసం
స్వేచ్ఛ ఫలాలిచ్చిన అమర వీరులకు వందనం!

**స్వాతంత్ర్య దినోత్సవ శుభాకాంక్షలతో..**

**కవిరత్న నాశబోయిన నరసింహ (నాన),**
**ఆరోగ్య విస్తరణ అధికారి**
**8555010108**

# దేశానికి ముస్లింల త్యాగాలు దాచిన దాగని సత్యాలు

**భారత దేశ స్వాతంత్రం** అనగానే మొదటగా గుర్తచ్చేది గాంధీజీ, తర్వాత జవహర్ లాల్ నెహ్రు, సుభాష్ చంద్రబోస్, సర్దార్ వల్లభాయ్ పటేల్, బిపిన్ చంద్రపాల్, బాల గంగాధర తిలక్, సరోజినీ నాయుడు,లాల లజపతిరాయ్, భగత్ సింగ్, అబుల్ కలాం ఆజాద్, సరిహద్దు గాంధీగా పిలువబడే సర్ సయ్యద్ అహ్మద్ ఖాన్ లాంటి వారు మాత్రమే గుర్తస్తారు కానీ, ఈ దేశానికి మొదట జైహింద్ నినాదం ఇచ్చిందెవరు, ఇంక్విలాబ్ జిందాబాద్ అన్నదెవరు.? మొదటి జాతీయగీతం రాసిందెవరు.? భగత్ సింగ్‌కు తోడుగా నిలిచింది ముస్లిం అని ఎందరికి తెలుసు? బాబా సాహెబ్ అంబేద్కర్ ను పిలిచి గెలిపించిదెవరు? ఖిలాఫత్ ఆందోళన్, రేష్మి రుమాల్ ఉద్యమం చేసిందెవరు? జాతీయ జెండా త్రివర్ణ పతాకానికి వర్తమాన రూపం ఇచ్చింది హైదరాబాద్ వాసి అని ఎంత మందికి తెలుసు?

ప్రస్తుత మత రాజకీయాల్లో రాజ్యాంగ పీఠికలోని సెక్యులర్, సోషలిస్టు పదాలకే ప్రమాదం ఉన్న ఈ దేశంలో ఆనాటి వందల మంది ముస్లిం స్వాతంత్ర సమర యోధులు, వేల మంది త్యాగధనుల బలిదానాలు ఎందరికి తెలుసు.? ముఖ్యంగా ముస్లింల దేశ భక్తి, దేశం కోసం, దేశ విముక్తి కోసం హిందువులతో పాటు రక్తాన్ని ధారపోసి సర్వం త్యాగం చేసిన భారతీయ ముస్లిం సమర యోధులను చరిత్ర పుటల్లో నుంచి చించి వేసినా... చరిత్ర మరుస్తుందా.? రక్తం చిందిన ఈనేలలోని ఈ దేశ మట్టి మరువగలదా.?

79 ఏళ్ల స్వాతంత్ర భారతవనిలో ఎందరో మహనీయులు, ఎందరో త్యాగధనులు, అందరికీ వందనాలు, మన దేశ లక్షణం భిన్నత్వంలో ఏకత్వం, లౌకిక వాదం, స్వేచ్ఛా సమానత్వం, సౌభ్రతృత్వం, సోదరభావం అనే వివిధ పదాలు, సారె జహాసే అచ్చా హిందూసితా హమారా అనే గొప్ప గొప్ప కీర్తి ప్రతిష్టలు ఊరికే రాలేదు, ఈమట్టిలో అందరి త్యాగాలు దాగున్నాయి, కులమత భేదం లేని దేశం మనది, ఇక్కడ ఎన్నో మతాలు, జాతులు కులాలు, వర్గాలున్నాయి అయినప్పటికీ భారతీయులుగా కలిసి మెలిసి ఉంటున్నాం కాబట్టి భిన్నత్వంలో ఏకత్వం గల ప్రపంచం లోనే ఏకైక గొప్ప దేశం మనది, ఈ ఐక్యత ఈ నాటిది కాదు, 150 ఏళ్ల క్రితం కన్న ముందే భారత అవనిలో నాటుకు పోయిన వట వృక్షం లాంటిది, ఆనాడు 1857 లోనే బ్రిటిష్ వారి అరాచకాలను ఎదుర్కొడానికి మొదట ప్రాణ త్యాగం చేసింది 'మౌల్వి అహ్మదుల్లా షా'ను మత రాజకీయ నాయకులు మరిచినా చరిత్ర మరువలేదు, షా పై ఆంగ్లేయులు 50వేల బహుమతి ప్రకటించి ఉరిశిక్ష వేసారు,దేశ స్వాతంత్రం కోసం ధన, ప్రాణ త్యాగాలను లెక్క చేయకుండా బలైపోయిన కొందరు ముస్లిం మహనీయుల చరిత్రను యువత తెలుసుకోవాల్సిన అవసరం నేటి పరిస్థితుల్లో ఎంతైనా ఉంది

**కీలక పాత్ర పోషించిన ముస్లిం సమర యోధులు**

1857లొ సిపాయిల తిరుగుబాటుతో మొదటి స్వాతంత్ర సమరం మొదలైంది, ఆనాటి విద్రోహంలో హిందువులతో పాటు లక్షలాది ముస్లింలు మరణించారు, ఢిల్లీ నుండి కలకత్తా వరకు చెట్లపై వెలాడబడిన మత గురువుల శవాలు,యాభై వేల వరకు ఉరిశిక్ష వేయబడ్డారని అంచనా, వేలాది మందిని జైలు పాలయ్యారు, అండమాన్‌లోని కాలాపాని జైల్లో 90% ముస్లింలే, ఈనాటికి అక్కడ అధికంగా ముస్లింల సమాధులే ఉన్నాయి, ఆంగ్లేయులకు వ్యతిరేకంగా యువతను తయారు చేయడానికి మౌలానా 'ఖాసీం నానోతి' ఉత్తర్ ప్రదేశ్‌లొ దారుల్ ఉలూమ్ దేవ్ బంద్ మధర్సాను(పాఠశాల) నెలకొలిపారు, ఈమధర్స నుండి వచ్చిన మౌలానా మహమూద్ హాసన్, ఉబెదుల్ల సింధి వంటి విప్లవకారులు 1916-1920 లొ రేష్మి రుమాల్ ఆందోళన చేపట్టారు, విదేశాల్లో కూడా బ్రిటిష్ వ్యతిరేక ఉద్యమం నడిపారు,1919 లొ గాంధిజీతో కలిసి భారతీయ ముస్లింలు అలీ బ్రదర్స్, మౌలానా అబుల్ కలాం ఆజాద్ ఖిలాఫత్ ఉద్యమం చేపట్టారు. ముస్లిం లీగ్ నాయకుడైన అలీ జవహర్ ఖిలఫత్ ఉద్యమానికి ప్రముఖ పాత్ర పోషించారు, మరొక ఆశ్చర్యకర విషయమేమంటే 1803లోనే ఇస్లామిక్ పండితుడైన షా అబ్దుల్ అజీజ్ బ్రిటిష్ వారికి వ్యతిరేకంగా ఏకంగా ఫత్వనే జారీ చేసారు. వారికి గులాంగిరి చేయడం హరాం (పాపం)ప్రతి ముస్లిం దేశ స్వాతంత్రం కోసం తమకు తాము ప్రాణత్యాగానికి సన్నద్ధం కావాలని ఫత్వలొ ఆదేశించడం విశేషం, ఇలాంటి ఆదేశాల ప్రభావం వల్లనే ఎంతోమంది ముస్లింలు ప్రాణాలను త్యాగం చేయడానికి సిద్దపడ్డారు, అందుకే అతి పిన్నా వయస్కుడైన విప్లవకారుడు అశ్వాఖ్ ఉల్లా ఖాన్ నామాతృభూమిని ఆంగ్లేయుల శృంఖలాల నుంచి విముక్తి చేయాలనుకున్నాను. నా త్యాగం వృథా కాదు మరెందరో త్యాగధనులకు స్పూర్తినిస్తుందని, మతం ఏదైనా ఆంగ్లేయులను ఎదిరించడానికి ఐకమత్యంగా ఉండాలని చెప్పి మరీ ఉరితాడును ముద్దాడి మెడలో వేసుకున్నాడు, భగత్ సింగ్, రాజ్ గురు, సుఖ్‌దేవ్ కంటే నాలుగేళ్ల ముందే ఉరిశిక్ష పడిన దేశ భక్తుడు అశ్వాఖ్ ఉల్లా ఖాన్, ఆంగ్లేయులకు వ్యతిరేకంగా కథనలు రాసినందుకు ఉరిశిక్ష పడ్డ మౌలానా మీర్ బాకర్ మొదటి పత్రకారుడు, 1919లో జలియన్ వాలాబాగ్ ఘటనలొ జనరల్ డయ్యార్ జరిపిన కాల్పుల్లో కూడా చాలా మంది ముస్లింలు మరణించారు. 1928లొ సైమన్ కమిషన్ కు వ్యతిరేకంగా "సైమన్ గో బ్యాక్" ఉద్యమ నినాద సోషలిస్టు నాయకుడు ముంబాయి వాసి యూసుఫ్ మెహర్ అలీ, 1942లొ క్విట్ ఇండియా ఉద్యమం' గాంధీజీ నాయకత్వంలో చేపట్టిన ఈ ఉద్యమం.. స్వరాజ్యం సాధించాలన్న భారతీయుల ఆకాంక్షను బలంగా చాటి చెప్పింది, గాంధీజికు తోడుగా మౌలానా అబుల్ కలాం ఆజాద్, అరుణ అసఫ్ అలీ నిలిచారు, భరతమాత విముక్తి కోసం ఎందరో మహాత్ములు తమ సర్వస్వాన్ని అర్పించారు, సహాయ నిరాకరణ ఉద్యమంలొ భాగంగా భారత చక్కెర వ్యాపారవేత్త హాజీసిద్దిఖి తన చక్కెర కర్మాగారన్ని మూసివేశారు, ఇది ఇంగ్లాండ్ లొ అధికంగా చక్కెర సప్లై చేసే అతిపెద్ద భారత ఫ్యాక్టరి, భారత్ లోని బాటా కంపెనీ మొదట ముస్లిం వ్యాపారాస్తునిదే, తర్వాత ఆంగ్లేయులు స్వాదినం చేసుకున్నారు, కలకత్తా నగర బడా వ్యాపారవేత్త హాజీఉస్మాన్ కు 1920 వరకు కలకత్తా లోని అన్ని పాఠశాలలు, పెద్ద పెద్ద వ్యాపార భవనాలన్నీ ఆయనివే, స్వాతంత్ర పోరాటం కోసం వాటన్నిటిని హాజీఉస్మాన్ దానం చేసి చివరికి కిరాయి ఇంట్లో గడిపారు, కేవలం త్యాగలే కాకుండా హిందూమత సమర యోధులకు తోడుగా నిలిచి ఐక్యతను కాపాడారు, భగత్ సింగ్ ను కాపాడడానికి కేసు వాదించింది భారీష్టర్ ఆసిఫ్ అలీ అనే ముస్లిం న్యాయవాది, నేతాజీ సుభాష్ చంద్రబోస్ ఆజాద్ హింద్ సర్కార్ ఆఫ్ఘనిస్థాన్ లొ భారతదేశ తాత్కాలిక ప్రభుత్వ ఏర్పాటులొ సహాయపడ్డది ఉబెదుల్ల సింధి, రాజా మహేంద్ర ప్రతాప్, మౌలానా బర్కతుల్ల లాంటి వారే, ఓ ఎన్నికలో 1946 లొ దళితుడైన కారణంగా బాబాసాహెబ్ అంబేద్కర్ గారు ఓటమి చెందితే, బెంగాల్ ముస్లిం లీగ్ అంబేద్కర్ గారిని ఆహ్వానించి ముస్లిం ఇలాకాలో గెలిపించారు, దేశభక్తి గీతాలు, ఉర్దూ కవితలకు ఆజ్యం పోసింది ముస్లింలే, సారె జహాసే అచ్ఛా గీతాన్ని రాసిన మహమ్మద్ ఇక్బాల్ దేశానికే వన్నె తెచ్చారు, గాంధీజీ జైలులొ ఉన్నప్పుడు ఆ గేయాన్ని20 సార్లు పాడారట,

**స్వాతంత్ర ఉద్యమంలో వెల్లివిరిసిన ఐకమత్యం-దేశభక్తి చాటుకున్న యోధులు**



మన జాతీయగీతం అనగానే రబింద్రనాథ్ ఠాగూర్ గారు గుర్తస్తారు, చాలా మందికి తెలియని విషయమేమంటే 1857 లోనే అజిముల్లా ఖాన్ అనే విప్లవ రచయిత "హం హై ఇస్కె మాలిక్, హిందూస్తాన్ హమారా అని" మొట్ట మొదటి జాతీయగితాన్నీ రచించి అలపించారు, బ్రిటిష్ పాలకులకు వ్యతిరేకంగా ఇంక్విలాబ్ జిందాబాద్ నినాదాన్నిచ్చింది హస్రత్ మొహాని, జైహింద్ నినాదన్నిచ్చింది అబిద్ హాసన్ సఫానీ, గాంధీజీ కు మహాత్మా అని బిరుదునిచ్చింది మౌలానా మహామూద్ హాసన్ కాబట్టే ఈనాటికీ గాంధీ గారిని మహాత్మా అని పిలుస్తున్నాం, అదే విధంగా మన జాతీయ పతాక రూపకర్త పింగళి వెంకయ్య గారే అయినప్పటికీ దానికి అశోకచక్రాన్ని చేర్చి వర్తమాన తుది రూపమిచ్చింది బద్రోద్దీన్ త్యాబ్జి భార్య సురయ్య తయ్యబ్ గారని ఎంతమందికి తెలుసు? ఆమె మన హైదరాబాద్ నివాసి కావడం మనకు గర్వకారణం. ఈవిధంగా ముస్లిం మేధావులు, పండితులు, న్యాయవాదులు, విప్లవకారులు మొత్తం దేశాన్నే మేల్కొలిపారు, ఆనాడు స్వాతంత్రం కోసం మసీదులను కోట లాగా వాడుకున్నారు, ప్రతి నమాజు సమయంలో ఉద్యమ ప్రకటన చేసేవారు, అందుకే దేశంలోని మసీదులపై ముస్లిం యువకుల, పండితుల రక్తపు మరకులెండేవట, వీరే కాకుండా మైసూర్ పులి టిప్పు సుల్తాన్ బ్రిటిష్ పాలకులను ఎదిరించిన యోధుడు, 1857 నాటి మహిళ యోధురాలు బేగం హజ్రత్ మహల్, 1857 నాటి అమరవీరుడు పీర్ అలీ ఖాన్, డాక్టర్ సైఫోద్దీన్ కిచ్లు హిందూ ముస్లిం సిక్కుల ఐక్యతకు కృషి చేసి రౌలట్ చట్టాలకు వ్యతిరేకంగా పోరాటం చేసి గాంధీజీకు మద్దతుగా నిలిచారు, ఇస్లామిక్ సంస్కృతి పరదా పద్దతి నుండి బయటికి వచ్చి కొడుకులతో పోరాడిన అబాది బానో విప్లవ తల్లిగా నిలిచారు,ఇలా చెప్పుకుంటు పోతే వందల వేల మంది త్యాగధనులున్నారు, స్వాతంత్రం ప్రకటించిన ఆర్ధరాత్రి పాకిస్థాన్ విడిపోతుంటే అబుల్ కలాం ఆజాద్ గారు ఢిల్లీ జామా మసీదు దగ్గర నిలబడి ముస్లింలను అపుతూ మన పూర్వికుల త్యాగాలు భారతదేశ మట్టిలోనే ఉన్నాయని భారత్ లోనే ఉండాలని పిలుపునిచ్చారు, ఈ దేశం హిందూ ముస్లింల ఐక్యత, త్యాగాల పునాదులపై నిర్మించబడ్డది కాబట్టే మత సామరస్యం గల లౌకిక ప్రజాస్వామ్య స్వతంత్ర దేశంగా అవతరించింది. అందుకే చివరకు ఒక సందర్బంలో ఆంగ్లేయులు నిర్మోహమాటంగా చెప్పిన విషమేమంటే భారత్ లొ ముస్లింలే లేకుంటే భారత స్వాతంత్రం మరికొన్ని దశబ్దాల వరకు కలగానే మిగిలిపోతుండే అని చెబుతారు,ముస్లిం సమర యోధులు అన్ని మతాల వారితో కలిసి ఐకమత్యంతో ప్రాణ త్యాగాలతో సాధించుకున్న స్వరాజ్యాన్ని చరిత్ర మరువలేదు, శంకించలేని ముస్లింల దేశభక్తి దాచిన దాగని సత్యం



**సయ్యద్ జబి (లెక్చరర్)**
**9949303079**
**ప్రభుత్వ మైనారిటీ ఆధ్యాపక సంఘం (రాష్ట్ర అధ్యక్షులు)**

# నాటి స్ఫూర్తి ఏమైంది.. ఆ చరిత్ర చదవాలి



**బిఎస్ రాములు**
**సామాజిక తత్వవేత్త**
**8331966987**

15 ఆగస్టు భారత స్వాతంత్ర దినోత్సవం. ఇది అందరికి తెలుసు. కాని దీని సుదీర్ఘ చరిత్ర ఎందరికి తెలుసు? ఎన్ని ప్రత్యేకతలు ఉన్నాయో, ఎన్ని విషాదాలున్నాయో, ఎన్ని వేల లక్షల మంది త్యాగాలు బలిదానాలు. ఉరి శిక్షలు, ఎన్ని రకాల పోరాటాలున్నాయో ఎందరికి తెలుసు? ఒక్కసారి వికీపీడియాలో భారత స్వాతంత్ర దినోత్సవం అని వెతికితే వందల వేల వివరాలు. ఇంకా చేర్చకుండా ఉండిపోయినవి ఎన్నో! అవి యువతరం చదవాలి. తెలుసుకోవాలి. అపుడే స్వాతంత్రం విలువ ప్రాధాన్యత తెలుస్తుంది. ఇపుడు అమెరికా అధ్యక్షుడు ఇండియాను బంతిని తన్నినట్టు ఆడుకుంటున్నాడు. స్వాతంత్ర సమర యోధుల స్ఫూర్తి వుంటే పరిస్థితి ఎలా ఉండేది? అమెరికాలో వుండి మనవాళ్లు ఇండియా స్వాతంత్రం కోసం ఎత్తులు వేసారు. గదర్ పార్టీ వాళు ఇపుడుంటేనా? అసలు ఇండియాను ముట్టుకునేవారా? బిర్సా ముండా బతికివుంటే ఇన్ని ఘోరాలు, చత్తీస్‌లో కగార్ హత్యా కాండ చూస్తూ ఊరుకునేవాడా? అల్లూరి సీతారామ రాజు స్వదేశీ దోపిడి దొంగల్ని ఇలాగే వదిలేసే వాడా?

**ఆదివాసుల త్యాగాలకు ఫలితం?**

తాము తరతరాలు నివసిస్తున్న అడవి మీద భూమి మీద ఎవరో వచ్చి మాది అని వారితో బలవంతంగా పని చేయించడం, రైలు పట్టాలకు చదును చేయించడం, రోడ్లు వేయించడం, దోపిడి దౌర్జన్యాలు, అత్యాచారాలకు వ్యతిరేకంగా దేశ వ్యాప్తంగా వలస పాలన కాలంలో ఎక్కడి కక్కడ 170 గిరిజనులు తిరుగుబాట్లు చేసారు. ఎందరో రక్తం ధారపోస్తూ నేల కొరిగారు.

**సుభాష్ చంద్రబోస్ పౌరుషమేది?**

ఆజాద్ హింద్ ఫౌజ్ నిర్మించి యుద్ధంతోనే బ్రిటిష్ వారిని తరిమేయడం సాధ్యం అని వేలాది సైన్యం సమకూర్చాడు సుభాష్ చంద్రబోస్. ఆ పౌరుషమే వుంటే అమెరికాలో వున్న భారతీయులను బేడీలు వేసి ట్రంప్ ఇండియాకు పంపేవాడా?

**చక్రవర్తి చేసికొన్న 90 ఏండ్లకే మూడు ముక్కలవడం**

మన స్వాతంత్ర ఫలాలకోసం ఎందరు ఎన్ని త్యాగాలు చేసారు? మొదటి స్వాతంత్ర పోరాటం 1857లో జరిగినపుడు మా దేశానికి చక్రవర్తి బహదూర్ షా అని ప్రకటించుకున్నారు. 90 ఏండ్లు గడిచే సరికి మాకంటూ వేరే దేశం కావాలని మహమ్మదలీ జిన్నా, ముస్లింలీగ్ ఒత్తిడితో మొఘల్ సామ్రాజ్యం, బ్రిటిష్ సామ్రాజ్యంగా మారి చివరకు మూడు ముక్కలుగా విడి పోయింది. ఒక రోజు ముందే పాకిస్తాన్ స్వాతంత్ర జెండా ఎగిరింది. సరిహద్దులు గీసి మతాల వారీగా జనాభా తరలి పోయినపుడు హత్యలు మానభంగాలు దోపిడీలు ఎన్నని చెప్ప తరం? పది లక్షల మంది హత్లకు గురై రక్తం ప్రహించింది.

**ఆ రక్త సిక్త హత్యాకాండ సమయంలో రెండు దేశాధి నేతలు**

మహమ్మదలీ జిన్నా, జవహర్ లాల్ నెహ్రూ స్వాతంత్ర జెండా ఎగరేశారు. హతుల బంధువులు పిల్లలు ఆస్తులు ఎంత చిన్నాభిన్నమయ్యాయో ఎవరికి తెలుసు? భీష్మ సహానీ రాసిన తమస్ నవల కొండంతలో ఆవగింజంత! సల్మాన్ రష్దీ రాసిన అర్ధరాత్రి స్వాతంత్రం మరో ఆవగింజ. స్వాతంత్రం ఊరికే రాలేదు. రెండువందల ఏళ్లుగా పోరాటాలు చేస్తూనే వున్నారు. నెహ్రూ జెండా ఎగరేసే సమయంలో గాంధీ కలత్తాలో అల్లర్ల మధ్య నిరసనగా నిరాహార దీక్షలో ఉన్నాడు. అమెరికాకు స్వాంత్రం ఇచ్చిన బ్రిష్ వాళ్లు రెండు వందల ఏండ్లు ఎందుకు ఇండియాను పట్టుకొని పీడించారు? ఎందుకలా జరిగింది? యూరపు తెల్లవారి మరో దేశంగా అవరించినందున బ్రిటిష్ వాల్లు వాల్లను వదిలేసి నల్లవాల్ల దేశంగా, అనైక్యత కారణంగా కొనసాగారా? పరిపాలన చేపట్టాలనే లక్ష్యంతో చట్టాలు, రైల్లు, రోడ్లు, విద్య సంస్థలు, సంఘ సంస్కరణలు చేపట్టారు.



**సంఘ సంస్కరణ ఉద్యమాలు**

ఆ సమయంలోనే రాజా రామ్మోహన్ రాయ్ సతీ సహగమనం వ్యతిరేక ధ్యమం , దయానంద సరస్వతి, మహాత్మా జ్యోతిరావు పూలే విద్య సంస్థలు, కందుకూరి వీరేశ లింగం విధవా వివాహాల సంస్కరణలు మొదలయ్యాయి.

**రాజుల మధ్య కొట్లాటలో లాభపడ్డదెవరు?**

టిప్పు సుల్తాన్ ఓడి పోయి మైసూరు ప్రాంతం బ్రిటిష్ వారి పరమైంది. టిప్పు సుల్తాన్తో పోరాటంలో మద్దతు తీసుకున్నందుకు ఖర్చుల కింద నిజాం రాయల సీమను దారా దత్తం చేసాడు. కరువు కాటకాల నివారణకు, పంట పొలాలకు నీరందించడానికి సర్ ఆర్థర్ కాటన్ హయాంలో ప్రాజెక్టులు కట్టారు.

**నేటికీ విముక్తి పొందని భూములు**

ఇలా సంస్కరణలు, అభివృద్ధి పనులతో పాటు పరిపాలనలో భాగస్వామ్యం చేయడానికి అనేక చర్యలు తీసుకున్నారు. భూమిశిస్తు వసూలు చేయడానికి కొంత ప్రాంతానికి అధికారులుగా నియమించారు. వారిని జమీందార్లు జాగీర్ దారులు, మక్తదార్లు, భూస్వాములు అని పిలిచారు. 1840 నుండి మొదలైన ఈ వ్యవస్థ ప్రజలను పీడించి ఎదిగే వ్యవస్థగా మారింది. దాంతో వీరిపై తిరుగుబాట్లు మొదలయ్యాయి.

**క్రమంగా పరిపాలనలో భాగస్వామ్యం**

స్వాతంత్రం వచ్చింది. అంతకు ముందు 1921, 1935లో భారత బ్రిటిష్ రాజ్యాంగాలు ఏర్పడ్డాయి. పరిపానలో భాగస్వామ్యం చేస్తే ఏ సామాజిక వర్గాలకు ఎంతుండాలో అంశంపై సైమన్ కమిషన్ పర్యటించింది. అందరికి ఎట్లా ఇస్తారు అని కాంగ్రెస్ వ్యతిరేకించింది. దాంతో ముస్లింలీగ్ ఆ క్రమంలో పాకిస్తాన్ ఏర్పడేదాక పోయింది. స్వాతంత్రం ఇస్తే మా ప్రజల కేమి ఇస్తారు అని అంబేద్కర్ సైమన్ కమిషన్ ను కలిసి నివేదిక ఇచ్చారు. దాంతో కమ్యూనల్ అవార్డు ప్రకటించారు. గాంధీ దాన్ని వ్యతిరేకించి నిరహార దీక్ష చేయడంతో గాంధీ అంబేద్కర్ ఒప్పందంతో 1932లో పూనా ఒడంబడిక ఏర్పడింది.

**50శాతం జనాభాకు అందని ప్రజాస్వామ్య ప్రాతినిధ్యం**

78 ఏండ్ల స్వాంత్రం తర్వాత కూడా బీసీలకు చట్ట సభలలో రాజ్యాంగ బద్ద ప్రాతినిధ్యం ఏర్పడలేదు. ఆదివాసులకు స్వయంపాలిత అవకాశాలు లేవు. ఇలా తమ ప్రాంతాలు తమవి కాకుండా పోయాయి. 50శాతం జనాభా గల బీసీలకు చట్ట సభల్లో రాజ్యాంగ బద్దంగా ప్రాతినిధ్యం లేకుండా పోయింది. సమస్త రంగాల్లో వీరికి జనాభా దామాషా మేరకు రాజ్యాంగ బద్దంగా ప్రాతినిధ్యం కల్పించినపుడే 200 ఏండ్లుగా చేస్తున్న త్యాగాలకు సంపద ఉత్పత్తికి , ఉద్యమాలకు సమాన భాగస్వామ్యం అందుతుంది. అపుడే అందరికి నిజమైన సమాన స్వాతంత్రం! నేటి 15 ఆగస్టు కర్తవ్యం ఇదే! అందుకు అందరు పూనుకోవాలి.

**స్వాతంత్రంతో ఎవరికెంత వచ్చింది?**



1947 స్వాతంత్ర వచ్చింది. ముస్లింలకు పాకిస్తాన్ వచ్చింది. దళితులకు రిజర్వేషన్లు వచ్చాయి. బీసీలకు ఏం వచ్చింది? భూమి పన్ను కోసం పరిపాలన కోసం పెట్టిన జమిందారీ జాగిర్దారీ భూస్వామ్య వ్యవస్థ రద్దు కాలేదు. ప్రభుత్వ పరంగా దఖలు పడిన లక్షలాది ఎకరాలు వారి సొంత ఆస్తిగా మారి పోయాయి. అందువల్ల విద్య ఉద్యోగ రాజకీయ పరిపాలన న్యాయవ్యవస్థ రంగాల్లో ఆధిపత్యంలోకి స్థిర పడ్డారు. అదే క్రమం నేటికీ సాగుతున్నది. భూములను ప్రభుత్వం తిరిగి వాపసు తీసుకొని జాతీయం చేయాలన్న అంబేద్కర్ ఆశయం నెర వేరలేదు.



**ఈ రహదారులు రైల్లు ఎవరు వేసారు?**

ఈ నాడున్న జాతీయ రహదారులు, రైల్వే లైన్లు ఎవరి రెక్కల కష్టంతో అభివృద్ధి చెందాయో వారికేమైనా అందులో వారి అభివృద్ధి ఏమైనా జరిగిందా? నేటికీ భారత కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు వనవాసుల వనాలను, వన సంపదను, భూములను తనవని ప్రకటించి నిర్వాసితులను చేస్తున్నారు. స్వాతంత్రం వారి ప్రాంతాలను లాక్కోవడానికే వచ్చిందా? కాకతీయులతో పోరాడిన చరిత్ర సమ్మక్క సారలక్కలది!

# పార్లమెంటు ఎందుకు? రద్దు చేస్తే పోలే?

భారతదేశం ప్రపంచంలోనే అతిపెద్ద ప్రజాస్వామ్య దేశంగా పేరుపొందింది. ప్రజాస్వామ్యానికి మూల వేదిక పార్లమెంటు. అసలు పార్లమెంటు ఉన్నదే ...ప్రజా ప్రతినిధులు ప్రజా సమస్యలు చర్చించి, చట్టాలు రూపొందించటానికి. కానీ, జరుగుతుంది ఏమిటి? 2014 నుంచి ఇప్పటివరకు (2025 వరకు) చాలా బిల్లులు విపక్షాలతో చర్చ లేకుండా, ఏకపక్షంగా పాస్ అవుతున్నాయి. ఇది ప్రజాస్వామ్య స్ఫూర్తికి పూర్తిగా విరుద్ధం. ఈ వ్యాసంలో, అలాంటి బిల్లుల జాబితా, అవి చట్టా లుగా మారిన విధానం, అలాంటి శాసనాలకు ఉండే విలువ, అలాంటి ప్రజా వ్యతిరేక చట్టాలను పౌరులు ఎందుకు పాటించాలి? ఎవరి కోసం ఇలాంటి చట్టాలు తయార వుతున్నాయి?, అలాగే నూతన పార్లమెంటు భవన నిర్మాణం అవశ్యకత ఏముంది? మొదలైన అంశాలను గురించి వివరంగా తెలుసుకుందాం.

2014 నుంచి 2025 వరకు ఏకపక్షంగా పాస్ అయిన బిల్లులు అనేకం. ఉదాహరణకు కొన్ని ముఖ్యమైన బిల్లుల జాబితా చూస్తే... 2014లో నరేంద్ర మోదీ నేతృత్వంలోని ఎన్‌డీఏ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత, పార్లమెంటు సమావేశాల్లో విపక్షాల నిరసనలు, గందరగోళం మధ్య చాలా బిల్లులు చర్చలు లేకుండానే పాస్ అయి పోతున్నాయి. "పార్లమెంట్ రీసెర్చ్ సర్వీస్ ఆఫ్ ఇండియా" (పీఆర్ ఎస్ఐ) డేటా ప్రకారం, 16వ లోక్‌సభ (2014-2019)లో మొత్తం గా 133 బిల్లులు పాస్ అయ్యాయి. వీటిలో చాలావరకు పార్లమెంటులో చర్చ కానీ.. లేదా పార్లమెంటు కమిటీల పరిశీలనకు కానీ.. పంపకుండానే ఆమోదించబడ్డాయి. 17వ లోక్‌సభలో కూడా ఇదే ధోరణి కొనసాగింది. 2021 "మాన్‌సూన్ సెషన్"లో 20 బిల్లులు కూడా చర్చ లేకుండా పాస్ అయ్యాయి. 2023లో 47 బిల్లులు ప్రవేశపెట్టబడ్డాయి, వాటిలో 30 బిల్లులు కనీసం నామమాత్రపు చర్చ కూడా లేకుండానే పాస్ అయ్యాయి.పైగా చాలావరకు విపక్ష సభ్యులను ఏదో కారణంతో సస్పెండ్ చేసిన తర్వాత అధికార పక్షానికి మెజారిటీ ఉంది కనుక, చర్చలు లేకుండానే బిల్లులు ప్రజాస్వామిక స్ఫూర్తికి విరుద్ధంగా పాస్ అవుతూ చట్టాలు గా రూపొందుతున్నాయి.

**కొన్ని ముఖ్యమైన ఉదాహరణలు :** "ఆధార్ యాక్ట్- 2016" మనీ బిల్‌గా ప్రవేశపెట్టి, రాజ్యసభను బైపాస్ చేసి పాస్ చేశారు. చర్చ లేకుండా "వాయిస్ వోట్ " ద్వారా ఆమోదం పొందింది. "సిటిజన్‌షిప్ అమెండ్‌మెంట్ యాక్ట్ (సీఏఏ), 2019" : విపక్ష నిరసనల మధ్య, మినిమల్ డిబేట్‌తో పాస్ అయింది. దేశవ్యాప్తంగా నిరసనలు జరిగినా, చర్చకు స్పీకర్ అవకాశం ఇవ్వలేదు. "ఫార్మ్ బిల్లులు- 2020 " "మూడు వ్యవసాయ చట్టాలు ( ఫార్మర్స్ ప్రొడ్యూస్ ట్రేడ్ అండ్ కామర్స్ బిల్, అలాగే "ఫార్మర్స్ ఎంపవర్ మెంట్ అండ్ ప్రొటెక్షన్ అగ్రిమెంట్ బిల్, అలాగే ఎసెన్షియల్ కమోడిటీస్ ఎమెండ్ మెంట్ బిల్) మొదలైన అతి ముఖ్యమైన బిల్లులు కూడా విపక్షాల గందరగోళం మధ్య "వాయిస్ వోట్"తో పాస్ అయ్యాయి. రైతుల నిరసనలు ఏడాది పాటు కొనసాగిన తర్వాత 2021లో "రీపీల్ బిల్" కూడా చర్చ లేకుండా పాస్ అయింది. "ట్రిపుల్ తలాక్ బిల్-2019" "ముస్లిం మహిళల రక్షణ బిల్", కూడా వివాదాస్పదంగా చర్చకు తక్కువ సమయం కేటాయించి ఆతురతతో బిల్ నెగ్గింది. "ఫారెస్ట్ (కన్సర్వేషన్) అమెండ్‌మెంట్ బిల్, 2023" కూడా దాదాపు చర్చ లేకుండానే బిల్ పాసైంది. "న్యూ క్రిమినల్ లాస్, 2023" " భారతీయ న్యాయ సంహిత, భారతీయ నాగరిక సురక్ష సంహిత, భారతీయ సాక్ష్య చట్టం" మొదలైన అతి ముఖ్యమైన బిల్లులు కూడా విపక్ష సభ్యుల సస్పెన్షన్ తర్వాతనే పాస్ అయ్యాయి.

**2025 బిల్లులు :** "వక్ఫ్ (అమెండ్‌మెంట్) బిల్, 2025 " ముస్లిం ఎండోమెంట్స్" సంబంధిత వివాదాస్పద బిల్ కూడా లోక్‌సభలో చర్చ లేకుండా పాస్ చేశారు. "ఇన్‌కమ్ టాక్స్ (నెం-2) బిల్, 2025" బీ "టాక్సేషన్ లాస్ అమెండ్‌మెంట్ బిల్, 2025" బీ "నేషనల్ స్పోర్ట్స్ గవర్నెన్స్ బిల్, 2025" బీ "నేషనల్ యాంటీ-డోపింగ్ (అమెండ్‌మెంట్) బిల్, 2025" బీ "మైన్స్ అండ్ మినరల్స్ అమెండ్‌మెంట్ బిల్, 2025' బీ "ఇండియన్ పోర్ట్స్ బిల్, 2025" మొదలైన అతి ముఖ్యమైన బిల్లులు అన్నీ విపక్ష సభ్యుల నిరసనల మధ్య చర్చకు స్పీకర్, రాజ్యసభ చైర్మన్ అనుమతించ కుండా నే " వాయిస్ వోట్" తో పాస్ అయ్యాయి.

**ఇవి అన్నీ కేవలం ఉదాహరణలు** మాత్రమే. "పార్లమెంట్ రీసెర్చ్ సర్వీస్ ఆఫ్ ఇండియా" (పీఆర్ ఎస్ఐ) డేటా ప్రకారం, 2014-2025 మధ్య సంవత్సరానికి సగటున 60 బిల్లులు పాస్ అవుతున్నాయి. వీటిలో 30-40 శాతం కూడా చర్చ లేకుండానే బిల్లులు చట్టాలుగా మారుతున్నాయి. భారత రాజ్యాంగం ప్రకారం, బిల్ పాస్ అయిన తర్వాత రెండు సభలు (లోక్‌సభ, రాజ్యసభ) ఆమోదించి, రాష్ట్రపతి సంతకంతో ఆమోదిస్తే ఆ బిల్లు చట్టమవుతుంది. కానీ, ఏకపక్ష బిల్లుల విషయంలో "వాయిస్ వోట్" ద్వారా చాలా బిల్లులు విపక్షాల గందరగోళం మధ్య పాస్ అవుతున్నాయి .

"సస్పెన్షన్ ఆఫ్ రూల్స్" క్రింద "రూల్స్ సస్పెండ్" చేసి, చర్చా సమయం గణనీయంగా తగ్గిస్తున్నారు. 2023లో విపక్ష సభ్యులు 141 మందిని సస్పెండ్ చేసి బిల్లులు పాస్ చేశారు.లోక సభ స్పీకర్,అలాగే రాజ్యసభ చైర్మన్ నిష్పక్షపాతంగా స్వాతంత్ర్యగా వ్యవహరించకుండా... బీజేపీ పార్టీ సభ్యులుగా పనిచేయటం దురదృష్టకరం. ఇలాంటి అప్రజాస్వామిక చర్యలు...ఈ పదకొండు సంవత్సరాలలో అనేకం జరిగాయి. అలాగే కొన్ని ముఖ్యమైన బిల్లులు రాజ్యసభను బైపాస్ చేసేందుకు "మనీ బిల్" గా "క్లాసి ఫై" చేయడం ద్వారా బిల్లులు పాస్ చేస్తారు. ఉదాహరణకు: 'ఆధార్ యాక్ట్,' 'పీఎంఎల్ఏ అమెండ్‌మెంట్స్ యాక్ట్ 'పార్లమెంటులో చర్చ లేకపోయినా "ప్రెసిడెంట్ అసెంట్" : (ఆమోదం) తర్వాత చట్టంగా మారుతుంది. ఇది ఒక "ఫార్మాలిటీ"గా మారింది. విపక్షాలను చర్చకు అనుమతించకుండా బిల్లులు పాస్ చేసుకోనే విధానం పార్లమెంటు ఉనికికే ప్రమాదం. అయినా బీజేపీ ప్రభుత్వం మోదీ నాయకత్వంలో అప్రజాస్వామిక ప్రభుత్వాన్ని నడపటానికే సిద్ధపడుతున్నారు. ఈ తంతు గత 11 ఏళ్ళుగా సాగుతోంది. ఇలాంటి విధానం వల్ల బిల్లులు కమిటీలకు పంపకుండా, ప్రజా అభిప్రాయం తీసుకోకుండా చట్టాలవుతున్నాయి.

**చర్చలు లేకుండా చేసే చట్టాలు ఎవరి కోసం? :** ఇలాంటి చట్టాలు ప్రభుత్వ అజెండగా, కార్పొరేట్ ఇంట్రెస్టుల కోసమే. ఉదా: "ఫార్మ్ బిల్లులు" కార్పొరేట్‌లకు లాభం చేకూర్చేలా ఉన్నాయని ఆరోపణలు. విపక్షాలు, ప్రజలు లేవనెత్తిన సమస్యలు (ఉదా: ఓటర్ లిస్ట్ మానిపులేషన్) చర్చకు రానివ్వకుండా, ప్రభుత్వ బిల్లులు పాస్ చేయడం వల్ల, ఇవి సామాన్య ప్రజల కోసం కాదు, అధికార పార్టీ రాజకీయ లాభాల కోసమే అని అర్థం అవుతుంది. ఇలాంటి చర్యలు ప్రజాస్వామ్యాన్ని అవహేళన చేయడమే అవుతుంది.

**వేల కోట్ల ప్రజాధనం వృథా? :** పాత పార్లమెంటు భవనం ఈ పాటి ప్రస్తుత అవసరాలకు సరిపోతుంది.కానీ మోదీ వ్యక్తి గత ప్రతిష్ట కోసం "సెంట్రల్ విస్టా ప్రాజెక్టు కింద, కొత్త పార్లమెంటు భవనం" సుమారు రూ. 20,000 కోట్లకుపైగా ఖర్చుతో నిర్మించారు. చర్చలు జరగకుండానే బిల్లులు పాస్ అవుతుంటే, అందమైన భవనాలు కట్టుకొని ఏమిటి ఉపయోగం? ఇది ప్రజాధనం దుర్వినియోగం కాదా? పార్లమెంటు భవనాలు చర్చల వేదికలుగా ఉండాలి, అలా లేకపోతే అవి కేవలం "షో పీస్" లు మాత్రమే.



**డాక్టర్ కోలాహలం రామ్ కిశోర్**
**9849328496**

## వికారాబాద్‌లో కుంభవృష్టి



- గురుదొడ్ల చెరువుకు గండి
- ఉధృతంగా ప్రవహిస్తున్న మూసి కాగ్న నదులు
- జలకళ తో నిండుకుండల ప్రాజెక్టులు
- పొంగిపొర్లుతున్న వాగులు వంకలు
- జలదిగ్బంధంలో వీరిశెట్టిపల్లి
- దౌల్తాబాద్ కోస్గి రాకపోకలు బంద్
- లోతట్టు ప్రాంతాల్లో పర్యటించిన కలెక్టర్ ఎస్పీ
- సహాయక చర్యలు చేపట్టిన జిల్లా యంత్రాంగం

**వికారాబాద్ జిల్లా బ్యూరో, ఆగస్టు 14 (జనం సాక్షి) :** జిల్లాలో వర్షం బీభత్సం సృష్టించింది. వరద పొలాల్లో విలయతాండవం చేస్తుంది. జలప్రళయం వలన వందలాది ఎకరాల్లో పంటలు నీట మునిగాయి. ఫలితంగా రైతులకు కడగండ్ల మిగిలాయి. అనేక రోడ్లు దెబ్బ తిన్నాయి. ఇరుగు పొరుగు గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. జనజీవనం స్తంభించింది. రెండు నదులు ఉద్రిక్తంగా ప్రవహిస్తున్నాయి. ప్రాజెక్టులు జలకలతో నిండుకుండలా తలపిస్తున్నాయి. ప్రాజెక్టు అలుగులు వాగులు వంకల పొంగి ప్రవహిస్తున్నాయి. వీరిశెట్టిపల్లి మహాదేవుని ఆలయం జలదిగ్బంధంలో ఉంది. వివరాల్లోకి వెళితే గత మూడు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాల కారణంగా వికారాబాద్ జిల్లాలోని అన్ని గ్రామాలు అతలకుతలమయ్యాయి. భారీ వర్షం కారణంగా ధరూర్ మండలం గురుదొడ్ల గ్రామంలోని చెరువుకు గండి పడటంతో చెరువుకు దిగువన ఉన్న పొలాల్లో పంట దెబ్బతిన్నాయి. మూడు రోజులుగా కురుస్తున్న వర్షాల కారణంగా గురుదొట్ల చెరువు తెగిపోయే ప్రమాదం ఉందని గ్రామస్తులు నీటిపారుదల శాఖ అధికారులకు ఫిర్యాదు చేశారు. నీటి పారుదల అధికారులు ఆ చెరువును పరిశీలించి ప్రమాదమేమీ లేదని చెప్పి వెళ్ళిపోయారు. బుధవారం రాత్రి కురిసిన భారీ వర్షంతో రాత్రివేళ చెరువుకు గండి పడింది. దీంతో చెరువు దిగువన ఉన్న పంట పొలాలు దెబ్బతిన్నాయి. అలాగే వికారాబాద్ మూసి తాండూర్ కాగ్న పరవళ్ళు తొక్కుతుంది. ప్రమాద స్థాయిని మించి ప్రవహించడంతో కాగ్న నదికి దగ్గరగా ఉన్న తాండూర్ మండలం వీరిశెట్టిపల్లి జలదిగ్బంధంలో చిక్కుకుంది. ఇండ్లలోకి నీళ్లు వెళ్లి ప్రజలు ఎవరు బయటికి రాలేని పరిస్థితుల్లో ఉన్నారు. బషీరాబాద్ మండలం జీవన్గి మహాదేవుని ఆలయం జలదిగ్బంధంలో ఉంది. జుంటుపల్లి కో కట్ దగ్గర కాగ్న ఉధృతంగా ప్రవహిస్తుంది. జుంటుపల్లి. లక్మాపూర్ బొంరాస్పేట్ . కోట్ పల్లి కాస్లాబాద్ కొమ్ షర్టుపల్లి ప్రాజెక్టులు నిండుకుండల జల కళతో తలపిస్తున్నాయి. కొడంగల్ లోని నాగారం రుద్రారం పటేల్ చింతతాండ రోడ్డు కోత గురి అయింది. తాండూరు మండలం అల్లాపూర్ ఐ నెల్లి మల్కాపూర్ సంఘం కాలనీ బెల్క టూర్ గ్రామాల వాగులు ఉధృతంగా ప్రవహించడంతో రాకపోకలు నిలిచిపోయాయి. దౌల్తాబాద్ కోస్గి వెళ్లే దారిని మూసివేసి రాక పోకలను నిలిపివేశారు. జిల్లాలో కొన్ని గ్రామాల్లో వర్షం వల్ల ఇల్లు కూలిపోయాయి. జీవన్ గి గ్రామంలో వరద లో బస్సు కొట్టుకపోయింది. దానిని ఒడ్డుకు చేర్చడానికి ట్రాక్టర్ల సహాయంతో గ్రామస్తులు విశ్వ ప్రయత్నం చేశారు. ఇదిలా ఉంటే వరద లోతట్టు ప్రాంతాలను జిల్లా కలెక్టర్ ప్రతిక్ జైన్ జిల్లా ఎస్పీ నారాయణరెడ్డి పరిశీలించారు. ప్రమాదం పొంచి ఉన్నచోట అధికారులు అప్రమత్తంగా ఉండి ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. మరో మూడు రోజుల పాటు భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ హెచ్చరించిన నేపథ్యంలో ప్రజలు జాగ్రత్త ఉండాలని సూచించారు.

## వికారాబాద్ జిల్లాలో భూకంపం

- మూడు గ్రామాల్లో కపించిన భూమి తెల్లవారుజామున ఇండ్లలో నుంచి పరుగులు తీసిన జనం
- రంగాపూర్ బస్ రెడ్డి పల్లి గ్రామాలను సందర్శించిన ఉన్నతాధికారులు
- భూకంపం మూడుసార్లు వచ్చే ఛాన్స్ అధికారులను అప్రమత్తం చేసాం
- జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ వెల్లడి



**వికారాబాద్ జిల్లా బ్యూరో, ఆగస్టు 14 (జనం సాక్షి) :** వికారాబాద్ జిల్లా పరిగి నియోజకవర్గంలోని బస్ రెడ్డి పల్లి. రంగాపూర్. న్యానవత్ నగర్ గురువారం తెల్లవారుజామున భూకంపం సంభవించింది. రిక్టర్ స్కేల్ పై మూడు పాయింట్ నమోదు అయినట్లు తెలుస్తోంది. ఈ మూడు గ్రామాల్లో ప్రజలందరూ నిద్రలో ఉండగా పెద్ద శబ్దంతో పాటు భూమి కంపించింది. దీంతో ప్రజలు భయాందోళనకు గురై ఒక్కసారిగా రోడ్లపైకి పరుగులు తీశారు. గాఢ నిద్రలో ఉన్న ప్రజలకు పెద్ద శబ్దం వినిపించగానే ముందుగా యాక్సిడెంట్ అనుకున్నారు. తర్వాత కొన్ని సెకండ్ల పాటు భూమి కపించడంతో ఇండ్లలో నుంచి బయటికి పరుగులు తీశారు. ఇండ్లల్లో ఉన్న కొన్ని వస్తువులు కింద పడిపోయాయి. ఈ విషయమై గ్రామస్తులు అధికారులకు సమాచారం ఇవ్వడంతో ముందుగా పరిగి పోలీసులు అప్రమత్తమై గ్రామాల్లో విచారణ చేపట్టారు. విషయం తెలుసుకున్న వికారాబాద్ జిల్లా కలెక్టర్ ప్రతిక్ జైన్ జిల్లా ఎస్పీ సత్యనారాయణ రెడ్డి హుటాహుటిన రంగాపూర్ బసిరెడ్డిపల్లి గ్రామాల్లో పర్యటించారు. భూకంపం సంభవించిన విషయం ప్రజల నుంచి అడిగి తెలుసుకున్నారు. తమంత తీవ్ర భయాందోళనకు గురైనట్లు ప్రజల వారికి తెలియజేశారు. గ్రామాల్లో భూకంపం సంభవించిందా లేదా ఇంకేదైనా విపత్తు సంభవించిందా అనే విషయమై భూగర్భ జల శాస్త్రవేత్తల ను సంప్రదించినట్లు జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ తెలియజేశారు. భూకంపం ఒకేసారి రాదని వేరువేరు దశల్లో మూడుసార్లు వచ్చే అవకాశం ఉంటుందని కలెక్టర్ వివరించారు. దీనిని దృష్టిలో పెట్టుకొని మూడు గ్రామాల ప్రజలను అప్రమత్తం చేశామని వివరించారు. ప్రజలు ఎవ్వరు ఆందోళన చెందవలసిన అవసరం లేదని ముందు జాగ్రత్త చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. భూకంపం సంభవించిన గ్రామాల్లో అధికారులంతా అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. ఇండ్ల పగుళ్లు ఏమైనా వస్తే గుర్తించాలని అధికారులను ఆదేశించారు. ఈ నెల 17వ తారీకు వరకు అతి నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున ప్రజలు ఎవరు ఇండ్లలో నుంచి బయటికి రావద్దని కలెక్టర్ విజ్ఞప్తి చేశారు. ప్రమాద స్థాయిని మించి వాగులు వంకలు ప్రవహిస్తున్నందున అటువైపు ఎవరు వెళ్లవద్దని సూచించారు. బోటింగ్ ట్రాకింగ్ అనంతగిరి ఫారెస్ట్ లోకి పర్యాటకులను అనుమతించడం లేదని కలెక్టర్ తెలియజేశారు. జిల్లాలో ఉప్పొంగి ప్రవహిస్తున్న నదులు వాగులను ప్రాజెక్టులను కలెక్టర్ పరిశీలించారు. కార్యక్రమంలో ఆర్డీవో వాసు చంద్ర పరిగి తహసిల్దార్ వెంకటేశ్వరి తోపాటు వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

## భారీ వర్షాల కారణంగా ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలి

- పొంగిపొర్లుతున్న వాగులు, వరదలను క్షేత్రస్థాయిలో పరిశీలన
- జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్



**తాండూరు, అగస్టు 14 (జనంసాక్షి) :** జిల్లాలో భారీగా వర్షాలు కురుస్తున్నందున ఎలాంటి నష్టం జరగకుండా అధికారులను అప్రమత్తం చేస్తున్నట్లు జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ తెలిపారు.గురువారం జిల్లాలో భారీగా కురుస్తున్న వర్షాల కారణంగా ఎస్పీ నారాయణ రెడ్డి తో కలిసి తాండూరు పరిసర ప్రాంతాల్లో పొంగిపొర్లుతున్న వాగులు, వరదలను క్షేత్రస్థాయిలో జిల్లా కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా ప్రజలను ఉద్దేశించి కలెక్టర్ మాట్లాడుతూ భారీ వర్షాల మూలంగా జిల్లాను రెడ్ అలర్ట్ గా గుర్తించడం జరిగిందని, ప్రజలు వర్షాల వల్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. జిల్లాలో మూడు రోజులపాటు భారీగా వర్షాలు కురిసే నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉంటూ అన్ని జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. అత్యవసరం అనుకుంటేనే ఇండ్ల నుండి బయటకు రావాలని ప్రజలకు సూచించారు. జిల్లాలో కురుస్తున్న వర్షాల కారణంగా అనంతగిరి, కోట్ పల్లి పర్యాటక ప్రాంతాల్లో బోటింగ్, ట్రెక్కింగ్ లు నిలిపివేయడం జరిగిందని పర్యాటకులు ఎవరు రాకూడదని కలెక్టర్ తెలిపారు. పెద్ద పెద్ద భవనాల దగ్గర, చెట్ల దగ్గర పిడుగులు పడే ప్రమాదం ఉంటుందని ప్రజలు అట్టి ప్రాంతాల్లో ప్రజలు ఉండకూడదని కలెక్టర్ తెలిపారు. పశువులను కాపాడుకునే దిశగా గ్రాసం నిమిత్తం బయటకు తీసుకు వెళ్ళవద్దని కలెక్టర్ సూచించారు. పెద్ద మొత్తంలో వాగులు, వంతెన వద్ద నీరు ఉప్పొంగితే అధికారులకు సమాచారం చేరవేసినట్లయితే భద్రతకై తగు జాగ్రత్తలు తీసుకుంటామని కలెక్టర్ తెలిపారు. మనుషులు, పశువుల ప్రాణాలు కాపాడాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని దీనికి ప్రతి ఒక్కరు సహకరించాలని కలెక్టర్ కోరారు.భారీ వర్షాల మూలంగా పంట నష్టం జరిగినట్లయితే అంచనాలను రూపొందించి నష్టపరిహారం చెల్లించేందుకు చర్యలు తీసుకుంటామని కలెక్టర్ తెలిపారు. ఈ సందర్భంగా యాలాల మండలం కోకట్ వద్ద కాగ్న నది వంతెనను అధికారులతో కలిసి పరిశీలించారు.జిల్లా కలెక్టర్ తో పాటు సబ్ కలెక్టర్ ఉమా శంకర్ ప్రసాద్, మున్సిపల్ కమిషనర్ విక్రమ్ సింహారెడ్డి లతో పాటు రెవెన్యూ, పోలీస్ అధికారులు పాల్గొన్నారు.

## ఆధ్యాత్మిక చింతనతోనే మానసిక ప్రశాంతత

- తెలంగాణ ప్రభుత్వ చీఫ్ విప్ డాక్టర్ పట్నం మహేందర్ రెడ్డి



**తాండూరు, అగస్టు 14 (జనంసాక్షి) :** ఆధ్యాత్మిక చింతనతోనే మానసిక ప్రశాంతత లభిస్తుందని తెలంగాణ ప్రభుత్వ చీఫ్ విప్ డాక్టర్. పట్నం మహేందర్ రెడ్డి పేర్కొన్నారు. గురువారం పెద్దేముల్ మండల్ లోని పెద్దేముల్ తండా లో నూతనంగా నిర్మించిన ఆంజనేయ స్వామి దేవాలయ పూజా కార్యక్రమానికి మాజీ జడ్పీటీసీ టీపీసీసీ ప్రధాన కార్యదర్శి దారసింగ్ ఆహ్వానం మేరకు పెద్దేముల్ తండా లోని ఆలయం లో ప్రభుత్వ చీఫ్ విప్ డాక్టర్. పట్నం మహేందర్ రెడ్డి ప్రత్యేక పూజలు నిర్వహించి స్వామి వారిని దర్శించుకున్నారు. అనంతరం ఆధ్యాత్మిక కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ పూజా కార్యక్రమం లో రాష్ట్ర టీపీసీసీ ప్రచార సమన్వయకర్త కరణం పురుషోత్తం రావు,డివై నర్సిములు, విట్టల్, సీనియర్ నాయకులు గడ్డలి రవీందర్,బిర్కెట్ రఘు,లేబర్ సెల్ నాయకుడు పునీత్ కుమార్, శివానంద్ మడపతి, సిద్ధూ అయ్యా, కాంతు, ఆనంద్ గౌడ్ మరియు స్థానిక నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## జిల్లా ఎస్పీని కలిసిన టీవైజెఎఫ్ యూనియన్ నాయకులు



**కౌడిపల్లి, ఆగస్టు 14 (జనంసాక్షి) :** మెదక్ జిల్లాకి నూతనంగా బదిలీపై వచ్చిన ఎస్పీ శ్రీనివాసరావును మర్యాదపూర్వకంగా కలిసిన టీవైజెఎఫ్ రాష్ట్ర, జిల్లా నాయకులు టీవైజెఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ తనుగుల జితేందర్ రావు, ఆదేశాల మేరకు ఇటీవల కొమరం భీమ్ ఆసిఫాబాద్ జిల్లాలో గత కొన్ని సంవత్సరాలుగా విధులు నిర్వహించి గత రెండు నెలల క్రితం మెదక్ జిల్లాకి బదిలీపై వచ్చిన డివి శ్రీనివాసరావు ఐపిఎస్‌ని మర్యాదపూర్వకంగా కలిసిన టీ వై జె ఎఫ్ రాష్ట్ర నాయకులు టీ వై జె ఎఫ్ స్టేట్ జాయింట్ సెక్రటరీ నాగరాజు చారి, తో పాటు మెదక్ జిల్లా అధ్యక్షుడు రవికుమార్ గౌడ్, ఆధ్వర్యంలో గురువారం రోజు టీ వై జె ఎఫ్ జిల్లా నాయకులతో మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సత్కరించడం జరిగింది. ఈ సందర్భంగా నాగరాజు చారి, రవికుమార్ గౌడ్ మాట్లాడుతూ... గత రెండు నెలల క్రితం బదిలీపై మెదక్ జిల్లాకి వచ్చిన ఎస్పీ శ్రీనివాసరావు ఇటీవల మెదక్ జిల్లాలో జరిగిన రెండు మర్డర్ కేసులను సవాల్‌గా తీసుకొని అతి తక్కువ సమయంలో అనధి కాలంలో రెండు మర్డర్ కేసులను ఛేదించడం జిల్లా పోలీస్ యంత్రాంగానికి మెదక్ జిల్లా వాసులకు గర్వించదగ్గ విషయం అన్నారు. మెదక్ జిల్లా వ్యాప్తంగా ప్రజలంతా ఎస్పీ శ్రీనివాసరావుని పోలీస్ యంత్రాంగాన్ని అభినందించడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో జర్నలిస్ట్ నాయకులు, భరత్ గౌడ్, శ్రీశైలం, జమీర్, ప్రవీణ,తో పాటు తదితరులు పాల్గొన్నారు.

## సీపీఐ రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయాలి

- సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు సాయిలు గౌడ్



**శామీర్‌పేట్, ఆగస్టు 14 (జనంసాక్షి) :** భారత కమ్యూనిస్టు పార్టీ తెలంగాణ రాష్ట్ర నాల్గవ గాజులరామారం లోని మహారాజ ఫంక్షన్ హాల్ లో ఆగస్టు 19 - 22 వరకు నాలుగు రోజులు జరగ నున్న సందర్భంగా గురువారం రోజు మేడ్చల్-మల్కాజ్గిరి జిల్లాలోని షామీర్పేట మండల కేంద్రంలో గోడపత్రిక ఆవిష్కరణ చేయడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య ముఖ్య అతిథిగా రాష్ట్ర మహాసభల గౌరవాధ్యక్షులు డి.జి.సాయిల్ గౌడ్, ఏ.ఐ.టీ.యూ.సీ రాష్ట్ర నాయకులు కే.రవిచంద్రన్ లు ఆవిష్కరించారు. స్వాతంత్ర పోరాటంలో పాల్గొన్న పార్టీగా శత జయంతి ఉత్సవాలను జరుపుకుంటున్న భారత కమ్యూనిస్టు పార్టీ పేద ప్రజల పక్షాన కార్మికుల పక్షాన, రైతాంగ సమస్యల పైన అనేక పోరాటాలను కొనసాగిస్తుందని వారు పునరుద్ఘాటించారు. కార్మిక, కర్షక, ఆదివాసుల హక్కులకు భంగం కలిగించే విధివిధానాలను ఎప్పటికప్పుడు సుదీర్ఘంగా ఉద్యమాలను కొనసాగిస్తున్న పార్టీ భారత కమ్యూనిస్టు పార్టీ అని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో షామీర్పేట్ మండల కార్యదర్శి డి.జి.నరేందర్ ప్రసాద్, మూడు చింతలపల్లి మండల కార్యదర్శి తప్పట్ల రాములు గౌడ్, అల్వాల్ మండల కార్యదర్శి ఏ.బాబు, మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా రైతు సంఘం జిల్లా అధ్యక్షులు డి.జంగయ్య అల్వాల్ శాఖ కార్యదర్శి వై. వెంకటేష్ పార్టీ నాయకులు నరేంద్ర చారి, కే.రమేష్ సింగ్‌లు పాల్గొన్నారు.

## అత్తగారింటికి వచ్చి అనంత లోకాలకు..

- మద్యం మత్తులో నీటి గుంతలో పడి దుర్మరణం
- పెద్దేముల్ మంబాపూర్‌లో ఘటన




**పెద్దేముల్, ఆగస్టు 14 (జనం సాక్షి) :** అత్తగారింటికి వచ్చి నీటి గుంతలో పడి మృతి చెందిన ఘటన గురువారం పెద్దేముల్ మండలం మంబాపూర్ గ్రామంలో వెలుగులోకి వచ్చింది. స్థానికులు తెలిపిన ప్రాథమిక సమాచారం మేరకు మహబూబ్ నగర్ జిల్లా గండీడ్ మండలం కొండాపూర్ గ్రామానికి చెందిన మర్పల్లి అంజిలయ్య(45) హైదరాబాద్‌లో కూలీ పనులు చేస్తున్నారు. భార్య లక్ష్మీ, కూతురు స్వాతిలతో కలిసి జీవనం సాగిస్తున్నారు. రెండు రోజుల క్రితం రాఖీ పండగ సందర్భంగా మంగళవారం భార్య లక్ష్మీ గారి పుట్టిన ఊరు పెద్దేముల్ మండలం చైతన్య నగర్ కు అంజిలప్ప కుటుంబంతో కలిసి వచ్చాడు. సాయంత్రం బస్సు దిగిన తరువాత భార్య లక్ష్మీ, కూతురు స్వాతిలకు ఇంటికి వెళ్లమని, నేను తరువాత వస్తానని వారిని పంపించాడు. చీకటి పడినా కూడా అంజిలప్ప ఇంటికి రాలేదు. కొండాపూర్‌కు వెళ్లి ఉంటాడని అనుకున్నారు. బుధవారం లక్ష్మీ, స్వాతిలు కొండాపూర్‌కు వెళ్లారు. అక్కడికి కూడా అంజిలప్ప రాలేదని గుర్తించారు. గురువారం ఉదయం మంబాపూర్ గ్రామ సమీపంలోని రక్తమైసమ్మ దేవాలయం సమీపంలోని నీటి గుంతలో వ్యక్తి మృతదేహం లభించగా వారు సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. మృతి చెందింది అంజిలప్పగా నిర్ధారించారు. విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని బయటకు తీసి పోస్టు మార్టం నిమిత్తం తాండూరులోని ప్రభుత్వ జిల్లా ఆసుపత్రి మార్చురుకి తరలించారు. అయితే అంజిలప్ప మద్యం మత్తులో నీటిగుంతలో పడి మృతి చెంది ఉంటాడని, అతని మరణంలో అనుమానాలు లేవని కుటుంబీకులు పోలీసులకు తెలిపారు. ఈ మేరకు పెద్దేముల్ ఎస్సై వేణు కుమార్ దర్యాప్తు జరిపి చర్యలు తీసుకుంటామని తెలిపారు.

## సీపీఐ జిల్లా మహాసభను విజయవంతం చేయండి

- జిల్లా కార్యదర్శి విజయలక్ష్మి పండిత్



**తాండూరు, అగస్టు 14 (జనంసాక్షి) :** సిపిఐ జిల్లా మహాసభను విజయవంతం చేయాలని జిల్లా కార్యదర్శి విజయలక్ష్మి పండిత్ పేర్కొన్నారు.గురువారం వికారాబాద్ జిల్లా, కోటపల్లి మండల మహాసభ మల్లేష్ అధ్యక్షతన ఓబులాపూర్ లో నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా జిల్లా కార్యదర్శి విజయలక్ష్మి పండిత్, రైతు సంఘం జిల్లా కార్యదర్శి సురేష్ పాల్గొన్నారు.ఈ సందర్భంగా సిపిఐ జిల్లా కార్యదర్శి విజయలక్ష్మి పండిత్ మాట్లాడుతూ ఈనెల 16వ తేదీన సిపిఐ వికారాబాద్ జిల్లా మహాసభలు తాండూరు పట్టణంలో ని సమద్ ఫంక్షన్ హాల్ 10 గంటల నుండి నిర్వహిస్తున్నట్లుతెలిపారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కూనమనేనీ సాంబశివరావు, రాష్ట్ర సెక్రటేరియట్ మెంబర్ పస్య పద్మ పాల్గొంటారని వెల్లడించారు. ఈ కార్యక్రమానికి పార్టీ సభ్యులు, అభిమానులు ఈ మహాసభను పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. వారు మాట్లాడుతూ ఈ ప్రాంతంలో అనేక సమస్యలు ఉన్నాయని, ప్రభుత్వ పథకాలు కూడా నిజమైన అర్హులకు పేదలకు సరిగా అందుతలేవని, అతిగా నాయకుల జోక్యం సరికాదని తెలిపారు. అధికారులు పక్షపాతం లేకుండా నిజమైన అర్హులను ఎంపిక చేయాలని తెలిపారు. రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని పంట నష్టం జరిగిన రైతులకు నష్టపరిహారం ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. ఏ ప్రాంతమైన అభివృద్ధి చెందాలంటే ప్రజల జీవన ప్రమాణాలు పెరగాలని పెద్దపెద్ద ఆఫీసులతో భవంతులు అభివృద్ధి కొలమానం కాదని తెలిపారు. సిపిఐ ఎల్లవేళలా ఈ ప్రాంత ప్రజలకు అందుబాటులో ఉంటుందని, న్యాయబద్ధమైన డిమాండ్లపై సమస్యలపై పోరాటం చేస్తుందని, స్వార్థం కోసం ఎవరినైనా బెదిరించడం, కేసులు పెట్టడం, కక్ష సాధింపులు చేయడం చేయదని, నిస్వార్ధంగా పేద బడుగు బలహీన వర్గాల కోసం అవసరం లో ఉన్న ప్రతి మనిషి కోసం, కుల మతాలకతీతంగా పనిచేస్తుందని తెలిపారు. నూతన కమిటీ ఎన్నిక. కోటిపల్లి మండల కార్యదర్శిగా మల్లేష్ ను, రైతు సంఘం కార్యదర్శిగా ఆనందును, అధ్యక్షునిగా, యేసయ్యను, ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగింది. ఈ కార్యక్రమంలో హనుమంతు, రాములు, శేఖర్, అంజయ్య, ఏం రాములు, ఎం కృష్ణ, జి లక్ష్మమ్మ, ఏం చంద్రయ్య, తదితరులు పాల్గొన్నారు.

## కరువు నివారణకు సుఖ రక్షక్ ఏఐ



**చంపాపేట్, ఆగస్టు 14 (జనం సాక్షి) :** సుఖ రక్షక్ ఏఐని కీలకమైన వాటా దారులకు అందించటం, వినియోగదారులు, నిర్ణయాధికారుల నుంచి అభిప్రాయాన్ని సేకరించటం, క్షేత్రస్థాయి విస్తరణ, స్కేలింగ్ కోసం సహ రూపకల్పన వ్యూహాలను రూపొందిం చటం సంప్రదింపుల వర్క్ షాపు ముఖ్యోద్దేశమని భారత ప్రభుత్వ వ్యవసాయ, రైతు సంక్షేమ మంత్రిత్వ శాఖ, నేషనల్ రేయిన్ఫడ్ ఏరియా అథారిటి సాంకేతిక నిపుణుడు డాక్టర్ సుసమ సుధిశ్రీ అన్నారు. దేశంలో కరువు నివారణకోసం సుఖ రక్షక్ ఏఐ(కృత్రిమ మేధస్సు)పై ఒకరోజు సంప్రదింపుల వర్క్ షాపును ఇంటర్నేషనల్ వాటర్ మేనేజ్మెంట్ ఇన్స్టిట్యూట్ ఐడ బ్ల్యుఎంఐ) ఐసీఏఆర్-క్రీడా హైదరాబాద్లోని సెంట్రల్ రీసెర్చ్ ఇన్స్టిట్యూట్ ఫర్ డ్రై ల్యాండ్ అగ్రికల్చర్ బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సుఖ రక్షక్ ఏఐ దేశపు ముందస్తు ఏఐ ఆధారిత కరువు సలహా వ్యవస్థను ఐడబ్ల్యు ఎంఐ, ఐసీఆర్ క్రీడా సహకారంతో అభివృద్ధి చేసిందని తెలిపారు. సుఖ రక్షక్ ఏఐ కృత్రిమ మేధస్సు, ఉపగ్రహ ఆధారిత భూమి పరిశీలన, సంభావ్య వాతావరణ సూచనలు, స్థానికరిం చిన వ్యవసాయ ఆకస్మిక ప్రణాళికలను ఉపయోగించి 20 కంటే ఎక్కువ భారతి భాషల్లో వ్యక్తీకరించిన, అంచనా వేసే కరువు సలహాలను అందిస్తుందని ఆయన తెలిపారు. కరరువు ప్రభావాలు పెరిగే ముందు స్వల్పకాలిక పంటలకు మారటం, నీటి పొదుపు పద్ధతులను అవలంభించటం, పశువుల దానా ప్రత్యామ్నాయాలను సిద్ధం చేయటం వంటి నిర్ణయాలు సకాలంలో తీసుకునేలా రైతులకు అధికారం ఇస్తుందన్నారు. దేశంలోని 51 శాతం వర్షాధార సాగు ప్రాంతాన్ని నిర్వహించటం, 12 రాష్ట్రాల్లో ఈ సాధనాన్ని స్కేలింగ్ చేయటానికి, దానిని కృషి డీఎస్ఎస్‌ఈ అనుసంధానించటానికి అవకాశాలను వివరించటం యొక్క కీల కత్వాన్ని డాక్టర్ సుసమ సుధిశ్రీ నొక్కి చెప్పారు. ఐడబ్ల్యుఎంఐ, వాటర్ డేటా ఫర్ క్లైమేట్ రెసిలెన్స్, ప్రిన్సిపాల్ రీసెర్చ్ గ్రూప్ లీడ్ డాక్టర్ గిరిరాజ్ అమర్నాథ్, ఐసీఏఆర్- క్రీడా డైరెక్టర్ వినోద్కు మార్ సింగ్ తదితరులు పాల్గొన్నారు.

# 42 శాతం రిజర్వేషన్ అమలు చేయాలి

- లేనిచో కేంద్ర ప్రభుత్వ అగ్రవర్ణ పాలకులపై బిసిల తిరుగుబాటు తప్పదు
- బహుజన రాజ్య సమితి



**గద్వాల నడిగడ్డ, ఆగస్టు 14 (జనం సాక్షి) :** తెలంగాణ రాష్ట్రంలో 42% బిసి రిజర్వేషన్ ను అమలు చేయడానికి కాంగ్రెస్ ప్రభుత్వం ఆర్డినేన్స్ తెచ్చినప్పటికీ, పూర్తిగా చట్టరూపం దాల్చడానికి వెంటనే చర్యలు చేపట్టాలనీ గురువారం గద్వాల పట్టణంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో బహుజన రాజ్యసమితి నాయకులు అన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్రప్రభుత్వం మీద తీవ్రమైన ఒత్తిడి తీసుకొని రావలసిన అవసరం ఎంతైనా ఉన్నదనీ, దేశంలో బిసిలకు జనాభాకు తగ్గట్లు రిజర్వేషన్ లేకపోవడం, ఉన్న రిజర్వేషన్లు కూడా ప్రైవేట్ రంగం ఎక్కువగా పెరగడం వల్ల సరిగా అమలు కాకపోవడం జరిగిందనీ, అందుకే దేశంలోని అన్ని రాష్ట్రాలలో వారి భాగస్వామ్యం బాగా తగ్గిపోయిందనీ, అన్ని రంగాలలో బిసిల భాగస్వామ్యం తగ్గిపోవడం వల్ల,అగ్రవర్ణ పెట్టుబడిదారుల, పాలకుల ఆధిపత్యం, ఆర్థిక దోపిడి పెరగడం వల్ల రాజ్యాంగం సరిగా అమలు కావడం లేదనీ ,ప్రజాస్వామిక బద్ధంగా, అందరితో పాటు వారికి దక్కాల్సిన అవకాశాలు దక్కకుండ పోతున్నాయనీ, బిజెపి ప్రభుత్వం రాజ్యాంగ విలువల కంటే ఎక్కువగా ఆధిపత్య పెట్టుబడిదారులకు, బడా వ్యాపారులకు ప్రాధాన్యత ఇవ్వడం ద్వారా రాజ్యాంగమే ప్రమాదంలోకి నెట్టివేయబడుతున్నదనీ, ఆధిపత్య వర్గాల ప్రైవేట్ రంగం ప్రభుత్వాలనే శాషించే దశకు చేరుకొంటున్నదనీ, కనుక కేంద్ర ప్రభుత్వం ఇప్పటికైనా నిర్లక్ష్యం చేయకుండా 42 శాతం రిజర్వేషన్ లను రాజ్యాంగంలోని 9వ షెడ్యూల్లో చేర్చి,రాష్ట్రాలకు రిజర్వేషన్ లు పెంచుకొనే అవకాశాలను పూర్తిగా కల్పించాలనీ, అగ్రవర్ణ కేంద్రప్రభుత్వ మంత్రివర్గం, పాలకులు ఇలాగే ఆలస్యం చేస్తే, బిసి లు పార్లమెంటు ముట్టడి చేపట్టడం తప్ప గత్యంతరం లేదనీ, వాస్తవానికి బిసి కులాల జనాభాను అనుసరించి 60 శాతం రిజర్వేషన్ లను కేటాయించాలనీ, కానీ కనీసం 42 శాతం అయిన ఇప్పటికీ వెంటనే అమోదించాలని కోరుతున్నామనీ, బిసి లు కూడా దేశవ్యాప్తంగా రాజ్యాంగబద్ధ న్యాయమైన వాటాల కొరకై ఉద్యమాలను తీవ్రతరం చేయాలనీ,బహుజనుల అవకాశాలను, భాగస్వామ్యాన్ని కేంద్ర ప్రభుత్వం పదే,పదే నిరకారిస్తుండటం వల్ల, ఆధిపత్య వర్గాల ప్రైవేట్ రంగం పెరగడం వల్ల, ఎన్నికల నిర్వహణ లో ఎన్నో లోపాల వల్ల రాజ్యాంగమునకు తూట్లు పడుతున్నాయనీ,దేశంలో బిసి లకు విపి సింగ్ ప్రభుత్వం ద్వారా 1991 నుండి బిసి రిజర్వేషన్ లను అమలు చేయడం అనేదే చాలా ఆలస్యమని, 1950 నుండి రాజ్యాంగం అమలు చేయబడినప్పటికీ, అప్పటికే బిసి లు చాలా అవకాశాలు కోల్పోయారనీ,కానీ ఆ 25 శాతం రిజర్వేషన్లు కూడా సరిగా అమలు కాలేదనీ,కనుక సామజిక, ఆర్థిక సమస్యలు తీవ్రం కాకముందే, 42 శాతం రిజర్వేషన్ లను అయినా త్వరగా అమలులోకి తేవాలనీ వారన్నారు. ఈ కార్యక్రమంలో బహుజన రాజ్య సమితి అధ్యక్షుడు ఎం.వాల్మీకి, ప్రధాన కార్యదర్శి కె .వినోద్ కుమార్, కోశాధికారి కోళ్ల హుస్సేన్, కమిటీ నాయకులు డాక్టర్ ప్రేమ్ కుమార్, లెక్చరర్ రవికుమార్, డాక్యుమెంట్ రైటర్ శివ, సాదత్ తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థుల ఆరోగ్యంతో చెలగాటం

- పాఠశాల సమీపంలోని సీసీ రోడ్డుపై చెరువును తలపిస్తున్న వర్షం నీరు
- ఎంపీడీవో, గ్రామపంచాయతీ అధికారులకి మొరపెట్టుకున్న పట్టించుకున్న నాథుడు లేడు



**నంగునూరు, ఆగస్టు 14 (జనం సాక్షి) :** నంగునూరు మండల మగ్గంపూర్ గ్రామంలోని ప్రభుత్వ మండల పరిషత్ పాఠశాల సమీపంలో సిసి రోడ్డుపై వర్షం నీరు చెరువును తలపిస్తుంది. పాఠశాల సమీపంలో వర్ష నీరు నిల్వ ఉండడం వల్ల విద్యార్థులకు సీజనల్ వ్యాధులు డెంగ్యూ , మలేరియా సోకే అవకాశం ఉంది. అదేవిధంగా అటు వైపుగా వెళ్లే కాలనీవాసులు చాలా ఇబ్బందులు ఎదుర్కొంటూ ఉన్నారు.గ్రామస్తులు మాట్లాడుతూ సిసి రోడ్ డౌన్ కావడం వర్షం నీరు నిల్వ ఉండడం జరుగుతుంది అని మండల పరిషత్ అధికారులకు ఎంపిడిఓకు గ్రామపంచాయతీకారులకు ఎన్నిసార్లు మొరపెట్టుకున్న ఎవరు పట్టించుకునే నాధుడు లేదని మొరపెట్టుకుంటున్నారు. తక్షణమే జిల్లా కలెక్టర్ ,జిల్లా పంచాయతీ అధికారులు స్పందించి పరిష్కారం చూపాలని వేడుకున్నారు.

## కళాశాల సమస్యలు పరిష్కరించాలని వినతిపత్రం అందజేసిన అధ్యాపకులు



**మానవపాడు, ఆగస్టు 14 (జనం సాక్షి) :** అలంపూర్ పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో, పలు సమస్యలపై ఎమ్మెల్సీ చల్లా వెంకట్రామిరెడ్డి, ఎమ్మెల్యే విజయుడు కి కళాశాల అధ్యాపకులు గురువారం వినతి పత్రం అందజేశారు. కళాశాల ఆవరణలో వర్షం నీరు నిలుస్తుందని, విద్యుత్ సరఫరా సమస్య, పిచ్చి మొక్కలు పెరిగి విససర్పాలు సంచరిస్తున్నాయని అధ్యాపకులు తెలిపారు. కళాశాలలో ఉన్న సమస్యలను పరిష్కరిస్తామని ఎమ్మెల్సీ ఎమ్మెల్యే భరోసా ఇచ్చారు.

## మాదకదవ్యాలపై అవగాహన



**వీపనగండ్ల, ఆగస్టు 14 (జనం సాక్షి) :** వీపనగండ్ల మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో నషా ముక్త భారత్ అభియాన్ కార్యక్రమం నిర్వహించారు.ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ బి. శివ గౌడ్, పోలీస్ స్టేషన్ హెడ్ కానిస్టేబుల్ వెంకటేశ్వర్లుతో పాటు పోలీసు బృందం పాల్గొని విద్యార్థులకు మాదక ద్రవ్యాల దుర్వినియోగానికి వ్యతిరేకంగా అవగాహన కల్పించి ప్రతిజ్ఞ చేయించారు. జిల్లా కలెక్టర్, బోర్డ్ ఆఫ్ ఇంటర్మీడియట్ డైరెక్టర్ ఆదేశానుసారం నిర్వహించడం జరిగిందని అన్నారు. సైబర్ క్రైమ్ కు సంబంధించిన మరి ఎన్నో విషయాలను హెడ్ కానిస్టేబుల్ విద్యార్థులకు వివరించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ లెక్చరర్ బి లక్ష్మీనారాయణ, స్టూడెంట్ కౌన్సిలర్ కల్పన, అధ్యాపక, అధ్యాపకేతర బృందం, విద్యార్థులు పాల్గొన్నారు.

# శుభవర షాపింగ్‌మాల్ ప్రారంభం

- హాజరైన సినీనటి అనసూయ, మాజీ ఎమ్మెల్యే కొమ్మూరి



**చేర్యాల, ఆగస్టు 14 (జనంసాక్షి) :** చేర్యాల పట్టణంలోని స్థానిక హనుమాన్ టెంపుల్ ఎదురుగా శుభవర షాపింగ్ మాల్ ప్రారంభోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా జనగామ డీసీసీ అధ్యక్షులు కొమ్మూరి ప్రతాపరెడ్డి, సీని నటి అనసూయ, చైల్డ్ ఆర్టిస్టు రేవంత్ అలియాస్ బుల్లి రాజు రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. అనంతరం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే కొమ్మూరి ప్రతాప్ రెడ్డి మాట్లాడుతూ.. చేర్యాల పట్టణంలో ఇంత పెద్ద షాపింగ్ మాల్ రావడం చాలా సంతోషంగా ఉన్నదని అన్నారు. చేర్యాల పట్టణంలో ఇంత పెద్ద షాపింగ్ మాల్‌ను ఏర్పాటు చేసిన గాంధీ సూర్యకాంతిని అభినందించారు. సినీ యాక్టర్ అనసూయ మాట్లాడుతూ.. గాంధీ సూర్య కాంతితో ఇదివరకే పరిచయం ఉన్నదని ఇంతకుముందు వాళ్ళ షాపింగ్ మాల్‌ని ఓపెన్ చేశానని, అలాగే చేర్యాలలో శుభవర షాపింగ్ మాల్ ప్రారంబానికి తనను ఆహ్వానించడం చాలా సంతోషంగా ఉన్నదని అన్నారు. ఈ సందర్భంగా చేర్యాల ప్రజలను కలుసుకోవడం చాలా ఆనందంగా ఉన్నదని వారందరికీ నా హృదయపూర్వక అభినందనలని అన్నారు. శుభవర షాపింగ్ మాల్ అధినేత గాంధీ సూర్యకాంత్ మాట్లాడుతూ.. చేర్యాలలో షాపింగ్ మాల్ పెట్టడం చాలా సంతోషంగా ఉన్నదని హైదరాబాదులో మాకు కొన్ని బ్రాంచీలు ఉన్నాయని అలాగే చేర్యాలలో మా షాపింగ్ మాల్ ఏర్పాటు చేయడం ఈ కార్యక్రమానికి స్థానిక నేత కొమ్మూరి ప్రతాపరెడ్డి, సినీ యాక్టర్ అనసూయ,బుల్లి రాజు రావడం వారి చేతుల మీదుగా ఈ షాప్ ప్రారంభం కావడం ఎంతో ఆనందంగా ఉందని అన్నారు.చేర్యాల ప్రాంత ప్రజలకు అతి తక్కువ ధరలో అన్ని రకాల బ్రాండ్స్ ఉన్నాయని ప్రజలందరూ వచ్చి షాపింగ్ మాల్ అభివృద్ధికి తోడ్పడాలని కోరారు.

## గ్రామాల అభివృద్ధికి సహకరించాలని మంత్రిని కోరిన కాంగ్రెస్ నేతలు



**మానవపాడు, ఆగస్టు 14 (జనం సాక్షి) :** జోగులాంబ గద్వాల జిల్లా, ఎర్రవల్లి మండల కేంద్రంలో.. రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్కకు కాంగ్రెస్ శ్రేణులు గురువారం ఘనంగా స్వాగతం పలికారు. జిల్లాలో ఒక వివాహ కార్యక్రమానికి వెళుతున్న సందర్భంలో కాంగ్రెస్ నాయకులు ఆమెను మర్యాదపూర్వకంగా కలిశారు. ముందుగా కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు వెంకటేష్ యాదవ్, మాజీ సర్పంచ్ జోగుల రవి ఆమెను ఘనంగా సన్మానించారు.ఉమ్మడి ఇటిక్యాల మండలంలోని పలు గ్రామాల అభివృద్ధి, మౌలిక సదుపాయాలకు సహకరించాలని మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు వెంకటేష్ యాదవ్, మాజీ సర్పంచ్ జోగుల రవి మంత్రిని కోరారు. కార్యక్రమంలో మండల నాయకులు నారాయణ, కార్యకర్తలు ఇతరులు పాల్గొన్నారు.

## 8 క్వింటాళ్ల రేషన్ బియ్యం పట్టివేత

- తనిఖీ చేస్తుండగా స్వాధీనం చేసుకున్న హద్దునూర్ పోలీసులు
- నిందితుడిపై కేసు నమోదు



**న్యాల్‌కల్, ఆగస్టు 14 (జనం సాక్షి) :** కర్ణాటకలోని బీదర్ పట్టణానికి అక్రమంగా రేషన్ బియ్యాన్ని తరలిస్తుండగా న్యాల్ కల్ మండలంలోని హద్దునూర్ పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. గురువారం ఉదయం స్థానిక ఎస్సై డి.సుజిత్ పోలీస్ బృందంతో కలిసి వాహనాలను తనిఖీ చేస్తుండగా అక్రమంగా రేషన్ బియ్యాన్ని అడ్డుకున్నారు. ఎస్సై సుజిత్ తెలిపిన వివరాల ప్రకారం.. బీదర్ పట్టణానికి చెందిన సునీల్ కుమార్.. న్యాల్ కల్ మండలంలోని ఆయా గ్రామాల్లో కొనుగోలు చేసిన రేషన్ బియ్యాన్ని గురువారం ఉదయం జహీరాబాద్ – బీదర్ రోడ్డు, న్యాల్ కల్ మండలం, కర్ణాటక సరిహద్దు ప్రాంతం,శంషాల్లాపూర్ గ్రామ శివారు మార్గాన బీదర్ పట్టణానికి రేషన్ బియ్యాన్ని తరలిస్తుండగా స్వాధీనం చేసుకున్నారు. మండలంలోని వివిధ గ్రామాల్లోని రేషన్ కార్డుల లబ్ధిదారుల నుండి తక్కువ ధరకు కొనుగోలు చేసి.. అధిక ధరకు విక్రయించేందుకు బీదర్ కు తరలిస్తుంటారు. టవేరా వాహనంతో పాటు వాహనంలో ఉన్న 8 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. వాహనాన్ని పోలీస్ స్టేషన్ కు తరలించగా, రేషన్ బియ్యాన్ని కోహిర్ మండలంలోని దిగ్వాల్ ఏఎంసీ కేంద్రానికి తరలించారు. అక్రమ దందాను కొనసాగిస్తున్న నిందితుడు సునీల్ కుమార్ పై కేసు నమోదు చేసినట్లు ఎస్సై సుజిత్ తెలిపారు.

## జిల్లా ఎస్పీని కలిసిన టీవైజెఎఫ్ యూనియన్ నాయకులు



**కౌడిపల్లి, ఆగస్టు 14 (జనంసాక్షి) :** మెదక్ జిల్లాకి నూతనంగా బదిలీపై వచ్చిన ఎస్పీ శ్రీనివాసరావును మర్యాదపూర్వకంగా కలిసిన టీ వై జె ఎఫ్ రాష్ట్ర, జిల్లా నాయకులు టీ వై జె ఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ తనుగుల జితేందర్ రావు, ఆదేశాల మేరకు ఇటీవల కొమరం భీమ్ ఆసిఫాబాద్ జిల్లాలో గత కొన్ని సంవత్సరాలుగా విధులు నిర్వహించి గత రెండు నెలల క్రితం మెదక్ జిల్లాకి బదిలీపై వచ్చిన డివి శ్రీనివాసరావు ఐపిఎస్, ని మర్యాదపూర్వకంగా కలిసిన టీవైజెఎఫ్ రాష్ట్ర నాయకులు టీవైజెఎఫ్ స్టేట్ జాయింట్ సెక్రటరీ నాగరాజు చారితో పాటు మెదక్ జిల్లా అధ్యక్షుడు రవికుమార్ గౌడ్, ఆధ్వర్యంలో గురువారం రోజు టీవైజెఎఫ్ జిల్లా నాయకులతో మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సత్కరించడం జరిగింది. ఈ సందర్భంగా నాగరాజు చారి, రవికుమార్ గౌడ్ మాట్లాడుతూ... గత రెండు నెలల క్రితం బదిలీపై మెదక్ జిల్లాకి వచ్చిన ఎస్పీ శ్రీనివాసరావు ఇటీవల మెదక్ జిల్లాలో జరిగిన రెండు మర్డర్ కేసులను సవాల్‌గా తీసుకొని అతి తక్కువ సమయంలో అనధికాలంలో రెండు మర్డర్ కేసులను ఛేదించడం జిల్లా పోలీస్ యంత్రాంగానికి మెదక్ జిల్లా వాసులకు గర్వించదగ్గ విషయం అన్నారు. మెదక్ జిల్లా వ్యాప్తంగా ప్రజలంతా ఎస్పీ శ్రీనివాసరావుని పోలీస్ యంత్రాంగాన్ని అభినందించడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో జర్నలిస్టులు యాదగిరి, భరత్ గౌడ్, శ్రీశైలం, జమీర్, ప్రవీణ,తో పాటు తదితరులు పాల్గొన్నారు.

# చేర్యాల రెవెన్యూ డివిజన్ కోసం బైక్ ర్యాలీ

**చేర్యాల, ఆగస్టు 14 (జనంసాక్షి) :** చేర్యాలను రెవెన్యూ డివిజన్‌గా ప్రకటించాలని కోరుతూ గురువారం జేఏసీ చైర్మన్ వకులాభరణం నర్సయ్య పంతులు అధ్యక్షతన అఖిలపక్షాల ఆధ్వర్యంలో చేపట్టిన బైక్ ర్యాలీ ముస్త్యాల గ్రామములో ప్రారంభం అయ్యింది. ముస్త్యాల, వీరన్నపేట, చుంచునకోట, కడవేరుగు, పోతిరెడ్డిపల్లి, పెద్దరాజుపేట, నాగపూరి, శబాషుగూడెం గ్రామాలలో బైక్ ర్యాలీ నిర్వహించి ఇంటింటికి కరపత్రాలు పంపిణి చేశారు. ఈ సందర్భంగా జేఏసీ చైర్మన్ నరసయ్య పంతులు మాట్లాడుతూ.. చేర్యాల రెవిన్యూ డివిజన్ ఏర్పాటు కోసం ఎనమిది సంవత్సరాలనుండి అనేక రకాలుగా పోరాటం చేయడం జరుగుతుంది కానీ ప్రభుత్వానికి కండ్లు, చెవులు, పనిచేయడం లేదు ఈ ప్రాంత ప్రజల కష్టాలు ప్రభుత్వానికి కనపడలేదు,ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాట ఇచ్చి మరిచారని, మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి చేర్యాలలో నిరాహార దీక్ష చేశారు. ఎంపీ చామలకిరణ్ కుమార్ రెడ్డి ఎన్నికల్లో తమ ప్రభుత్వం రాగానే డివిజన్ ఇస్తామని ఓట్లు వెయించుకొని మాట నిలబెట్టుకోలేక పోయినని విమర్శించారు. ఇప్పుడు కాంగ్రెస్ పార్టీ నాయకుల మాటలు ఈ ప్రాంత ప్రజలు నమ్మవద్దు అని అన్నారు రెవిన్యూ డివిజన్ ఏర్పాటు కావాలంటే ఈ ప్రాంత ప్రజలు పార్టీలకు అతీతంగా రాబోవు స్థానిక ఎన్నికలలో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులను ఓడగొట్టాలని పిలుపినిచ్చారు. ఈ ర్యాలీలో జేఏసీ నాయకులు ముస్త్యాల బాలనర్సయ్య, ఆముదాల మల్లారెడ్డి, ఉల్లంపల్లి కర్ణాకర్, వడ్లకొండ సంజీవులు, పుర్మ నారాయణ రెడ్డి, భూమిగారి రాజేందర్, ముస్త్యాల నాగేశ్వర్, వెంకట్ మావో, తిరుపతి రెడ్డి,మల్లేశం, ఎల్లారెడ్డి,సత్తిరెడ్డి,పాండు, ప్రవీణ్, మానస, అంజయ్య, కొండయ్య, శ్రీహరి ప్రజాసంఘాలు, ప్రజలు పాల్గొన్నారు.



## స్వాతంత్ర్య వేడుకలకు సర్వం సిద్ధం



**వనపర్తి బ్యూరో, ఆగస్టు 14 (జనంసాక్షి) :** 79వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల నిర్వహణకు జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి గురువారం సాయంత్రం ఏర్పాట్లను పరిశీలించారు.ఉదయం 9.30 గంటలకు ప్రభుత్వ చీఫ్ విప్, ఎమ్మెల్సీ పట్నం మహేందర్ రెడ్డి జాతీయ పతాకావిష్కరణ చేయనున్నారని అనంతరం ముఖ్య అతిథి జిల్లా ప్రజలను ఉద్దేశించి ప్రసంగిస్తారన్నారు. సాంస్కృతిక కార్యక్రమాల నిర్వహణకు ఏర్పాట్లు చేయాలని తెలిపారు. వనపర్తి జిల్లా ఐ.డి.ఒ.సి ప్రాంగణంలో చేస్తున్న ఏర్పాట్లను పరిశీలించిన కలెక్టర్ వర్షం వచ్చినా వేడుకలకు ఇబ్బందులు తలెత్తకుండా పకడ్బందీగా చర్యలు తీసుకోవాలని కలెక్టరేట్ ఎ. ఓ భానుప్రకాశ్‌ను ఆదేశించారు. విద్యార్థులు, అధికారులు, ప్రజలు వేడుకలను వీక్షించడానికి అనువైన ఏర్పాట్లు చేయాలని సూచించారు. స్టాల్స్ ఏర్పాట్లను సైతం పరిశీలించారు.

# చదువుకునే సమయంలో ఎలాంటి చెడు ఆలోచనలకు తావియ్యకూడదు

- చేర్యాల ఎస్సై వేముల నవీన్



**చేర్యాల, ఆగస్టు 14 (జనంసాక్షి) :** చేర్యాల పట్టణ కేంద్రంలోని సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ స్కూల్ గర్ల్స్ విద్యార్థినిలకు మహిళా చట్టాలపై గురువారం జరిగిన అవగాహన కార్యక్రమంలో చేర్యాల ఎస్సై నవీన్ హుస్నాబాద్ షిటీమ్ బృందం పాల్గొన్నారు. ఈసందర్భంగా చేర్యాల ఎస్ఐ నవీన్ మాట్లాడుతూ.. కమ్యూనిటీ పోలీసింగ్ లో భాగంగా మహిళల రక్షణకు పోలీస్ కమిషనర్ అనురాధ ఆదేశానుసారం ప్రత్యేక షెడ్యూల్లో భాగంగా కార్యక్రమం జరుగుతుందన్నారు. విద్యార్థి దశ చాలా కీలకం మీ దశను మీరే మార్చుకునే అవకాశం మీ చేతుల్లో ఉంటుంది. ఇష్టపడి చదివి ఉన్నత స్థానానికి వెళ్లాలి,మహిళలు అన్ని రంగాలలో రాణిస్తున్నారు. జన్మనిచ్చిన తల్లిదండ్రులను విద్య నేర్పిన గురువులను గౌరవిస్తూ ఉండాలని, ప్రతి విద్యార్థికి చదువు చాలా ముఖ్యం, ఎవరికన్నా ఏదైనా జరిగితే మనకెందుకులే అని నిర్లక్ష్యం నిర్లక్ష్యం చేయకుండా పోలీసులకు ఫిర్యాదు చేయాలి, ఉన్నతంగా చదువుకునిపై స్థాయికి వెళ్ళాలి, గుర్తుతెలియని వ్యక్తులు పంపించే లింకులు ఓపెన్ చేయవద్దు, మీరు కానీ మీకు తెలిసిన వారు కానీ, మీ బంధువులు కానీ, ఎవరైనా సైబర్ నేరాల బారిన పడితే వెంటనే జాతీయ సైబర్ సెల్ హెల్ప్ లైన్ నెంబర్ 1930 కాల్ చేసి ఫిర్యాదు చేయాలని సైబర్ సెక్యూరిటీ, మైనర్ డ్రైవింగ్,డయల్ 100 ప్రాముఖ్యత, సమాజంలో జరుగుతున్న నేరాలు వాటి నుండి ఎలా రక్షణ పొందాలి అనే అంశాల గురించి, సెల్ఫ్ కాన్ఫిడెన్స్, సెల్ఫ్ డిఫెన్స్, మహిళల పిల్లల రక్షణకు ఉన్న చట్టాల గురించి, ఎవరైనా వేధించిన రోడ్డుపై వెళ్లేటప్పుడు అవహేలనగా మాట్లాడిన ఉద్దేశపూర్వకంగా వెంబడించిన వెంటనే డయల్ 100, లేదా సిద్దిపేట షీటీమ్ నెంబర్ 8712667434 కాల్ చేసి సమాచారం అందించాలని సమాచారం అందించిన వారి పేర్లు గోప్యంగా ఉంచడం జరుగుతుందని తెలిపారు.ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ మన్వి చందు, అధ్యాపకులు, హుస్నాబాద్ షీటీమ్ బృందం మహిళ కానిస్టేబుళ్లు ప్రశాంతి, స్వప్న, కానిస్టేబుల్ కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# ఈ బురద రోడ్డును బాగు చేసేదెవరు!



- నరకయాతన పడుతున్న ఖాదర్ పేట కాలనీవాసులు
- సైడ్ డ్రైనేజీల్లో పేరుకుపోయిన మట్టి, చెత్తాచెదారం

**చెన్నారావుపేట, ఆగస్టు 14 (జనంసాక్షి) :** బురదమయంగా మారిన రోడ్డును పట్టించుకునే వారే లేరా అని ఖాదర్ పేట కాలనీవాసులు కోరుతున్నారు. మండలంలోని ఖాదర్ పేట గ్రామంలోని పోచమ్మ గల్లీకి వెళ్లే రహదారి మొత్తం గుంతల మయమై బురద మయంగా మారింది. అంతేకాక రోడ్డుకు ఇరువైపుల ఉన్న సైడ్ డ్రైనేజీలను శుభ్రం చేయకపోవడంతో మట్టి, చెత్తాచెదారంతో నిండిపోయి వర్షపు నీరంతా పోచమ్మ గల్లీకి వెళ్లే రోడ్డు పైనుండే ప్రవహిస్తుందని దీంతో రోడ్డు మొత్తం అధ్వాన్నంగా తయారైందని కాలనీవాసులు తెలిపారు. ఈ రోడ్డు గుండా ప్రయాణించాలంటే నానా నరకయాతన పడుతున్నామని కనీసం నడవడానికి వీలు లేకుండా తయారైందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గ్రామపంచాయతీ అధికారు లకు తెలిపినా తమకేమీ పట్టనట్లుగా వ్యవహరిస్తున్నారని ఆందోళన చెందుతు న్నారు. ఇప్పటికైనా సంబంధిత ఉన్నతాధికారులు స్పందించి సైడ్ డ్రైనేజీలలో పేరుకుపోయిన మట్టి, చెత్తాచెదారాన్ని తొలగించి వర్షపు నీళ్ళు పోయే విధంగా చూసి గుంతల మయమై బురదమయంగా మారిన రోడ్డుపై గట్టి మొరాన్ని పోసి బాగు చేయాలని కోరుతున్నారు. లేకుంటే కాలనీవాసుల మంతా కలిసి గ్రామపంచాయతీ కార్యాల యాన్ని ముట్టడిస్తామని హెచ్చరించారు. ఈ విషయం పై పంచాయతీ కార్యదర్శి వీరన్న మాట్లాడుతూ గత కొద్దిరోజుల క్రితమే బురదమయమైన రహదారి పై నాలుగు ట్రిప్పుల మొరాన్ని పోశామని సైడ్ డ్రైనేజీలలో పేరుకుపోయిన మట్టి, చెత్తా చెదారాన్ని తొలగించి తగిన చర్యలు చేపడతామని తెలిపారు.

# గ్రీన్ స్టార్ హాస్పిటల్ ప్రారంభించిన హరీష్ రావు



**నర్సంపేట ఆగస్టు 14 (జనం సాక్షి) :** నర్సంపేట పట్టణంలోని నెక్కొండ రోడ్డులో గల నూతనంగా నిర్మించిన గ్రీన్ స్టార్ హాస్పిటల్ ను ప్రారంభించిన రాష్ట్ర ఆర్థిక వైద్య ఆరోగ్యశాఖ మాజీ మంత్రివర్యులు తన్నీరు హరీష్ రావు, మాజీ శాసనసభ్యులు పెద్ది సుదర్శన్ రెడ్డి. గురువారం ప్రారంభించారు అనంతరం వారు మాట్లాడుతూ నిరుపేద కుటుంబానికి చెందిన బీదవారికి ఎంతో ఉపయోగపడుతుందని వారు అన్నారు హాస్పిటల్ యజమాని మాట్లాడుతూ తక్కువ ఖర్చుతో వైద్య సేవలు నిర్వహిస్తామని. ఎప్పటికీ అందుబాటులో ఉంటామని. నియోజకవర్గ ప్రజలు వినియోగించుకోవాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ చైర్మన్లు ఎర్రోళ్ల శ్రీనివాస్, సతీష్ రెడ్డి, నాగుర్ల వెంకటేశ్వర్లు, మరియు ఓడి డిఎంఎస్ చైర్మన్, గుగులోతు రామస్వామి. రాష్ట్ర మాజీ డైరెక్టర్, పట్టణ పార్టీ అధ్యక్షులు, పట్టణ ప్రధాన కార్యదర్శి, , నియోజకవర్గ యూత్ కన్వీనర్, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ లు, మాజీ ఎంపీపీలు, జడ్పిటిసిలు, పిఎసిఎస్ చైర్మన్ లు, మాజీ సర్పంచ్లు, ఎంపిటీసీలు, నియోజకవర్గ నాయకులు, మండల పార్టీ అధ్యక్షులు, అనుబంధ సంఘాల అధ్యక్షులు, ప్రజాసంఘాల నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

### పెండింగ్ బిల్లులు చెల్లించే విధంగా సహకరించండి

**మాజీ మంత్రి హరీష్ రావును కోరిన కళాశాల యజమాన్యం**

నర్సంపేట పట్టణంలోని ఒక ప్రైవేట్ హాస్పిటల్ ప్రారంభోత్సవానికి వచ్చేసిన మాజీ మంత్రివర్యులు హరీష్ రావు కు కళాశాల యజమాన్యం గురువారం వినతిపత్రం సమర్పించినట్లు వారు పేర్కొన్నారు. జీజుల సాగర్ . నల్ల సుధాకర్ రెడ్డి మాట్లాడుతూ పెండింగ్ లో ఉన్న ఫీజు రీంబర్స్మెంట్ ప్రభుత్వం వెంటనే విడుదల చేసే విధంగా ప్రభుత్వం పై ఒత్తిడి తీసుక రావాలని వారిని కోరిన. నట్లు తెలిపారు. అసెంబ్లీ సాక్షిగా రాష్ట్ర ముఖ్యమంత్రి పెండింగ్ బకాయిలు. ఏప్రిల్ నుండి ఇస్తామని మాట ఇచ్చిన నేటికి. 5నెలలు గడిచిపోయిన కనీసం ఒక్క మాట కూడా మాట్లాడుట లేదు అని వారు, హరీష్ రావు విన్నవించారు. ప్రభుత్వ పెద్దలను కలిసే అవకాశం కూడా ఇవ్వడం లేదు అని వారికి విజ్ఞప్తి చేశారు. కావున ప్రభుత్వా నికి మా సమస్య తెలుప వలసినదిగా వారికి వివరించారు. ఈ కార్యక్రమంలో సిద్ధార్థ కళాశాల బృందం నల్ల సుధాకర్ రెడ్డి పరమేశ్వర్ మాధవరెడ్డి ఆచార్య కళాశాల యజమాన్యం జిజులసాగరు బాలాజీ కళాశాల ప్రవీణ్ తిరుపతి యాకూబ్ మనోహర్ సనత్ కుమార్ పాల్గొన్నారు.





# గంజాయితో దొరికిన యువకుని రిమాండ్

**బెల్లంపల్లి, ఆగస్టు 14 (జనంసాక్షి) :** బెల్లంపల్లి నియోజకవర్గం నెన్నెల మండలం బొప్పారం సమీపంలోని అటవీ ప్రాంతంలో కేజీన్నర గంజాయితో మంచిర్యాల గద్దెరాగడికి చెందిన పాల్తెపు ప్రణయ్ అనే ఐటిఐ విద్యార్థి దొరికిన విషయం విధితమే. కాగా పాల్తెపు ప్రణయ్ పై గంజాయి కేసు నమోదు కావడంతో గురువారం రిమాండ్ కు తరలించినట్లు నెన్నెల ఎస్సై కే ప్రసాద్ తెలిపారు. మండలంలో యువత మాదక ద్రవ్యాలకు బానిస కావద్దని, జీవితాల్ని నాశనం చేసుకోవద్దని సూచించారు. గంజాయి లాంటి మత్తు పదార్థాల బారిన పడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

# మాత శిశు ఆసుపత్రికి వెళ్లాలంటే ట్రాఫిక్ సమస్యలు తప్పవా?



**నిర్మల్ పట్టణం ఆగష్టు 11 (జనం సాక్షి) :** పట్టణంలోని నడిబొడ్డున ఉన్న మాత శిశు ప్రసూతి ఆసుపత్రి కి వెళ్లాలంటే ట్రాఫిక్ సమస్యలు తప్పడం లేదు.. నిత్యం జిల్లాలోని చుట్టుపక్కల గల మండలాల ప్రజలు ప్రభుత్వ ఆసుపత్రికి వస్తుంటారు.. ఎస్ పీ క్యాంప్ ఆఫీస్ ముందర ఉన్న బజాజ్ ఎలక్ట్రానిక్ దగ్గర సిగ్నల్ ఉండటం తో రోడ్డు మొత్తం బ్లాక్ కావడం జరుగుతుంది.. పైగా బజాజ్ ఎలక్ట్రానిక్ లో పని చేసే వారి వాహనాలు రోడ్డుపైనే ఉంచడం, పార్కింగ్ సదుపాయం ఎక్కువగా లేకపోవడం, దాంతోపాటు చుట్టుపక్కల కమర్షియల్, ఐఎఫ్సి లాంటి పలు రకాల వాణిజ్య సముదాయాలు ఉండడం వల్ల ట్రాఫిక్ సమస్య మరింత ఎక్కువగా అవుతుంది.. ఒక పద్ధతి లేకుండా ఇష్టానుసారంగా నడుపుతూ ఎటు అవకాశం ఉంటే అటు వెళ్లిపోవడంతో ఎదుటి వారికి ఇబ్బంది అవ్వడమే కాకుండా ఎన్నోసార్లు ప్రమాదాలు జరిగిన సంఘటనలు కూడా ఉన్నాయి.. ప్రభుత్వ ఆసుపత్రి తో పాటు, ప్రియదర్శన్ నగర్, జవహర్ నగర్, వంటి ప్రధానమైన కాలనీలు ఉండటంతో ట్రాఫిక్ సమస్య విపరీతంగా పెరిగిపోయింది. కనీసం హెచ్చరిక బోర్డులు కూడా లేకపోవడంతో రాష్ డ్రైవింగ్ తో మితిమీరి పోతున్నారు.. కావున అధికారులు వెంటనే స్పందించి చర్యలు తీసుకోవాలని కాలనీ వాసులు కోరుతున్నారు...

### ట్రాఫిక్ సమస్యను వెంటనే పరిష్కరించాలి

పట్టణ నడి బొడ్డున ఉన్న ప్రధాన రోడ్డు జొహరానగర్, ప్రియదర్శినినగర్, మార్గ సాగర్ కాలనీ కలుపుకొని 2000 కుటుంబాలకు పైగా ఉండే ప్రాంతం కి ఈ ఒక్కరోడ్డు ఉన్నందున ట్రాఫిక్ సమస్య అవుతుందని దాంతోపాటు చుట్టుపక్కల ఉన్న వాణిజ్యసముదాలతో పాటు, నిత్యం ఆసుపత్రి అవసరాల నిమిత్తం వచ్చే వారితో ట్రాఫిక్ సమస్య మరింత విపరీతంగా పెరిగి ప్రమాదాలకు కారణం అవుతుంది. ఇకనైనా అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలని కోరుతున్నారు

# గణపురంలో నూతన సర్కిల్ పోలీస్ స్టేషన్ ప్రారంభం

- సర్కిల్ పోలీస్ స్టేషన్ ను జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ, జిల్లా ఎస్పీ కిరణ్ కరే తో కలిసి ప్రారంభించినఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు
- బాధ్యతలు స్వీకరించిన నూతన సీఐ సిహెచ్ కరుణాకర్ రావు



**గణపురం, ఆగస్టు 14(జనం సాక్షి):** గణపురం మండలం కేంద్రంలోనిపోలీస్ స్టేషన్లో నూతన పోలీస్ సర్కిల్ను జిల్లా కలెక్టర్ శ్రీ రాహుల్ శర్మ గారు,ఎస్పీ కిరణ్ కరే గార్లతో కలిసి ప్రారంభించిన భూపాలపల్లి శాసనసభ్యులు గండ్ర సత్యనారాయణ రావు .ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజల శాంతి భద్రతల బలోపేతం కోసం కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేస్తోందనీ,నూతన సర్కిల్ ఏర్పాటుతో చట్ట పరిరక్షణ మరింత సమర్థవంతంగా జరుగుతుంది ఎమ్మెల్యే అన్నారు.ఈ సర్కిల్ పరిధిలో గణపురం, రేగొండ, కొత్తపల్లి గోరి మండలాల పోలీస్ స్టేషన్లు ఉండనున్నాయని తెలిపారు.ఈ నూతన సర్కిల్ కి చెన్నమనేని కరుణాకర్ రావు గారిని సర్కిల్ ఇన్స్పెక్టర్ ఆఫ్ పోలీస్ గా ప్రభుత్వం నియమించిందని సర్కిల్ ఇన్స్పెక్టర్ కు ఎమ్మెల్యే జీఎస్సార్ శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో భూపాల్ పల్లి డి.ఎస్.పి అవిరినేని సంపత్ రావు, అడిషనల్ ఎస్పీ, గణపురం ఎస్ఐ రేఖ అశోక్, తాసిల్దార్ మధురకావి సత్యనారాయణ స్వామి, ఎంపిడిఓ ఎల్ భాస్కర్ , మార్కెట్ కమిటీ చైర్మన్ గూటోజ్ కిష్టయ్య,వైస్ చైర్మన్ రేపాక రాజేందర్, పిఎసిఎస్ చైర్మన్ కన్నే బోయిన కుమార్ యాదవ్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు తదితరులుపాల్గొన్నారు.

# కాగజ్ నగర్‌లో ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ అరెస్టు

- పోలీసు వాహనం అడ్డగింత
- సీఎం నిరంకుశ వైఖరి మారాలి : బిఆర్ఎస్ నాయకులు ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్



**కొమరం భీం ఆసిఫాబాద్ జిల్లా బ్యూరో ఆగస్టు 14 (జనం సాక్షి) :** పోడు రైతులను అరెస్టు చేయడం అన్యాయమని టిఆర్ఎస్. నాయకులు డాక్టర్ ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ అన్నారు. హైదరాబాదుకు పాదయాత్రగా వెళ్తున్న కొమరం భీం ఆసిఫాబాద్ జిల్లా చింతల మానపల్లి మండలం దింద గ్రామానికి చెందిన రైతులను అన్యాయంగా పోలీసులు అరెస్టు చేయడాన్ని ఆయన ఖండించారు. పోడు రైతులను అటవీశాఖ అధికారులు ఎన్నో రకాలుగా ఇబ్బందులకు గురి చేస్తున్నారని తెలిపారు. అంత కు ముందు హైదరాబాదు నుంచి పోలీసులు ప్రత్యేక వాహనంలో షామీర్పేట్ లో అరెస్ట్ చేసిన రైతులను తిరిగి స్వగ్రామైన దిందా గ్రామానికి తీసుకువస్తుండగా కాగజ్ నగర్ సమీపంలోని ప్రధాన రహదారిపై టిఆర్ఎస్ శ్రేణులు డాక్టర్ ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ ఆధ్వర్యంలో అడ్డుకున్నారు. ఈ సందర్భంగా రోడ్డుపై బైఠాయించి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. రైతుల కోసం ఎన్నో పథకాలు తీసుకు వస్తున్నట్లు, వరంగల్ రైతు డిక్లరేషన్, కామారెడ్డి బిసి డిక్లరేషన్ ప్రకటిస్తూ ఇక్కడ పోడు రైతులపై అధికారుల జులుమేమిటని మండిపడ్డారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పోడు రైతుల సమస్యలను పరిష్కరించకుండా, వారిని అనేక రకాలుగా ఇబ్బందులకు గురిచేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వెంటనే ప్రభుత్వం పోడు రైతులకు పట్టాలు పంపిణీ చేసి, వారిని వ్యవసాయం చేసుకునే విధంగా సహకరించాలని కోరారు. టిఆర్ఎస్ శ్రేణులు రోడ్డుపై బైఠాయించడంతో పరిస్థితి ఉద్రిక్తంగా మారడంతో కాగజ్ నగర్ రూరల్ సిఐ కుమారస్వామి, టౌన్ సిఐ ప్రేమ్ కుమార్లు డాక్టర్ ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ ను బలవంతంగా అరెస్టు చేసి తీసుకెళ్లి వ్యాన్లో పోలీస్ స్టేషన్కు తరలించారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ నాయకులు అర్షద్ హుస్సేన్, జిల్లా కన్వీనర్ శ్యాం రావు పాల్గొన్నారు.

# ప్రకృతి విపత్తులలో ప్రజల రక్షణకు అన్ని ఏర్పాట్లతో సిద్ధం

- 90 మంది సభ్యులతో 3 ఎస్‌డిఆర్ఎఫ్ బృందాలు
- మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్





**మంచిర్యాల ప్రతినిధి, ఆగస్టు 14 (జనంసాక్షి) :** వాతావరణ శాఖ సూచన మేరకు రాబోవు 2 రోజులలో భారీ నుండి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున ప్రజల రక్షణ కొరకు అన్ని ఏర్పాట్లతో సిద్ధంగా ఉన్నామని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. గురువారం జిల్లాలోని మంచిర్యాల పట్టణం తిలక్ నగర్ ప్రాంతంలో గల చెరువును డి.సి.పి. ఎ.భాస్కర్ తో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ... భారీ వర్షాల నేపథ్యంలో వరద పరిస్థితులను ఎదుర్కొనేందుకు, ప్రజల రక్షణ కొరకు అన్ని ఏర్పాట్లతో సిద్ధంగా ఉన్నామని తెలిపారు. జిల్లాలోని కాజ్ వే లు, వాగులు, నదుల వద్దకు ప్రజలు ఎవరు వెళ్లకుండా పోలీస్, రెవెన్యూ, పంచాయతీ శాఖల అధికారుల సమన్వయంతో బందోబస్తు ఏర్పాటు నిర్వహిస్తున్నామని, లోతట్టు, వరద ప్రభావిత ప్రాంతాల ప్రజలను వరద పరిస్థితుల దృష్ట్యా సురక్షిత ప్రాంతాలకు తరలించేందుకు పునరావాస కేంద్రాలు ఏర్పాటు చేసి తగు చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. జిల్లాలో వరదలకు సంబంధించి ఎలాంటి సమస్య వచ్చిన ఎదుర్కునేందుకు 90 మంది సభ్యులతో 3 ఎస్.డి.ఆర్.ఎఫ్. బృందాలు, జిల్లా అధికారులతో సిద్ధంగా ఉన్నామని, ప్రజల రక్షణకు కావలసిన పరికరాలు అందుబాటులో పెంచడం జరిగిందని, పోలీసు అధికారులకు శిక్షణ అందించడం జరిగిందని, గజ ఈతగాళ్లను సిద్ధంగా ఉంచామని తెలిపారు. ప్రభుత్వ సూచన మేరకు మత్స్యకారులు చేపల వేటకు వెళ్ళవద్దని, జిల్లాలోని పాఠశాలలకు గురువారం సెలవు ప్రకటించడం జరిగిందని తెలిపారు. జిల్లాలో ప్రాణ నష్టం, పశు నష్టం, ఆస్తి నష్టం జరగకుండా సంబంధిత అధికారులు సమన్వయంతో చర్యలు తీసుకోవాలని, ఉన్నతాధికారుల మార్గదర్శకాలను పాటిస్తూ ప్రజల రక్షణకు కృషి చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.



# షబ్బీర్ అలీకి స్వాగతం పలికిన కలెక్టర్, ఎస్పీ

**ఆదిలాబాద్ ప్రతినిధి (జనంసాక్షి):** జిల్లా కేంద్రంలోని విద్యానగర్ కాలనీలో గల పోలిస్ హెడ్ క్వార్టర్స్ లో నిర్వహించనున్న 79 వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలకు ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ ముఖ్య అతిథిగా హాజరుకానున్న సందర్భంగా గురువారం జిల్లా కేంద్రం లోని పెన్ గంగ గెస్ట్ హౌస్ కు ప్రభుత్వ సలహాదారులు వచ్చిన సందర్భంగా జిల్లా కలెక్టర్ రాజర్షి షా, జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ లు పూల మొక్క అందించి స్వాగతం పలికారు. అనంతరం సంబధిత జిల్లా అధికారులతో జిల్లా లో సంక్షేమ అభివృద్ధి పనుల తీరు పై సమీక్ష నిర్వహించారు.

# గనుల్లో మల్టీ డిపార్టుమెంటల్ సమావేశం



**శ్రీరాంపూర్ (జనంసాక్షి):** ఏరియా సింగరేణి ఆర్కే 5, న్యూటెక్ గనులలో మల్టీ డిపార్ట్మెంటల్ సమావేశం గురువారం ఏర్పాటు చేయడం జరిగింది. ఏరియా జిఎం ఎం శ్రీనివాస్ ఆర్కే 5 గనిలో జరిగిన మల్టీ డిపార్ట్మెంటల్ సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడుతూ సింగరేణి వ్యాప్తంగా మల్టీ డిపార్ట్మెంటల్ సమావేశాలు జరుగుతున్నాయని, శ్రీరాంపూర్ ఏరియాలో కూడా గత మూడు రోజులుగా సమావేశాలు నిర్వహించడం జరుగుతున్నాయని,ప్రతి ఒక్కరూ నిర్దేశిత ఉత్పత్తి లక్ష్యాలు సాధించడానికి కృషి చేయాలని సింగరేణి సంస్థలో శ్రీరాంపూర్ ఏరియాను ప్రథమ స్థానంలో ఉంచడానికి తమ వంతు బాధ్యత వహిస్తూ బొగ్గు ఉత్పత్తి రవాణా,రక్షణ విషయాలలో ఎల్లవేళలా ముందుండాలని సూచించారు.సమావేశాల ముఖ్య ఉద్దేశం ఉద్యోగులందరికీ సంస్థకు సంబంధించిన ప్రతి ఒక్క అంశం తెలియపరచడం,అలాగే వారిని వారి పనులలో నిష్ణాతులను చేసి సమర్థవంతమైన సంస్థగా అభివృద్ధి చెందడం అని తెలియజేశారు.ఈ కార్యక్రమంలో ఎస్ ఓ టు జిఎం సత్యనారాయణ,గుర్తింపు సంఘం బ్రాంచ్ సెక్రటరీ బాజీ సైదా,ఏవీ రెడ్డి,రవి కుమార్, ఆర్కే5 గని ఏజెంట్ శ్రీధర్,కమిటీ సభ్యులు కే వెంకటేశ్వర్ రెడ్డి,రాజన్న,రామ కృష్ణా రావు,విజయ్ కుమార్,రాజేష్, సాంబశివరావు,అమర్నాథ్ రెడ్డి,వి మహేష్,నరేష్, దేవేందర్ రెడ్డి,సాయి కిరణ్,ఆర్కే 5 గని మేనేజర్ సుధీర్ కుమార్ ఝా,ఆర్కే న్యూటెక్ గని మేనేజర్ శ్రీనివాస్ ఉద్యోగులు,అధికారులు పాల్గొన్నారు.

# రైతులకు యూరియా అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలి

- జాతీయ ఎస్టీ కమిషన్ మెంబర్ హుస్సేన్ నాయక్ వినతి పత్రం



**గూడూరు, ఆగస్టు14 (జనంసాక్షి):** రైతులకు యూరియా కొరత లేకుండా అందుబాటులో ఉండే విధంగా చర్యలు తీసుకోవాలని బీజేపీ గిరిజన మోర్చా రాష్ట్ర కార్యదర్శి గుగులోత్రై రాంబాబు నాయక్ అన్నారు. గురువారం గూడూరు మండలం మచ్చెర్ల గ్రామంలోని హుస్సేన్ నాయక్ ఇంటి వద్ద గూడూరు మండల బీజేపీ నాయకులతో వారికీ వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా రాంబాబు నాయక్ మాట్లాడుతూ రైతులకు ఖరీఫ్ సీజన్ వచ్చిందని,పంట పొలాలకు సరైన సమయంలో యూరియా అందుబాటులో లేక రైతులు అనేక ఇబ్బందులకు గురవుతున్నారని, అధికారంలో ఉన్నటువంటి కాంగ్రెస్ పార్టీ, అధికారుల నిర్లక్ష్యం వల్లనే రైతులకు సరైన సమయంలో యూరియా లేక అనేక ఇబ్బందులు పడుతున్నారని, పంట దిగుబడి రాదనే ఆవేదనలో రైతులు ఉన్నారని అన్నారు.గిరిజన ప్రాంతమైన మహబూబాబాద్ లో యూరియా లేక రైతులు హరిగోసలు పడుతు న్నారని ఐన ప్రభుత్వం,రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కనీసం పట్టించుకోకుండా దున్నపోతు మీద వర్షం పడ్డట్టు వ్యవహరిస్తుందని ఆరోపించారు. జాతీయ ఎస్టి కమిషన్ రైతుల పక్షాన నిలబడి సంబంధిత అధికారులతో మాట్లాడి రైతు సమస్యలను పరిష్కరించాలని జాతీయ ఎస్టి కమిషన్ సభ్యులు హుస్సేన్ నాయక్ ను వేడుకొన్నారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులు రాసమల్ల వెంకటేశ్వర్లు, మాజీ ఎంపీపీ చెల్పూరి వెంకన్న, మాజీ మండల అధ్యక్షులు, గూడూరు మాజీ సర్పంచ్ మోతిలాల్, మాజీ ఎంపీటీసీ శ్రీనివాస్, బద్రు నాయక్, పడాల నాగరాజు, దేవేందర్, అనిల్ పాల్గొన్నారు

జనంసాక్షి www.janamsakshi.org | శుక్రవారం 15 ఆగస్టు 2025

# భద్రతాపరమైన చర్యల్లో లోపం ఉండొద్దు

- సీసీ కెమెరాలు,ఆటోమేటిక్ ఆలారం సిస్టం ఏర్పాటు చేసుకోవాలి
- బలమైన లాకర్ వ్యవస్థ పెట్టుకోవాలి
- సూర్యాపేట జిల్లా ఎస్పీ కె.నరసింహ




**సూర్యాపేట ప్రతినిధి, ఆగస్టు 14 (జనంసాక్షి) :** బ్యాంకు అధికారులు, బంగారం షాప్ యజమానులతో గురువారం జిల్లా పోలీస్ కార్యాలయంలో ఎస్పీ నరసింహ సమావేశం నిర్వహించారు. బ్యాంక్‌లు, బంగారం దుకాణాల భద్రత చర్యలకు సంబంధించి సలహాలు సూచనలు అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో భద్రత వ్యవస్థ పటిష్టంగా పనిచేస్తుందని, నిత్యం తనిఖీలు నిర్వహిస్తూ రాత్రివేళ పెట్రోలింగ్ చేస్తున్నట్లు చెప్పారు.ప్రతి రోజు నైట్ అలర్టింగ్ పోలీసు అధికారిని నియమించి జిల్లాలో భద్రత పర్యవేక్షణ చేస్తున్నామని అన్నారు.నిత్యం పెట్రోలింగ్ చేస్తున్నామని, జిల్లాలో అన్ని పోలీస్ స్టేషన్ పరిధి ప్రతిరోజు ఫింగర్ ప్రింట్ స్కానర్ తో అనుమానితులను తనిఖీ చేస్తున్నట్లు తెలిపారు.వ్యాపారులు స్వీయ భద్రత చర్యలు పాటించాలని అన్నారు.బ్యాంకు వద్ద, బంగారం దుకాణాల వద్ద చుట్టూ తెలిసేలా సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని, వచ్చి పోయే మార్గాలు సీసీ కెమెరాలతో కవర్ చేయాలని కోరారు. ఎవరైనా అనుమానాస్పద వ్యక్తులు సంచరిస్తే సీసీ కెమెరాల్లో తెలిసేలా ఉండాలని అన్నారు.పెద్ద మొత్తంలో నగదు, విలువైన అభరణాలు నిలువచేసేటప్పుడు, భద్రపరిచేటప్పుడు పూర్తి భద్రత చర్యలు తీసుకోవాలని,బలమైన లాకర్ వ్యవస్థను ఏర్పాటు చేసుకోవాలన్నారు.కొత్త వ్యక్తులు వచ్చినప్పుడు అలారం వచ్చేలా అధునాతన సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు.ఎవరైనా వ్యక్తులు తాళం పగలగొట్టే క్రమంలో అలారం వచ్చేలా ఏర్పాట్లు చేసుకోవాలన్నారు. ప్రస్తుతం మార్కెట్లో అత్యాధునికమైన సాంకేతిక కలిగిన రక్షణ పరికరాలు ఉన్నాయని వాటిని సద్వినియోగం చేసుకోవాలన్నారు.స్థానిక పోలీసు వారికి ఎప్పటికప్పుడు సమాచారం అందించాలని,వచ్చి పోయే వారి గురించి ఆరా తీయాలని పేర్కొన్నారు.స్టాక్ కు సంభందించి రికార్డ్ నమోదు చేసుకోవాలని అన్నారు.దూరప్రాంతాలకు వెళ్లేటప్పుడు విలువైన ఆభరణాలు, నగదు ఇంట్లో లేకుండా లాకర్లలో భద్రపరచుకోవాలని తెలిపారు.ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు ఎస్పి రవీందర్ రెడ్డి, సూర్యాపేట డిఎస్పి ప్రసన్నకుమార్, సీఐలు రాజశేఖర్, నాగేశ్వరరావు, శివ శంకర్, నర్సింహారావు, సీసీఎస్ ఇన్స్పెక్టర్ శివ కుమార్, సైబర్ సెల్ ఇన్స్పెక్టర్ లక్ష్మీనారాయణ, పోలీసు సిబ్బంది, బ్యాంకర్స్, బంగారం దుకాణాల యజమానులు పాల్గొన్నారు.

## అంబులెన్స్‌లోనే గర్భిణీకి సుఖ ప్రసవం



**చౌటుప్పల్, ఆగస్ట్ 14 (జనం సాక్షి) :** చౌటుప్పల్ మండలం మల్కాపురం గ్రామానికి చెందిన మీనాక్షికి గురువారం తెల్లవారుజామున పురిటి నొప్పులు రావడంతో కుటుంబ సభ్యులు వెంటనే 108 అంబులెన్స్ సిబ్బందికి సమాచారం అందించారు. సమాచారం అందుకున్న వెంటనే ఈఎంటి వినయ్‌కుమార్, పైలెట్ లింగస్వామి తక్షణమే మల్కాపూర్‌కు చేరుకొని గర్భిణీని చౌటుప్పల్ సీహెచ్‌సీకి తరలిస్తుండగా మార్గమధ్యలోనే పురిటి నొప్పులు తీవ్రరూపం దాల్చడంతో, సమయస్ఫూర్తి ప్రదర్శించిన ఈఎంటి వినయ్ కుమార్ అంబులెన్స్‌లోనే ఉదయం 3:35 గంటలకు విజయవంతంగా ప్రసవం చేశారు. అనంతరం మరింత మెరుగైన వైద్యం కోసం వారిని చౌటుప్పల్ సీహెచ్‌సీకి తరలించారు. మీనాక్షి పండంటి ఆడబిడ్డకు జన్మనిచ్చి తల్లి, శిశువు ఆరోగ్యంగా ఉన్నారని వైద్యులు తెలిపారు. సమయస్ఫూర్తితో కాన్పు చేసిన ఈఎంటి వినయ్ కుమార్ ను పైలెట్ లింగస్వామి లను కుటుంబ సభ్యులు ప్రశంసించారు.

## తీర ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలి




**చందంపేట, ఆగస్టు 14 (జనం సాక్షి) :** దిండి వాగు పరీవాహక ప్రాంతాల్లో గత కొన్ని రోజులుగా కురుస్తున్న వర్షాలకు దిండి వాగు లో భారీ వరద ప్రభావం ఉండడంతో చందంపేట తహసిల్దార్, శ్రీధర్ బాబు.ఎస్సై లోకేష్ పర్యవేక్షణ చేసి.ప్రజలకు అప్రమత్తం చేసేందుకు.ఫ్లెక్సీ లు ఏర్పాటు చేశారు.అనంతరం వారు మాట్లాడుతూ.. దిండి వాగు వరద పోటెత్తటంతో. మన్నెవారి పల్లి రహదారి నిలిపివేస్తూనట్లు వారు పేర్కొన్నారు. దిండి వాగు పరివాక ప్రజలు తీర ప్రాంతాల్లో వెళ్ళొద్దని ప్రజలను అప్రమత్తం ఉండాలని సూచించారు. రెవెన్యూ, పోలీస్, పంచాయితీ రాజ్ శాఖ సిబ్బంది లను దిండి వాగు పరివాక ప్రాంతాల్లో ఎప్పటికపుడు పర్యవేక్షణ చేసేందుకు పెట్టామన్నారు.

# స్పెషల్ డ్రైవ్ ద్వారా 154 మొబైల్ ఫోన్ల రికవరీ




**కామారెడ్డి జిల్లా ప్రతినిధి, ఆగస్టు 14 (జనం సాక్షి) :** స్పెషల్ డ్రైవ్ ద్వారా 154 పోగొట్టుకున్న మొబైల్ ఫోన్ల రికవరీ చేసినట్లు బాధితులు జిల్లా పోలీసు కార్యాలయానికి వచ్చి పోగొట్టుకున్న మొబైల్ పొందవచ్చునొ జిల్లా యస్ పి యం. రాజేష్ చంద్ర, గురువారం వెల్లడించారు.సెల్ ఫోన్ పోయిన,చోరీకి గురైన ఆందోళన చెందవద్దని సి ఈ ఐ ఆర్ ద్వారా తిరిగి పొందవచ్చని జిల్లా ఎస్పీ అన్నారు. జిల్లా పోలీస్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమం లో పోగొట్టుకున్న, చోరికి గురైన 154 మొబైల్ ఫోన్లను సుమారు 26 లక్షల విలువగల వాటిని స్వాధీనం చేసుకొని బాధితులకు అప్పగించడం జరుగుతుందని తెలియజేశారు.ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.పోయిన సెల్ ఫోన్ పట్ల అశ్రద్ధ చేస్తే ఇది వ్యక్తిగత, సామాజిక భద్రతకు భంగం కలుగుతుందన్నారు. మొబైల్ పోయిన లేదా చోరీకి గురైన వెంటనే సంబంధిత పోలీసు స్టేషన్ కు వెళ్ళి దరఖాస్తు ఇవ్వాలని, మరియు సిమ్ కార్డ్ బ్లాక్ చేసి అదే నంబరు గల కొత్త సీమ్ తీసుకోవాలి. తద్వారా పోయిన మొబైల్ ఫోన్ల ఐ ఎం ఈ ఐ వివరాలు సిఈఐఆర్ వెబ్సైట్ లో బ్లాక్ చేయడం వలన పోగొట్టుకున్న మొబైల్ సులబంగా దొరికే అవకాశం ఉన్నదని. వివరించారు.జిల్లా పోలీసు కార్యాలయములో పోయిన సెల్ ఫోన్ల రికవరీ కోసం ఇన్స్పెక్టర్ స్థాయి అధికారి ఆధ్వర్యంలో ఒక ఆర్ ఎస్ ఐ 12 మంది కానిస్టేబుల్స్ తో ప్రత్యేక టీం ఏర్పాటు చేయడం జరగిందని అన్నారు. గత 7 రోజులలో ఈ టీం అధికారులు 154 ఫోన్ లను రికవరీ చేయడం మరియు ఇప్పటి వరకు ఈ టీం అధికారులు 781 ఫోన్ లను రికవరీ చేయడం జరిగింది. సి ఈ ఐ ఆర్ పోర్టల్ ప్రారంభం నుండి ఇప్పటి వరకు 3705 ఫోన్ లను రికవరీ చేయడం మరియు బాధితులకు అందజెయడం జరిగిందన్నారు. ఈ సందర్భంగా 154 మొబైల్ ఫోన్ల రికవరీ చేయడంలో ప్రతిభ కనబరిచిన టీం సభ్యులు అందరినీ జిల్లా ఎస్పీ అభినందించడం జరిగింది.ఇప్పటి వరకు రికవరీ చేసిన ఫోన్ల వివరాలను బాధితులకు తెలిజేయడం జరుగుతుందని. వారు జిల్లా పోలీసు కార్యాలయానికి వచ్చి ఆర్ఎస్ఐ. బాలరాజ్ ని సంప్రదించి 8712686114 ఫోన్ కు సంభంధించిన వివరాలు చూపించి తీసుకొనగలరని తెలిపారు.

## ఇందిరమ్మ ఇళ్ల ప్రారంభోత్సవానికి సీఎం రేవంత్ రెడ్డి

- సన్నాహాలు చేస్తున్న ఎమ్మెల్యే జారే
- ఈనెల 21న సీఎం రేవంత్ రెడ్డి వచ్చే అవకాశం



**చంద్రుగొండ, ఆగస్టు 14 (జనం సాక్షి) :** రాష్ట్రంలోనే అత్యధిక ఇల్లు మంజూరు అయి వడివడిగా ప్రారంభోత్సవానికి సిద్ధంగా ఉన్న చంద్రుగొండ మండలం పరిధిలోని బెండాలపాడు గ్రామానికి మహర్దశ పట్టనుంది. ఈనెల 21న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి బెండలపాడు లోని ఇందిరమ్మ ఇళ్ల గృహప్రవేశానికి హాజరై ప్రారంభోత్సవం చేయనున్నట్లుగా విశ్వసనీయ సమాచారం. ఇప్పటికే అశ్వరావుపేట ఎమ్మెల్యే జారే ఆదినారాయణ, ముప్వా విజయ్ బాబు, కలెక్టర్ జితేష్ వి పాటిల్, ఎస్పి రోహిత్ రాజ్ తదితర జిల్లా యంత్రాంగం గురువారం ఒకరి వెంట ఒకరు బెండలపాడులో నిర్మాణంలో ఉన్న ఇందిరమ్మ ఇళ్లతో పాటు గృహప్రవేశానికి ప్రారంభంగా ఉన్న ఇళ్లను పరిశీలించారు. రాష్ట్రంలోనే మొట్టమొదటి మండలంగా చంద్రుగొండ గుర్తింపు పొంది అత్యధికంగా 330కి పైగా ఇందిరమ్మ ఇల్లు మంజూరై 50 ఇళ్లకు పైగా గృహప్రవేశానికి సిద్ధంగా ఉన్నాయి. అశ్వరావుపేట ఎమ్మెల్యే జారి ఆదినారాయణ ప్రత్యేక చొరవ తీసుకొని నియోజకవర్గం వ్యాప్తంగా ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి ప్రత్యేకంగా కృషి చేస్తూ ఇల్లు కట్టించుకోలేని వారికి సైతం గుత్తేదారులను ఇల్లు కట్టే విధంగా పూను కొని రాష్ట్రవ్యాప్తంగా చంద్రుగొండ మండలాన్ని, అశ్వరావుపేట నియోజకవర్గాన్ని వన్నె తీసుకొస్తున్నారు. వాతావరణం అనుకూలిస్తే ఈ నెల 21న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చంద్రుగొండ మండలానికి విచ్చేసే అవకాశం ఉంది. సుమారు 50 వేల మంది హాజరయ్యే విధంగా సభ ఏర్పాటు చేయనున్నట్లుగా తెలుస్తుంది. అన్నీ కుదిరితే బెండలపాడులో లేని పక్షంలో దామరచర్లలో సభ ఏర్పాట్లు చేసే అవకాశం ఉంది. ఈ కార్యక్రమాల్లో ట్రైనీ కలెక్టర్ సౌరత్ శర్మ, డిఎస్పీ అబ్దుల్ రహమాన్, ఇందిరమ్మ ఇళ్ల జిల్లా ప్రాజెక్టు డైరెక్టర్ రవీంద్రనాథ్, తహసిల్దార్ సంధ్యారాణి, ఎంపీడీవో అశోక్, ఎస్సై శివరామకృష్ణ,కాంగ్రెస్ నాయకులు భోజ్య నాయక్, అంకిరెడ్డి కృష్ణారెడ్డి, అశ్వరావుపేట నియోజకవర్గ సేవాదళ్ ప్రధాన కార్యదర్శి ఫజల్ భక్ష్, బొర్రా సురేష్, సారేపల్లి శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

## 36 బాంబే స్కీమ్ ఇళ్లకు తక్షణం ఆల్ట్ ఏర్పాటు చేయాలి

- సిపిఎం డిమాండ్

**చంపాపేట్, ఆగస్టు 14 (జనం సాక్షి) :** చంద్రయానగుట్ట నియోజకవర్గం బండ్లగూడ మండలం జంగంమెట్ డివిజన్‌లోని రవీందర్ నాయక్ నగర్ కాలనీలో 36 బాంబే స్కీమ్ ఇళ్లు కూలిపోవడానికి ప్రమాదకర స్థితిలో ఉండటంతో, అక్కడి కుటుంబాలకు తక్షణమే ప్రత్యామ్నాయ వసతి కల్పించాలని సిపిఎం పార్టీ జంగంమెట్ డివిజన్ కార్యదర్శి ఏ.కృష్ణా నాయక్ ప్రభుత్వాన్ని కోరారు. ఈ నేపథ్యంలో, ఆయన రెవెన్యూ అధికారికి వినతిపత్రం అందజేశారు. అనంతరం మాట్లాడుతూ, "వర్షాకాలం కారణంగా ఇళ్లు మరింత దెబ్బతిన్నాయి. ఎప్పుడైనా కూలిపోవచ్చనే భయం ప్రజల్లో ఉంది. ప్రభుత్వం ఇప్పటికీ స్పష్టమైన నిర్ణయం తీసుకోకపోవడం విచారకరం" అని ఆవేదన వ్యక్తం చేశారు. ఇళ్ల పునర్నిర్మాణం చేస్తారా, లేక సమీపంలోని డబుల్ బెడ్‌రూమ్ హౌసింగ్‌లో వసతి కల్పిస్తారా అన్న విషయంపై అధికారులు ఇప్పటి వరకు సమాధానం ఇవ్వలేదని ఆయన విమర్శించారు. "ప్రాణ నష్టం జరగక ముందే, 36 కుటుంబాలకు సురక్షితమైన ఆల్ట్ ఏర్పాటు చేయడం ప్రభుత్వ అత్యవసర కర్తవ్యము" అని కృష్ణా నాయక్ హితవు పలికారు. ఇప్పటికే రెవెన్యూ శాఖ సోషల్ ఎకనామిక్ సర్వే పూర్తి చేసినప్పటికీ, చర్యలు ఆలస్యం అవుతున్నాయని తెలిపారు. ఈ సమస్యపై ప్రజల తరఫున నిరంతరం పోరాడతామని, తక్షణ చర్య తీసుకోవాలని అధికారులకు హెచ్చరిక జారీ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు శ్రీను, రాజేష్, జంగయ్య తదితరులు పాల్గొన్నారు.



## ప్రతి ఇంటిపై జాతీయ జెండా ఎగురవేద్దాం



**రాజేంద్రనగర్, ఆగస్టు 14 (జనంసాక్షి) :** 15 ఆగస్టు స్వాతంత్ర దినోత్సవం సందర్భంగా ప్రధాని నరేంద్ర మోడీ ఆదేశాలతో కేంద్ర ప్రభుత్వం నిర్దేశించిన హర్ ఘర్ తిరంగా కార్యక్రమంలో ఇంటింటికి జాతీయ జెండాను ఎగురవేసి దేశభక్తి ని చాటుదామని మైలార్ దేవ్ పల్లి డివిజన్ 2వ అధ్యక్షుడు సూరెడ్డి వినయ్ రెడ్డి కాటేదాన్ లో, రాజేంద్రనగర్ బిజెపి అధ్యక్షుడు సందీప్ ముదిరాజ్ శివరాంపల్లి గ్రామంలో, బిజెపి సీనియర్ నాయకులు కొమిరెడ్డి ఉమామహేశ్వర్ రెడ్డి ఆధ్వర్యంలో రాంబాబు ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులచే హర్గర్ తిరంగా ర్యాలీ లో ప్రతి ఇంటిపై జాతీయ పతాకాన్ని ఎగురవేయాలని కోరారు.ఈ కార్యక్రమంలో ఓబిసి రాష్ట్ర నేత అడికె రాజు, అసెంబ్లీ కన్వీనర్ బొమ్మరాజు నరసింహ రావు, శ్రీనివాస్ యాదవ్,హరికిషన్ జి, బాబురావు, సొల్కర్ రెడ్డి, వనిత రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# ఆ మూలమలుపు..ప్రమాదాలకు పిలుపు..

- మద్దుకూరు పాఠశాల ముందు బోల్తాపడిన లారీ
- వారానికి ఒకటి చొప్పున మూలమలుపు వద్ద ప్రమాదాలు



**చంద్రుగొండ, ఆగస్టు 14 (జనం సాక్షి) :** అదృష్టమనాలో దురదృష్టమనాలో చెప్పలేని పరిస్థితి పాఠశాల వద్ద ప్రమాదాలు జరిగిన ప్రతిసారి ఎటువంటి ప్రాణా నష్టం జరగకపోవడం వకింత చెంతన చేకూర్చిన ఆ ప్రమాదాలు జరగకుండా చేయాల్సిన బాధ్యత అధికారులదే. వారానికి ఒకటి చొప్పున మూలమలుపు వద్ద ప్రమాదాలు జరుగుతూనే ఉన్నాయి. సమస్యను ఎన్నిసార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా, పట్టించుకునే నాధుడే లేడని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. చంద్రుగొండ మండలంలోని మద్దుకూరు మూలమలుపు ఇప్పుడు ప్రాణాంతక ప్రదేశంగా మారింది. గురువారం ఉదయం వియ్యం బంజర్ నుంచి కొత్తగూడెం వైపు వెళ్తున్న లారీ అదుపుతప్పి పాఠశాల పక్కనే బోల్తాపడింది. ఈ ఘటన పాఠశాల ప్రారంభానికి గంట ముందే జరిగిందన్నది గమనార్హం. మరో గంట తరవాత జరిగితే విద్యార్థులు రోడ్డు మీద నడుస్తున్న సమయంలో ఫలితాలు ఊహించుకోవడానికే భయంకరంగా ఉండేవి.

### అధికారుల నిర్లక్ష్యం

ఒకటా రెండా కాదు ఏడాది పొడవునా ఎన్నో ప్రమాదాలు చోటుచేసుకున్నా నేషనల్ హైవే అథారిటీ నుంచి ఎలాంటి చర్యలు లేవు. మూలమలుపు వద్ద రోడ్డు రైలింగ్ పాడైపోయి బోల్తాపడిన వాహనాలు తాకినా, దానిని మరమ్మతు చేయకపోవడం అధికారులు ఎంత నిర్లక్ష్యం వహిస్తున్నారో చూపుతోంది.

### పాఠశాల రక్షణ గోడ నామమాత్రం

మద్దుకూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రహరీ గోడ నామమాత్రంగా ఉంది. దానిని గట్టి కాంక్రీట్ గోడగా నిర్మిస్తే, ప్రమాదం జరిగినా వాహనాలు పాఠశాలలోకి దూసుకెళ్లే ప్రమాదం తప్పుతుంది.

### ప్రజల విజ్ఞప్తి

"ఈ విషయంలో అయినా అధికారులు శ్రద్ధ చూపాలి. మూలమలుపు వద్ద సరైన రక్షణ ఏర్పాట్లు చేయాలి" అని గ్రామ ప్రజలు కోరుతున్నారు.

### "మాకు రక్షణ కల్పించండని విద్యార్థుల నిరసన

ఏ క్షణాన ఏమవుతుందో తెలియని పరిస్థితి ప్రతిరోజూ ప్రమాద భయంతో పాఠశాలకు వెళ్తున్నామని విద్యార్థులు చెబుతున్నారు. "ఇప్పటివరకు ఎన్నో ప్రమాదాలు చూశాం. అధికారులు పట్టించుకోవడం లేదు. వెంటనే రక్షణ ఏర్పాట్లు చేయాలి" అని విద్యార్థులు నినాదాలు చేశారు.

# ముందస్తు సహాయక చర్యలు చేపట్టాలి

- జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్




**సూర్యాపేట ప్రతినిధి, ఆగస్టు 14 (జనంసాక్షి) :** జిల్లాలో అతి భారీ వర్షాలు కురిసిన ప్రజలకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా ముందస్తు సహాయక చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టరేట్ లవ్ జిల్లా ఎస్పీ కె.నరసింహ, అదనపు కలెక్టర్ పి.రాంబాబుతో కలిసి అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ అన్ని శాఖల అధికారులు 24 గంటలపాటు అందుబాటులో ఉండేలా కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేశామని అన్నారు. బుధవారం 17 మంది ఫోన్ చేసి సమస్య తెలుపగా, అన్ని సమస్యలు పరిష్కరించామని చెప్పారు. అన్ని శాఖల అధికారులు సమన్వయం చేసుకుంటూ మరో 48 గంటలు ప్రజలకి అందుబాటులో ఉండాలని అన్నారు.గ్రామాలలో శిథిలావస్థలో ఉన్న పాత ఇల్లులు గుర్తించి అందులో ఉంటున్న ప్రజలను రెవెన్యూ, పంచాయతీరాజ్ అధికారులు సమన్వయం చేసుకుంటూ వారికి రిలీఫ్ క్యాంపులో కి తరలించాలని సూచించారు.గోడలు తడిసి ఉండటం వల్ల విద్యుత్ షాక్ తగలకుండా ఎలక్ట్రిసిటీ సిబ్బంది ప్రజలను అప్రమత్తం చేయాలని అన్నారు. ఇరిగేషన్ శాఖ అధికారులు చెరువులను ఎప్పటికప్పుడు పరిశీలిస్తూ ఎలాంటి డామేజ్‌లు కాకుండా చూసుకోవాలని తెలిపారు. కల్వర్టులు, బ్రిడ్జిలపై నుండి నీరు ప్రవహిస్తే అక్కడ సిబ్బందిని నియమించాలని, ఎక్కడైనా రోడ్లు తెగితే వెంటనే సమాచారాన్ని కంట్రోల్ రూమ్ కి తెలియజేయాలన్నారు. జాతీయ రహదారులపై నీరు నిలవకుండా చూడాలని ఆదేశించారు. వైద్య శాఖ సిబ్బంది యాంటీవీనం ఇంజక్షన్, ప్రసవాలకు సంబంధించి ప్రత్యేక ఏర్పాట్లు చేయాలని అన్నారు. వరదల తర్వాత సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ప్రజలను అప్రమత్తం చేయాలని అన్నారు. నాణ్యమైన త్రాగు నీరును సరఫరా చేయాలని, ఎక్కడైనా వరదలతో పైప్ లైన్ తెగిపోతే అక్కడ క్లోరినేషన్ టెస్ట్ చేసిన తర్వాతే త్రాగునీరు సరఫరా చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో డిఆర్డిఏ పిడి వివి అప్పారావు,ఆర్డిఓ వేణుమాధవ్, డిపిఓ యాదగిరి, ఆర్అండ్ బి ఎస్ఈ సీతారామయ్య, పిఆర్ ఈఈ మాధవి,వ్యవసాయ అధికారి శ్రీధర్ రెడ్డి, సిపిఓ కిషన్, డిఎంహెచ్ఓ డాక్టర్ చంద్రశేఖర్, డిసీహెచ్ ఎస్ వెంకటేశ్వర్లు, జిజిహెచ్ సూపరింటెండెంట్ శ్రవణ్ కుమార్,ఇరిగేషన్ అదికారి నవికాంత్, మిషన్ భగీరథ శ్రీనివాస్, అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.




## మోటారు బీమా పంపిణీలో భాగంగా భాగస్వామ్యం

### ఐసీఐసీఐ లాంబార్డ్, మహీంద్రా ఫైనాన్స్



ముంబై (జనంసాక్షి):ఐసిఐసిఐ లోంబార్డ్ జనరల్ ఇన్సూరెన్స్ (ఐసిఐసిఐ లోంబార్డ్), భారతదేశంలోని ప్రముఖ ప్రైవేట్ జనరల్ ఇన్సూరెన్స్ కంపెనీలలో ఒకటి, తన వినియోగదారులకు మోటారు బీమా ప్రోడక్టులను పంపిణీ చేయడానికి భారతదేశంలోని ప్రముఖ నాన్-బ్యాంకింగ్ ఫైనాన్స్ కంపెనీలలో ఒకటైన మహీంద్రా అండ్ మహీంద్రా ఫైనాన్షియల్ సర్వీసెస్ లిమిటెడ్ (మహీంద్రా ఫైనాన్స్) తో భాగస్వామ్యం ప్రకటించింది. ఈ భాగస్వామ్యం ద్వారా మహీంద్రా ఫైనాన్స్‌కు ఉన్న విస్తృత గ్రామీణ, పాక్షిక-పట్టణ వ్యాప్తిని, ఐసీఐసీఐ లోంబార్డ్‌కు ఉన్న మోటార్ ఇన్సూరెన్స్ నైపుణ్యంతో కలిపి, మరింత సులభంగా అందుబాటులో ఉండే, కస్టమర్ అవసరాలకు అనుగుణంగా ఉండే బీమా పరిష్కారాలను వినియోగదారులకు చేరవేయడం లక్ష్యంగా పెట్టుకుంది. ఈ భాగస్వామ్యం ద్వారా, మహీంద్రా ఫైనాన్స్ కస్టమర్లు ఇప్పుడు ఐసిఐసిఐ లోంబార్డ్ అందించే మోటార్ బీమా ప్రోడక్టుల విస్తృత పోర్ట్ఫోలియోకు ప్రాప్యతను పొందడం ద్వారా, వారి పెద్ద ఆర్థిక ప్రయాణంలో రక్షణ సజావుగా పొందుపరచబడిందని నిర్ధారిస్తుంది. సకాలంలో మరియు సంబంధిత బీమా పరిష్కారాలతో మహీంద్రా ఫైనాన్స్ విస్తృత కస్టమర్ బేస్‌ను చేరుకోవడం ద్వారా ఆర్థిక చేరికను మరింతగా విస్తరించడంలో కీలక పాత్ర పోషిస్తుంది. మిస్టర్. సంజీవ్ మంత్రి-మేనేజింగ్ డైరెక్టర్, సిఇఒ, ఐసిఐసిఐ లోంబార్డ్ ఇలా పేర్కొన్నారు, "ఐసీఐసీఐ లోంబార్డ్ వద్ద, బీమా అనేది వినియోగదారుల అవసరాలకు అనుగుణంగా ఉండాలని విశ్వసిస్తాము.అది అందుబాటులో ఉండాలి, సంబంధితంగా ఉండాలి, వారి రోజువారీ ఆర్థిక ప్రయాణంలో సజావుగా మిళితం కావాలి. మా బహుళ-ఉత్పత్తి, బహుళ-చానల్ వ్యూహం ఈ తత్వాన్ని ప్రతిబింబిస్తుంది." రౌల్ రెబెల్లో, మేనేజింగ్ డైరెక్టర్, సిఇఒ, మహీంద్రా ఫైనాన్స్ ఇలా అన్నారు. "ఈ భాగస్వామ్యం, ఆర్థిక భద్రతతో వినియోగదారులను శక్తివంతం చేసే మా ప్రయాణంలో మరో ముఖ్యమైన అడుగును సూచించడమే కాక, అభివృద్ధి చెందుతున్న భారతదేశానికి విశ్వసనీయ, బాధ్యతాయుత ఆర్థిక భాగస్వామిగా ఉండాలనే మా నిబద్ధతను మరింత బలపరుస్తుంది."

# స్టాక్ మార్కెట్‌లో కొత్త ఇండెక్స్

జనంసాక్షి:బీఎస్‌ఈ ఇండెక్స్ సర్వీసెస్ విభాగం తాజాగా డిఫెన్స్ ఇండెక్స్‌ను ప్రారంభించింది. బీఎస్‌ఈ 1000 ఇండెక్స్‌లోని డిఫెన్స్ థీమ్ స్టాక్స్ ఈ సూచీలో ఉంటాయి.ఏటా రెండు సార్లు (జూన్, డిసెంబర్‌లో) ఇండెక్స్‌లో మార్పులు, చేర్పులు చేస్తారు. విధాన సంస్కరణలు, పెరుగుతున్న బడ్జెట్ కేటాయింపులు, దేశీయంగా తయారీపై మరింతగా దృష్టి పెరుగుతుండటం తదితర సానుకూల అంశాలతో డిఫెన్స్ రంగం గణనీయంగా వృద్ధి చెందనుందని బీఎస్‌ఈ ఇండెక్స్ సర్వీసెస్ వివరించింది.ఈ నేపథ్యంలో ఈటీఎఫ్‌లు, ఇండెక్స్ ఫండ్స్ మొదలైన ప్యాసివ్ ఫండ్స్‌కి ఇండెక్స్ ఉపయోగకరంగా ఉంటుందని వెల్లడించింది. అలాగే, పీఎంఎస్ వ్యూహాలు, మ్యుచువల్ ఫండ్ స్కీములు, ఫండ్ పోర్ట్‌ఫోలియోల పనితీరు మదింపునకు దీన్ని ప్రామాణికంగా ఉపయోగించుకోవచ్చని పేర్కొంది.



**స్టాక్ మార్కెట్ ఫ్లాట్..**

దేశీయ స్టాక్‌మార్కెట్లు గురువారం ఫ్లాట్ గా ముగిశాయి. వీక్లీ నిఫ్టీ 50 ఆప్షన్ల గడువు ముగియడంతో బెంచ్ మార్క్ సూచీలు కొంత ఒడిదుడుకులకు లోనయ్యాయి.ఎన్ఎస్ఈ నిఫ్టీ 11.95 పాయింట్లు లేదా 0.01 శాతం పెరిగి 24,631.30 వద్ద ముగిసింది.మరోవైపు సెన్సెక్స్ 261 పాయింట్ల స్వల్ప రేంజ్‌లో కదలాడింది. బీఎస్‌ఈ బెంచ్‌మార్క్ 80,751.18 వద్ద గరిష్టాన్ని, 80,489.86 వద్ద కనిష్టాన్ని తాకింది. చివరకు సెన్సెక్స్ 0.07 శాతం లేదా 57.75 పాయింట్లు పెరిగి 80,597.66 వద్ద స్థిరపడింది.బీఎస్‌ఈలో ఇన్ఫోసిస్, ఏషియన్ పెయింట్స్ టాప్ గెయినర్స్‌గా నిలవగా, టాటా స్టీల్, టెక్ మహీంద్రా, అదానీ పోర్ట్స్ నష్టపోయాయి. ఎన్ఎస్ఈలో విప్రో, ఇన్ఫోసిస్ టాప్ గెయినర్స్‌గా నిలవగా, టాటా స్టీల్, అదానీ పోర్ట్స్, హీరో మోటోకార్ప్ టాప్ లూజర్స్‌గా నిలిచాయి.విస్తృత సూచీలు నష్టాల్లో ముగిశాయి. నిఫ్టీ మిడ్ క్యాప్ 100 ఇండెక్స్ 0.31 శాతం నష్టపోగా, స్మాల్ క్యాప్ 0.38 శాతం నష్టపోయింది. రంగాలవారీగా పనితీరు మిశ్రమంగా ఉంది. నిఫ్టీ కన్స్యూమర్ డ్యూరబుల్స్ (0.75 శాతం), నిఫ్టీ ఐటీ (0.4 శాతం) టాప్ గెయినర్స్‌గా నిలిచాయి. మెటల్, రియల్టీ వరుసగా 1.39 శాతం, 0.76 శాతం నష్టపోయాయి.కాగా ఈవారం ట్రేడింగ్ సెషన్ ఈరోజుతో ముగిసింది. స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆగస్టు 15న శుక్రవారం భారత మార్కెట్లకు సెలవు ఉంటుంది. తదుపరి మార్కెట్ సెషన్ ఆగస్టు 18న ప్రారంభం కానుంది.

## స్టాక్ మార్కెట్లో సర్వస్వం పోయింది.. ఇప్పుడు రూ.2.4 కోట్ల వేతనం!

జీవితమంటేనే కష్టాలు, కన్నీళ్లు. వీటికి భయపడకుండా పట్టుదలతో కృషి చేస్తేనే.. సక్సెస్ సాధ్యమవుతుంది. దీనిని నిరూపించినవాళ్ల గురించి గతంలో చాలానే తెలుసుకున్నాం.ఇప్పుడు తాజాగా ఇదేకోవకు చెందిన మరో వ్యక్తి గురించి.. అతని సక్సెస్ జర్నీ గురించి తెలుసుకుందాం. 2008లో ఢిల్లీలోని ఒక మధ్యతరగతి కుటుంబం. ఆ కుటుంబంలో తండ్రి స్టాక్ మార్కెట్లో సర్వసం కోల్పోయాడు. కానీ కొడుకు దశాబ్దానిపైగా కృషి చేసి.. కెరీర్‌ను అద్భుతంగా నిర్మించుకున్నాడు. ఏడాదికి రూ. 2.4 కోట్లు సంపాదించే స్థాయికి ఎదిగాడు.ఢిల్లీలో మధ్య తరగతిలో పుట్టి పెరిగిన ఆ వ్యక్తి (కొడుకు).. ప్రారంభ జీవితం చాలా సాఫీగా సాగింది. అయితే 2008లో ఆర్థిక ఇబ్బందులు ఎదురయ్యాయి. కానీ చదువుకునే రోజుల్లోనే.. పాఠశాలలో నాటకాలు, డ్యాన్స్ ఇతర కార్యకలాపాలలో పాల్గొనేవాడు. ఇంటర్మీడియట్‌లో సైన్స్ ఎంచుకున్నాడు. ఆ తరువాత ఢిల్లీ యూనివర్సిటీలో ఆర్థిక శాస్త్రంలో తన బ్యాచిలర్ డిగ్రీ, మాస్టర్స్ డిగ్రీ పూర్తి చేశాడు.చదువు పూర్తయిన తరువాత 2014లో నెలకు రూ. 35,000 జీతంతో ఉద్యోగం సంపాదించాడు. 2016లో తన స్నేహితురాలికి దగ్గరగా ఉండాలని ఉద్యోగం మారాడు. అప్పుడు అతని జీతం రూ. 60,000లకు పెరిగింది. 2017లో మరొక ఉద్యోగంలో చేరాడు. అప్పుడు అతని జీతం రూ. 90,000లకు చేరింది. ఐదేళ్లు అదే కంపెనీలు ఉంటూ.. 2021 నాటికి నెలకు రూ. 2 లక్షల జీతం సంపాదించే స్థాయికి ఎదిగాడు.2022లో విదేశాల్లో ఉద్యోగం చేయడానికి ఆఫర్ వచ్చింది. అక్కడ అతని వార్షిక వేతనం 202000 డాలర్లు (రూ.1.7 కోట్ల కంటే ఎక్కువ). 2025 నాటికి అతని వేతనం రూ. 2.4 కోట్ల కంటే ఎక్కువ అయింది. కేవలం రూ. 35000 జీతంతో మొదలైన వ్యక్తి.. రూ.2.4 కోట్ల వేతనం వరకు ఎదిగాడంటే.. దాని వెనుక అతని శ్రమ ఎంత ఉంటుందో స్పష్టంగా అర్థం చేసుకోవచ్చు.ఉద్యోగం చేసే సమయంలో.. జీవితాన్ని ఆస్వాదించడం కొనసాగించారు. మొత్తం నాలుగు ఖండాల్లో 17 దేశాలు ప్రయాణించాడు. తన ప్రియురాలిని పెళ్లి చేసుకున్నాడు. చిన్నప్పుడు ఎడ్ల బండిలో ప్రయాణించిన ఇతడు.. లగ్జరీ విమానాలలో ప్రయాణించే వరకు ఎదిగాడు. డబ్బు ఒక నిర్దిష్ట స్థాయి వరకు ముఖ్యమైనదని, కానీ దానికి మించి, ఆరోగ్యం, సంబంధాలు, అనుభవాలు ప్రాధాన్యత ఇవ్వాలని ఆ వ్యక్తి చెబుతాడు. జీవితంలో ఏ దశలోనైనా డబ్బు సంపాదించవచ్చు, కానీ సమయాన్ని తిరిగి పొందలేమని పేర్కొన్నారు.

## భారత్‌లో అత్యంత సరసమైన కార్లు ఇవే!

జనంసాక్షి:దేశీయ మార్కెట్లో ఎన్నెన్ని కొత్త కార్లను లాంచ్ అయినా.. కొనుగోలుదారులు మాత్రం సరసమైన వాహనాలను కొనుగోలు చేయడానికే ఆసక్తి చూపుతారు. దీనిని దృష్టిలో ఉంచుకుని పలు కంపెనీలు తక్కువ ధర వద్ద కూడా కార్లను లాంచ్ చేస్తున్నాయి.ఈ కథనంలో ఇండియన్ మార్కెట్లో అందుబాటులో ఉన్న టాప్ 10 అఫర్డబుల్ కార్లు ఏవో చూసేద్దాం.మారుతి సుజుకి ఆల్టో కే10: రూ. 4.23 లక్షల నుంచి రూ. 6.21 లక్షలు మారుతి సుజుకి ఎస్-ప్రెస్సో: రూ. 4.27 లక్షల నుంచి రూ. 6.01 లక్షలు రెనాల్ట్ క్విడ్: రూ. 4.70 లక్షల నుంచి 6.5 లక్షలు టాటా టియాగో: రూ. 5 లక్షల నుంచి రూ. 8.85 లక్షలు సిట్రోయెన్ సీ3: రూ. 5.25 లక్షల నుంచి రూ. 9.90 లక్షలు మారుతి సుజుకి సెలెరియో: రూ. 5.64 లక్షల నుంచి రూ. 7.37 లక్షలుమారుతి సుజుకి ఈకో: రూ. 5.7 లక్షల నుంచి రూ. 6.06 లక్షలు మారుతి సుజుకి వ్యాగన్ ఆర్: రూ. 5.79 లక్షల నుంచి రూ. 7.02 లక్షలు ?మారుతి సుజుకి ఇగ్నిస్: రూ. 5.85 లక్షల నుంచి రూ. 8.12 లక్షలు ?హ్యుందాయ్ ఐ10 నియోస్: రూ. 5.98 లక్షల నుంచి రూ. 8.66 లక్షలు



### గుడ్ల ధరలు

| హైదరాబాద్ | వరంగల్ |
|---|---|
| ₹ 4.85 | ₹ 4.87 |

### బంగారం ధరలు (10 గ్రాములు)

హైదరాబాద్

| ₹ 92,900 (22 క్యారెట్లు) | ₹ 1,01,350 (24 క్యారెట్లు) |
|---|---|

### వెండి ధరలు (కేజీ)

హైదరాబాద్

₹ 1,26,000

## రూ.31 కోట్లతో ఆస్తి కొనుగోలు చేసిన హృతిక్ రోషన్

జనంసాక్షి:కొత్త సినిమా వార్2తో అలరిస్తున్న బాలీవుడ్ నటుడు హృతిక్ రోషన్ నటనలోనే కాదు వ్యాపారంలోనూ దూసుకుపోతున్నారు. ఆస్తులు కూడబెట్టడంలో, వాటి విలువను పెంచడంలో ప్రత్యేక శ్రద్ధ చూపిస్తున్నారు.ఇటీవల ముంబయిలోని ఓ ఆస్తిని కొనుగోలు చేయడంతో అందుకు సంబంధించిన వివరాలు వైరల్ అవుతున్నాయి.హృతిక్ రోషన్ తన తండ్రి రాకేష్ రోషన్ స్థాపించిన హెచ్‌ఆర్‌ఎక్స్ డిజిటెక్ ఎల్‌ఎల్‌పీ కంపెనీ కోసం ముంబైలోని చండీవాలి ప్రాంతంలో మూడు కార్యాలయ యూనిట్లను రూ.31 కోట్లకు కొనుగోలు చేశారు. అంధేరీ ఈస్ట్‌లోని చండీవలి ప్రాంతంలోని బూమరాంగ్ పేరుతో ఉన్న భవనం మొదటి అంతస్తులోని ఈ మూడు కార్యాలయాలు 13,546 చదరపు అడుగుల విస్తీర్ణంలో విస్తరించి ఉన్నాయి. దీనికి సంబంధించి 2025 జులై 9న కొనుగోలు జరిగిందని డాక్యుమెంట్ల ద్వారా తెలుస్తుంది.ప్రాపర్టీ రిజిస్ట్రేషన్ డాక్యుమెంట్ల ప్రకారం ఈ లావాదేవీలో స్టాంప్ డ్యూటీ రూ.1.86 కోట్లు, రిజిస్ట్రేషన్ ఫీజు రూ.30 వేలుగా ఉంది.

## భారత్ సెమీకండక్టర్ల తయారీకి

# సింగపూర్ మద్దతు

### ముగిసిన మూడో మినిస్టీరియల్ రౌండ్ టేబుల్ సమావేశం

జనంసాక్షి:న్యూఢిల్లీలో తాజాగా జరిగిన మూడో భారత్-సింగపూర్ మినిస్టీరియల్ రౌండ్ టేబుల్ (ఐఎస్ఎంఆర్) సమావేశం విజయవంతంగా ముగిసింది. అధిక ప్రభావం ఉన్న రంగాల్లో తమ వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని బలోపేతం చేసుకోవడానికి భారత్-సింగపూర్ పనిచేస్తున్నట్లు ఇరుదేశాల ప్రతినిధులు తెలిపారు. సింగపూర్ ప్రధాని లారెన్స్ వాంగ్ సెప్టెంబర్‌లో భారత పర్యటనకు రానున్న నేపథ్యంలో ఈ సమావేశం కీలకంగా మారింది.ఈ ఉన్నత స్థాయి మంత్రుల సమావేశంలో ద్వైపాక్షిక సంబంధాలను బలోపేతం చేయడానికి ఉద్దేశించిన ఆరు అంశాలపై చర్చ జరిగినట్లు అధికారులు తెలిపారు.

**డిజిటలైజేషన్:**భారత్ సెమీకండక్టర్ల తయారీ ఆశయాలకు సింగపూర్ మద్దతు ప్రకటించింది.



అదనంగా ఇరుపక్షాలు గ్రీన్ హైడ్రోజన్ సహకారాన్ని అన్వేషిస్తున్నట్లు చెప్పాయి. రాబోయే రోజుల్లో ఒడిశా హైడ్రోజన్ ఎగుమతులకు కేంద్రంగా మారుతుందని తెలిపాయి. భారత్‌లో ఐదు స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్ల ఏర్పాటుకు సింగపూర్ సహకరిస్తుందని తెలిపింది. ఒడిశాలోని ఒక కేంద్రంలో ఏటా 3,000 మంది యువ భారతీయులకు మెకట్రానిక్స్, హెచ్‌వీఏసీ వ్యవస్థల్లో శిక్షణ ఇవ్వనున్నారు.రెండు ఆర్థిక వ్యవస్థల మధ్య సీమాంతర డేటా ట్రాన్స్‌మిషన్‌ను క్రమబద్ధీకరించడానికి, క్యాపిటల్ మార్కెట్ ఏకీకరణను బలోపేతం చేయడానికి అవసరమైన ఫ్రేమ్‌వర్క్‌లను చర్చించారు. సింగపూర్ నుంచి భారత్ దిగుమతులు: 21.3 బిలియన్ డాలర్లు సింగపూర్‌కు భారత ఎగుమతులు: 13 బిలియన్ డాలర్లు విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులు (ఎఫ్‌డీఐ): భారత్‌కు సింగపూర్ నుంచే అధికంగా విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులు సమకూరుతున్నాయి. ఇది మొత్తం ఎఫ్‌డీఐ రాకలో 24% దోహదం చేస్తుంది. గత 25 సంవత్సరాలలో 174.8 బిలియన్ డాలర్లు సమకూరాయి.

**రేణుకాస్వామి హత్య కేసులో**

# దర్శన్ బెయిల్ రద్దు



- సుప్రీం తీర్పుతో దర్శన్, పవిత్ర గౌడ్‌ల అరెస్ట్
- హైకోర్టు బెయిల్ తీర్పును కొట్టేసిన సుప్రీం
- ఇలాంటి కేసుల్లో బెయిల్ సరికాదన్న ధర్మాసనం

న్యూఢిల్లీ(జనంసాక్షి):రేణుకాస్వామి (33) హత్య కేసులో నిందితులైన నటుడు దర్శన్ నటి పవిత్రా గౌడ్‌కు సుప్రీంకోర్టులో గట్టి షాక్ తగిలింది. ఈ కేసులో నిందితుల బెయిల్ రద్దు చేస్తూ తీర్పు వెల్లడించింది. దీంతో అప్రమత్తమైన బెంగళూరు పోలీసులు తీర్పు వెలువడిన గంటల వ్యవధిలోనే వీరిద్దరినీ అరెస్టు చేశారు. తొలుత పవిత్రా గౌడను ఆమె ఇంట్లోనే కస్టడీలోకి తీసుకోగా.. ఆ తర్వాత దర్శన్‌ను అరెస్టు చేశారు.దర్శన్ బెంగళూరులోని సకెరెహళ్లిలోని తన భార్య ఇంటికి వెళ్లి మీడియా నుంచి తప్పించుకొనేందుకు ఎగ్జిట్ గేట్ ద్వారా లోపలికి ప్రవేశించాడని, తన భార్య, కొడుకును కలిసిన అనంతరం పోలీసులు అరెస్టు చేసినట్లు సమాచారం. చిత్రదుర్గ నివాసి రేణుకాస్వామి హత్య కేసులో నటి పవిత్ర గౌడ, ప్రముఖ నటుడు దర్శన్ ప్రధాన నిందితులుగా ఉన్న విషయం తెలిసిందే. ఈ కేసులో గతేడాది డిసెంబర్‌లో కర్ణాటక హైకోర్టు వీరికి బెయిల్ మంజూరు చేయగా.. దీన్ని రద్దుచేయాలని కోరుతూ కర్ణాటక పోలీసులు గతంలో దాఖలు చేసిన పిటిషన్‌పై విచారించిన సర్వోన్నత న్యాయస్థానం తాజాగా ఉత్తర్వులు ఇచ్చింది. నిందితులను కస్టడీలోకి తీసుకొని త్వరగా విచారణ చేపట్టాలని సర్వోన్నత న్యాయస్థానం అధికారులను ఆదేశించింది. కర్ణాటకలో దర్శన్ అభిమాని రేణుకాస్వామి హత్య కేసు సంచలనంగా మారిన విషయం తెలిసిందే. పవిత్రకు అసభ్య సందేశం పంపాడన్న కారణంతో అతడిని చిత్రహింసలకు గురిచేసి హత్య చేసినట్లు పోలీసులు గుర్తించారు. ఈ కేసులో దర్శన్, ఆయన స్నేహితురాలు పవిత్రగౌడ సహా 15 మందిని అరెస్టు చేశారు. రేణుకాస్వామిపై అత్యంత పాశవికంగా దాడి చేసినట్టు- విచారణలో తేలింది. అతడికి కరెంట్ షాక్ కూడా పెట్టినట్లు పోస్టుమార్టం నివేదికలో వెల్లడైంది. దర్శన్ తన అభిమాని రేణుకా స్వామి హత్య కేసులో జైలు పాలైన విషయం తెలిసిందే. కర్ణాటక హైకోర్టు ఉత్తర్వులో చాలా లోపాలు ఉన్నాయని పేర్కొంటూ జస్టిస్ జెబి పార్దివాలా, ఆర్ మహదేవన్‌లతో కూడిన ధర్మాసనం దానిని రద్దు చేసింది. 2024లో బెంగళూరులో అరెస్టు చేసినప్పుడు ఈ హత్య కేసులో నటుడు నిందితుడిగా ఉన్నాడు. పవిత్ర గౌడతో సహా చాలా మంది ఈ కేసులో నిందితులుగా ఉన్నారు. బెయిల్ మంజూరు, బెయిల్ రద్దుతో సహా ప్రతి అంశాన్ని మేము పరిగణనలోకి తీసుకున్నాము. హైకోర్టు ఉత్తర్వులో తీవ్రమైన లోపభూయిష్టత ఉందని స్పష్టంగా తెలుస్తుంది; ఇది యాంత్రిక ప్రక్రియను ప్రతిబింబిస్తుందని తెలిపింది

## సెక్యూరిటీ గార్డును చంపిన ట్రాన్స్‌జెండర్ జెస్సికా

జనంసాక్షి:లైంగిక వేధింపులకు పాల్పడుతున్న సెక్యూరిటీ గార్డును నేలపైకి తోసి చంపారనే ఆరోపణలతో ఓ ట్రాన్స్‌జెండర్ మహిళను పోలీసులు అరెస్టు చేశారు. వివరాలు..చెన్నైలోని మైలాపూర్‌లోని విశాలాక్షి తొట్టం ప్రాంతానికి చెందిన శేఖర్(57) సెక్యూరిటీ గార్డుగా పనిచేస్తున్నాడు. ఇతడు ఈనెల 7వ తేదీన సెక్యూరిటీ డ్యూటీలో ఉన్నాడు. ఆ సమయంలో జెస్సికా(19) అనే యువతి ఆ దారిలో నడుచుకుంటూ వెళుతోందని తెలుస్తోంది.రాత్రి 10 గంటల ప్రాంతంలో ఆ దారిలో వెళుతున్న జెస్సికాను సెక్యూరిటీ గార్డు శేఖర్ లైంగికంగా వేధించాడని తెలుస్తోంది. దీంతో ఆమె శేఖర్‌ను పట్టుకుని కింద పడేసినట్లు తెలుస్తోంది. ఇందులో శేఖర్ తల వెనుక భాగంలో దెబ్బ తగలడంతో తీవ్రంగా గాయపడ్డాడు. మరుసటి రోజు ఉదయం పొరుగు వారు ప్రాణాపాయ స్థితిలో పడి ఉన్న అతన్ని చూసి చికిత్స కోసం కీల్పాక్ ప్రభుత్వ ఆసుపత్రిలో చేర్పించారు. అక్కడ చికిత్స పొందుతూ బుధవారం మరణించాడు. అభిరామపురం పోలీసులు ట్రాన్స్‌జెండర్ జెస్సికాను అరెస్టు చేశారు.




## ట్రంప్-పుతిన్ చర్చలు విఫలమైతే భారత్‌పై మరిన్ని ఆంక్షలు తప్పవేమో..!

అగ్రరాజ్యం టారిఫ్‌లు 50 శాతానికి చేరింది.ఈ నిర్ణయాన్ని భారత్ తీవ్రంగా వ్యతిరేకించింది. భారమని తెలిసినా.. జాతీయ ప్రయోజనాల విషయంలో రాజీ పడేది లేదని ప్రధాని మోదీ స్పష్టం చేశారు కూడా. ట్రంప్ విధించిన దటి దఫా సుంకాలు ఇప్పటికే అమలు అవుతుండగా.. ఈ నెల 27 నుంచి రెండో దఫా ప్రకటించిన సుంకాలు అమల్లోకి రానున్నాయి.ఇదిలా ఉంటే.. ఈ వ్యవహారంలో అమెరికా-భారత్ మధ్య వాణిజ్య ఒప్పందాలపై వాషింగ్టన్‌లో వరుస చర్చలు జరిగాయి. అయితే ఆ చర్చలు ఓ కొలిక్కి రాలేదు. ఈలోపు ట్రంప్ భారత్‌పై 50 శాతం సుంకాలు విధించారు. అదే సమయంలో.. భారత్‌తో వాణిజ్య చర్చలు ఉండబోవని ప్రకటించారాయన. అయితే ఫాక్స్‌న్యూస్‌తో ఈ అంశంపై ఆర్థిక కార్యదర్శి స్కాట్ బెస్సెంట్ మాట్లాడారు. ఇరు దేశాల చర్చలు కొనసాగే అవకాశమూ ఉందని వ్యాఖ్యానించారు. ఈ నెల 25న అమెరికా నుంచి ప్రతినిధులు భారత్‌కు చేరుకుంటారని తెలిపారు. అయితే.. వ్యవసాయ, డెయిరీ మార్కెట్‌ను కాపాడుకునే ఉద్దేశంలో భారత్ ఉందని, ఇది చర్చలకు విఘాతంగా మారే అవకాశం లేకపోలేదని నిపుణులు అంచనా వేస్తున్నారు.మూడున్నరేళ్ల యుద్ధానికి ముగింపు పలికే ఉద్దేశంతో శాంతి చర్చలు ఉండబోతున్నాయని ట్రంప్ ప్రకటించిన సంగతి తెలిసిందే. రష్యా అధినేత కాల్పుల విరమణకు సిద్ధంగా ఉన్నారా? లేదా? అన్నది అలస్కా వేదికగా శుక్రవారం జరగబోయే చర్చలతోనే తేలిపోతుందని చెబుతున్నారాయన. అదే సమయంలో భూభాగాల మార్పిడితోనే శాంతి ఒప్పందం సాధ్యమవుతుందని ఇరు దేశాలకు మరోసారి సూచించారు కూడా. అయితే ఈ ఆలోచనను ఉక్రెయిన్ మొదటి నుంచి వ్యతిరేకిస్తోంది. భూభాగాల విషయంలో రాజీ పడటం తమ రాజ్యాంగానికి విరుద్ధమని అంటోంది.

# మరో ఐదేళ్లలో జాబిలిపై 'అణువిద్యుత్'

జనంసాక్షి:వ్యోమగాములు తమ అంతరిక్ష పరిశో ధనలకు మజిలీగా చందమామను మార్చుకోవాలని భావిస్తున్న తరుణంలో చంద్రునిపై ఏకంగా అణువిద్యుత్ ఉత్పత్తి కేంద్రాన్ని నెలకొల్పాలని నాసా భావిస్తోంది. అయితే 2030కల్లా అక్కడ న్యూక్లియర్ ప్లాంట్ ఏర్పాటు సాధ్యమా? అనే ప్రశ్న తలెత్తుతోంది.ఎక్కువకాలంపాటు వ్యోమగాములు చంద్రునిపైనే స్థిరనివాసం ఏర్పర్చుకుని జీవించాలన్నా, ఎలాంటి విద్యుత్ అవాంతరాల లేకుండా శాస్త్రసాంకేతిక పరిశోధనలు కొనసా గించాలన్నా అనుక్షణం విద్యుత్ సరఫరా తప్పనిసరి.ప్రాణాధార ఉపకరణాలకూ విద్యుత్ ఖచ్చితంగా అవసరం. అందుకే ఐదేళ్ల లోపే అణువిద్యుత్ కేంద్రాన్ని ఏర్పాటుచేయా లని నాసా భావిస్తోంది. కేంద్రక విచ్ఛిత్తి (న్యూక్లియర్ ఫిజన్) సూత్రంపై పనిచేసే అణుప్లాంట్‌ను అక్కడ నెలకొల్పనున్నారు. అయితే నాసాకు పోటీగా సొంత అణువిద్యుత్ కేంద్రాలను ఏర్పాటుచేస్తామని చైనా, రష్యాలు సైతం ప్రకటించాయి. మరో పదేళ్లలో ఈ ప్లాంట్‌లను ఏర్పాటుచేస్తామని ఇప్పటికే వెల్లడించాయి. చందమామపై స్థిరనివాసం ఏర్పర్చుకునే వ్యోమగాముల నిరంతర విద్యుత్ అవసరా లను సౌరవిద్యుత్ ఏమాత్రం తీర్చలేదు. ఎందుకంటే చంద్రునిపై ప్రతిరోజూ సూర్యకాంతి ప్రసారం కాదు. 14 రోజులపాటు ఏకధాటి గా ఎండకాచి తర్వాత 14 రోజులపాటు మైనస్ డిగ్రీ సెల్సియస్ స్థాయిలో చిమ్మచీకటి నెలకొంటుంది. ఈ చీకటిమయ రోజుల్లో విద్యుత్ అవసరాలు తీర్చే ఏకైక ప్రత్యామ్నా యంగా అణువిద్యుత్‌కేంద్రం నిలుస్తోంది. అందుకే ఎంత ఖర్చయినాసరే వ్యయప్రయా సల కోర్చి చంద్రునిపై న్యూక్లియర్ ప్లాంట్‌ను ఏర్పాటు చేయాలని నాసా కృతనిశ్చయంతో ఉంది. ఇందుకు సంబంధించిన ప్రతిపాదన లకు సైతం పచ్చజెండా ఊపింది. మరో ఐదేళ్లలో



అక్కడ అణువిద్యుత్ ప్లాంట్ కలను సాకారంచేయాలని కంకణం కట్టుకుంది. అణువిద్యుత్ కేంద్రంలో ఏవైనా ప్రమాదాలు సంభవించినా అక్కడ శూన్యం ఉంటుందికనుక రేడియోధార్మికత అంతటా వ్యాపిస్తుందన్న భయం అక్కర్లేదు. థర్మల్, జల, పవన విద్యుత్‌లతో పోలిస్తే చందమామపై అణువిద్యుత్ మాత్రమే ఆచరణ సాధ్యమవుతుంది. సౌరఫలకాలతో సూర్యకాంతిని ఒడిసిపట్టి సౌర విద్యుత్‌ను తయారుచేసినా అది అక్కడి వ్యోమగాముల అవసరాలను ఏమాత్రం తీర్చలేదు. వీటిని పరిగణనలోకి తీసుకుని న్యూక్లియర్ ప్లాంట్ వైపు శాస్త్రవేత్తలు మొగ్గుచూపుతున్నారు. తొలుత కేవలం 100 కిలోవాట్ల విద్యుత్‌ఉత్పత్తి సామర్థ్యంతో ప్లాంట్‌ను నెలకొల్పనున్నారు. భూమి మీద అయితే ఇదే 100 కిలోవాట్ల విద్యుత్‌తో 80 గృహాల విద్యుత్‌అవసరాలు తీర్చొచ్చు. దశలవారీగా ప్లాంట్‌ను విస్తరించి గణనీయమైన స్థాయిలో విద్యుత్‌ను ఉత్పత్తిచేస్తారు. .జల, థర్మల్ విద్యుత్ ప్లాంట్‌లతో పోలిస్తే అణువిద్యుత్ ప్లాంట్‌కు పెద్దగా భూవిస్తీర్ణంతో పనిలేదు. కానీ చంద్రుని మీదకు ఈ మొత్తం అణువిద్యుత్ వ్యవస్థ ఉపకరణాలను మోసుకెళ్లాలంటే చాలా చాలా కష్టం. పైగా ఇవి రాకెట్‌లో తరలించేంత తేలికగా ఉండాలి. అత్యధిక బరువులను ఇప్పుడున్న రాకెట్లు అస్సలుమోయలేవు. ఒకవేళ అధిక బరువులను మోసుకెళ్లేలా వ్యోమనౌకలను డిజైన్‌చేసి రూపొందించినా అవి అంత బరువును మోస్తూకూడా జాగ్రత్తగా చంద్రునిపై ల్యాండ్ కావాల్సి ఉంటుంది. ఏమాత్రం తేడా వచ్చి అది క్రాష్ ల్యాండ్ అయినా వేలకోట్ల రూపాయల నష్టం ఖాయం.భూమిపై అయితే అణువిద్యుత్ కేంద్రాన్ని ఎంతో మంది సాంకేతిక నిపుణులు తీరిగ్గా, నిశితంగా తనిఖీచేసి నిర్మిస్తారు. చంద్రునిపై ఈ ప్లాంట్‌ను నిర్మించాలంటే కార్మిక సిబ్బంది దొరకరు. ఉన్న ఆ కొద్దిపాటి వ్యోమగాములే అణుప్లాంట్ ఉన్నతాధికారుల అవతారమెత్తి ప్లాంట్‌ను బిగించాల్సి ఉంటుంది. అణువిద్యుత్ ప్లాంట్ నుంచి అత్యధిక స్థాయిలో వేడిమి వెలువడుతుంది. దానికి చల్లబరిచే కూలింగ్ వ్యవస్థలను ఏర్పాటుచేయాలి. వాటిని కూడా భూమి మీద నుంచే ఆపరేట్ చేయాల్సి ఉంటుంది. ఇదంతా ఎంతో శ్రమ, వ్యయంతో కూడిన వ్యవహారం.శూన్యస్థితిని తట్టుకునేలా వినూత్న రీతిలో ప్లాంట్‌ను డిజైన్ చేయాల్సి ఉంటుంది. రేడియోధార్మిక వ్యర్థాల పారబోత, ప్లాంట్ పాడైతే రిపేర్లు వంటి ఎన్నో అవరోధాలు అక్కడి హఠాత్తుగా స్వాగతం పలుకుతాయి.వీటిని తట్టుకుంటూనే ప్లాంట్‌ను నిర్వహించాల్సి ఉంటుంది. ట్రంప్ హయాంలో నాసాకు అంతరిక్ష పరిశోధనా బడ్జెట్‌లో భారీ కోత పెట్టిన నేపథ్యంలో ఇతర మార్గాల్లో ఆదాయం సమకూర్చి ఈ ప్రాజెక్ట్‌ను సఫలీకృతం చేయాల్సి ఉంది. ఇన్ని బాలారిష్టాలను దాటుకుని ప్లాంట్ ఏర్పాటు సుసాధ్యమైతే జాబిలిపై మానవనివాసం ఎలాంటి జంజాటాలు లేకుండా హాయిగా సాగుతుంది.

జనంసాక్షి
www.janamsakshi.org
శుక్రవారం
15 ఆగష్టు 2025

## మంత్రి శ్రీధర్ బాబు ప్రత్యేక చొరవ

• మారనున్న మంథని ప్రభుత్వ ఆసుపత్రి రూపురేఖలు



**మంథని, (జనంసాక్షి) :** రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాసన సభ మంత్రి దుద్దిళ్ళ శ్రీధర్ బాబు ఆదేశాలతో జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష నిధులు మంజూరు చేయడం జరిగిందనీ మంథని ప్రభుత్వ ఆసుపత్రిలో డాక్టర్ల కొరత తతో రోగులు ఇబ్బందులు పడకుండా ఉండడానికి ఇద్ద రు నూతన డాక్టర్ నియమించడం జరిగిందని జిల్లా మెడికల్ సూపర్డెంట్ డాక్టర్ శ్రీధర్ తెలిపారు. రోగుల సౌకర్యార్థం 5లక్షల రూపాయలతో సామాజిక ఆసుపత్రి నందు వెయిటింగ్ హాల్ నిర్మాణం చేయడం జరిగిందని మత శిశు ఆసుపత్రిలో గర్భిణీ స్త్రీల కోసం కొత్తగా 12లక్షలతో అల్ట్రా సౌండ్ స్కానింగ్, పుట్టిన పసిపాపల కోసం 1.12 లక్షలతో వార్మర్, ఫోటోతెరపి మరియు సామాజిక,మత శిశు ఆసుపత్రి నందు రోగుల సౌకర్యం 1.80 లక్షలతో ప్లాంట్ల ఏర్పాటు చేసి త్వరలో మంత్రి శ్రీధర్‌బాబు గారి చేతుల మీదుగా ప్రారంభించడం జరుగుతుందని డాక్టర్ శ్రీధర్ తెలిపారు. రోగులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ముందస్తుగా మందులను అందుబాటులో ఉంచడం జరుగుతుందని, ప్రభుత్వ ఆసుపత్రి పై నమ్మకంతో వస్తున్న రోగులకు మెరుగైన వైద్యాన్ని అందించడమే ప్రథమ లక్ష్యమని జిల్లా మెడికల్ సూపర్డెంట్ డాక్టర్ శ్రీధర్ తెలిపారు.

## అవయవ దానం ఒక ప్రాణదానం

**కరీంనగర్ జిల్లా బ్యూరో, ఆగస్టు 13 (జనంసాక్షి) :** మెదడు మరణం (బ్రెయిన్ డెత్) అర్థం చేసుకోవడం, మెదడు మరణం నిర్ధారణకు శరీర క్రియావిధానం, పరీక్షలు, అవయవాలను సేకరించే విధానం (ఆర్గాన్ రేటరీవల్) ఎవరు అవయవ దాత (ఆర్గాన్‌డోనార్) కావచ్చు అవయవ దానం ద్వారా ఎన్నో ప్రాణాలను రక్షించవచ్చని వైద్యులు తెలిపారు. అపోలో రీచ్ హాస్పిటల్, కరీంనగర్ ఆధ్వర్యంలో అవయవ దానంపై అవగాహన కార్యక్రమం నిర్వహించగా.. వైద్యులు పలు విషయాలు వెల్లడించారు. మన దేశంలో ప్రతి సంవత్సరం వేలాది మంది అవయవాల కొరత కారణంగా ప్రాణాలు కోల్పోతున్నారని ఒక దాత ఒక్కసారి చేసిన అవయవ దానం ద్వారా 8 మందికి ప్రాణం పోసి, 50 మందికి పైగా వారి జీవన ప్రమాణాలను మెరుగుపరచవచ్చని తెలిపారు. మరణానంతరం కంటి, గుండె, మూత్రపిండాలు, కాలేయం, ఊపిరితిత్తులు వంటి అవయవాలను అవసరమున్న రోగులకు దానం చేయవచ్చు అని, అవయవ దానానికి ముందుగా మీ కుటుంబ సభ్యులకు తెలియజేయడం, అవయవ దానం ఫారమ్ నింపడం, దాత కార్డు పొందడం అత్యంత ముఖ్యం అన్నారు. మరణానంతరం మన శరీరం మట్టి అవుతుంది కానీ అవయవ దానం చేస్తే మరొకరికి జీవం అవుతుందని ఈ సందర్భంగా పరిపాలనాధికారి డాక్టర్ నాగ సతీష్ కుమార్ పేర్కొన్నారు. సమాజంలోని ప్రతి ఒక్కరూ ముందుకు వచ్చి




అవయవ దానం చేయాలని, ఈ మహోన్నత కార్యంలో భాగస్వాములు కావాలని వారు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో అపోలో హాస్పిటల్స్ వైద్యులు డాక్టర్ శరత్ పుట్ట సీనియర్ కన్సల్టెంట్ గ్యాస్ట్రోఎంటరాలజిస్ట్, డాక్టర్ రవిచంద్ సిద్ధాచారి సీనియర్ కన్సల్టెంట్ లివర్ ట్రాన్స్ ప్లాంట్ సర్జన్, డాక్టర్ వేముల పరమేశ్వర్ కన్సల్టెంట్ గ్యాస్ట్రోఎంటరాలజిస్ట్, డాక్టర్ యజ్ఞమునేష్ కన్సల్టెంట్ న్యూరో క్రిటికల్ యూనిట్,డాక్టర్ సునీల్ కన్సల్టెంట్ క్రిటికల్ కేర్, ఇతర అపోలోరీచ్ వైద్య బృందం పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయడం జరిగింది. ఈ కార్యక్రమానికి విచ్చేసిన వైద్య బృందానికి, ప్రింట్ , ఎలక్ట్రానిక్ మీడియా మిత్రులకు అపోలో రీచ్ హాస్పిటల్ పరిపాలన అధికారి డాక్టర్ నాగ సతీష్ కుమార్, అపోలో హాస్పిటల్స్ వైస్ ప్రెసిడెంట్, మార్కెటింగ్ గడ్డం ప్రశాంత్ రెడ్డి ధన్యవాదాలు తెలిపారు.

## మెడికవర్ హాస్పిటల్‌లో
## రూ.1,947 కే హెల్త్ చెక్ అప్



**హైదరాబాద్ ఆగష్టు 14 (జనంసాక్షి):** స్వాతంత్ర దినోత్సవ కానుకగా సికింద్రాబాద్ లోని మెడికవర్ హాస్పిటల్ లో రూ. 1,947కే హెల్త్ చెక్ అప్ చేసే కార్యక్రమం బ్రోచర్ ను రాష్ట్ర ప్రణాళికా సంఘం వైస్ చైర్మన్ జీ. చిన్నారెడ్డి గురువారం ఆవిష్కరించారు. ఈ అవకాశం ఈ నెల 31వ తేదీ వరకు కల్పించనున్నట్లు మెడికవర్ యాజమాన్యం ప్రతినిధి డాక్టర్ ప్రశాంత్ రెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆసుపత్రి యూనిట్ హెడ్ కృష్ణ వేణి, డాక్టర్ సతీష్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

## పారమితలో ఘనంగా కృష్ణాష్టమి వేడుకలు




**కరీంనగర్ జిల్లా బ్యూరో, ఆగస్టు 14 (జనంసాక్షి) :** స్థానిక నగరంలోని పారమిత విద్యాసంస్థలల్లో శ్రీ కృష్ణుడి జన్మదినాన్ని పురస్కరించుకుని ఘనంగా శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు ఘనంగా జరిపారు. ఈ సందర్భంగా చిట్టిపొట్టి చిన్నారులు శ్రీకృష్ణ, గోపికల వేషధారణలో రాగా పాఠశాల ప్రాంగణ మంతా పండగ వాతావరణం నెలకొంది. ఈ అందమైన చిన్నారులు వాసుదేవుని పాటలకు అనుగుణంగా నృత్యాలు చేసి వేడుకలకు సాంప్రదాయ హంగులు అద్దారు. జన్మాష్టమి సందర్భంగా జరిగిన ఉట్టి పోటీల్లో చిన్నారి కృష్ణులు పెద్ద సంఖ్యలో పాల్గొని ఉట్టి కొడుతుంటే మిగతా విద్యార్థులు, ఉపాధ్యాయులు ఆసక్తిగా తిలకించారు. ఈ సందర్భంగా పారమిత పాఠశాలల చైర్మన్ డాక్టర్ ఇ. ప్రసాద్ రావు మాట్లాడుతూ... ఈ జన్మాష్టమి నుండి మీ ఒత్తిళ్లు, చింతలన్ని తొలగి మీకు ప్రేమ, శాంతి, ఆనందాన్ని ప్రసాదించాలని, గీతను అనుసరించి ఫలితాన్ని ఆశించకుండా ఏకాగ్రతతో ఇష్టపడి పని చేయాలని నేటి యువత దీనిని దైనందిన జీవితంలో అన్వయించుకొని ముందుకు సాగాలని శ్రీకృష్ణ జన్మాష్టమి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్స్ అనూకర్ రావు, ప్రసూన, రశ్మిత,రాకేశ్, వి.యు.ఎం.ప్రసాద్, టి.యస్.వి. రమణ, వినోద్ రావు, హన్మంతరావు, ప్రధానోపాధ్యాయులు ప్రశాంత్, బాలాజీ, కవితా ప్రసాద్, గోపీకృష్ణ,ఎం. శ్రీకర్, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

## పేదల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

• ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి

**మహబూబ్ నగర్ బ్యూరో, ఆగస్టు 14 (జనంసాక్షి):** పేదల సంక్షేమమే ప్రజాపాలన ప్రభుత్వ లక్ష్యమని మహబూబ్ నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి అన్నారు. గురువారం మహబూబ్ నగర్ రూరల్ మండలం లోని మాచన్ పల్లి గ్రామంలోని ఎ‌ఎంఆర్ గార్డెన్ హాల్ లో కొత్త రేషన్ కార్డులు పంపిణీ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై 445 మంది లబ్ధిదారులకు రేషన్ కార్డులు పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ గత బిఆర్‌ఎస్ ప్రభుత్వంలో ఒక్క రేషన్ కార్డు ఇవ్వలేదని, గత పది సంవత్సరాలుగా కొత్త రేషన్ కార్డుల కోసం పేద ప్రజలు ఎదురు చూస్తున్నారని ఆయన చెప్పారు. ఈరోజు పేద ప్రజల ఆకాంక్ష నెరవేరిందన్నారు. ఎన్నికల సందర్భంగా ప్రజలు తమకు రేషన్ కార్డులు లేవని , ఇండ్లు లేవని అడిగారని ఆరోజు మాట ఇచ్చామని, ఇచ్చిన మాట ప్రకారం ఇల్లు లేని నిరుపేదలకు మహబూబ్ నగర్ మండలంలో 776 ఇందిరమ్మ ఇండ్లను మంజూరు చేయ డం జరిగిందని, ఇప్పటికే 442 ఇందిరమ్మ ఇండ్లు నిర్మాణం ప్రారంభం కావడం జరిగిందని, 3 కోట్ల రూపాయలు కూడా ఇందిరమ్మ ఇండ్లు లబ్దిదారుల ఖాతాలో జమ చేయడం జరిగిందని ఆయన తెలిపారు. అర్హులైన ప్రతి ఒక్కరికి రేషన్ కార్డులు పంపిణీ చేస్తున్నా మని ఆయన తెలిపారు.దేశంలోనే రేషన్ షాపుల్లో పేదలకు సన్న బియ్యం పంపిణీ చేస్తున్న ఏకైక రాష్ట్రం తెలంగాణ రాష్ట్రం ఒక్కటే అని ఆయన స్పష్టం చేశారు. ఆర్థికంగా పేద ప్రజలను బలోపేతం చేయ దానికి ప్రజా ప్రభుత్వం అనేక కార్యక్రమాలను చేపడుతు న్నట్లు ఆయన తెలిపారు. ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం కల్పించడం జరిగిందని, గృహజ్యోతి పథకం ద్వారా 200 యూనిట్లు ఉచిత విద్యుత్ అందిస్తున్నామని ఆయన తెలిపారు. 16 నెలల కంటే ముందు ఒక్క ఇంజనీరింగ్ కళాశాల కూడా మన మహబూబ్ నగర్‌లో లేదని , ఇప్పుడు మూడు కొత్త ఇంజ నీరింగ్ కళాశాలలు మన మహబూబ్ నగర్ నియోజ కవర్గానికి



వచ్చాయని ఆయన చెప్పారు. ఎమ్మెల్యే తన సొంత నిధులతో వంద మంది పేద విద్యార్థులకు ఉచితం గా ఇంజనీరింగ్ విద్యను అందించేందుకు కృషి చేస్తున్న ట్లు తెలిపారు. ఇంజనీరింగ్ విద్యను చదవాలనే కోరిక ఉండి చదువుకోవడానికి స్థోమత లేని నిరుపేద కుటుంబానికి చెందిన పిల్లలకు ఈ అవకాశం ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మల్లు నర్సింహ్మారెడ్డి, డిసిసి ప్రధాన కార్యదర్శి సిరాజ్ ఖాద్రీ, తహసీల్దార్ శ్రీనివాస్, ఎంపిడిఓ కరుణశ్రీ పాల్గొన్నారు.

## ప్రభుత్వ భూములు స్వచ్ఛందంగా అప్పగించాలి

• కలెక్టర్ సందీప్ కుమార్ ఝా, ఎస్పీ మహేష్ బీగితే సమక్షంలో 4 ఎకరాల 2 గుంటల ప్రభుత్వ భూమి అప్పగింత

**రాజన్న సిరిసిల్ల బ్యూరో, ఆగష్టు -14 (జనంసాక్షి):** జిల్లాలో ప్రభుత్వ భూములు ఆక్రమించిన వారు స్వచ్ఛందంగా అప్పగిం చాలని కలెక్టర్ సందీప్ కుమార్ ఝా పిలుపు నిచ్చారు. గురు వారం సమీకృత జిల్లా కలెక్టరేట్ మినీ సమావేశ మందిరం లో ప్రభుత్వ భూమి ని ఓజ్జల లావణ్య ఓజ్జల రాములు జిల్లా ఎస్పీ మహేష్ బీ గితే సమక్షంలో సరేండర్ చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా మాట్లాడుతూ సిరిసిల్ల మం ఓజ్జల రాములు సర్వే నెంబర్ 61/47లో గల 4 ఎకరాల 2 గుంటల ప్రభుత్వ భూ మి కబ్జా చేసుకుని సాగు చేసుకుంటున్నాడని ప్రభుత్వానికి తిరిగి అప్పగించడానికి నిర్ణయించారని కలెక్టర్ వివరించారు. జిల్లాలో ఎవరైనా భూ ఆక్రమణలకు పాల్పడి ఉంటే సదురు భూమిని ప్రభుత్వానికి స్వచ్ఛందంగా అప్పగించాలని, ఈ భూముల ను పేద ప్రజల సంక్షేమం కోసం వినియోగిస్తామని, పేద ప్రజలకు ఇంటి పట్టాల పంపిణీ, ఇందిరమ్మ ఇండ్లు నిర్మించేందుకు వినియో గిస్తా మని కలెక్టర్ తెలిపారు.



## వ్యవసాయ రంగానికి పోల్స్‌పైనే అత్యధిక ఫిర్యాదులు

**నారాయణపేట జిల్లా బ్యూరో (జనంసాక్షి):** నారాయణపేట పట్టణంలో ఉపవిద్యుత్ కేంద్రంలో ఏర్పాటు చేసిన విద్యుత్తు వినియోగదారుల పోరంలో అత్యధికంగా వ్యవసాయ రంగానికి విద్యుత్ పోల్స్ కావాలని ప్రతి మండలం నుండి రైతులు తమ ఫిర్యాదులను అధికారులకు అందజేశారు గురువారం ఉప విద్యుత్ కేంద్రంలో ఏర్పాటు చేసిన విద్యుత్ వినియోగ దారుల సమస్యల పరిష్కార వేదికలో 161 ఫిర్యాదులు వచ్చాయి. ఈ సదస్సుకు సూపరింటెండెంట్ ఇంజనీర్ (ఎస్.ఈ.)టి. వెంకటర మణ, సీజీఆర్ఎఫ్ (కన్స్యూమర్ గ్రీవెన్స్ రెడ్రెసెల్ ఫోరం -1 సి.జీ.ఎం. మరియు మెంబర్ ఫైనాన్స్ శ్రీ.రామాంజ నాయక్, ఇండిపెండెంట్ మెంబర్ ఎన్.కె.కె.శ్రీ.వెంకట హైదరాబాద్ వారి నేతృత్వంలో కొనసాగింది. ఇదురు గాలులు వచ్చి నప్పు



డు విద్యుత్ సరఫరాలో తరచూ ఏర్పడే అంతరాయాల తోపాటు సరఫరాలో ఏర్పడే హేచ్చు తగ్గుల తోపాటు పలు సమస్యలపై వినియోగదారుల పరిష్కార వేదికలో ఫిర్యాదు చేశారు. యాజమాన్యం పేరు బదిలి సర్వీసులో మార్పు , విద్యుత్ సరఫరా పునరుద్ధరణలో జాప్యం తదితర అంశాల పై అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. ఈ కార్యక్రమంలో స్థానిక డిఈఈ బి. ఎల్ . నర్సింహ రావు, సిబ్బంది పాల్గొన్నారు.

## బీఆర్ఎస్ హయాంలోనే శాంతి భద్రతలకు విఘాతం

• పది ఏళ్లలో వేల ఎకరాల భూములు కబ్జా
• భరించలేకనే ప్రజలు పక్కన పెట్టారు
• ప్రజాపాలనపై తాత మధుకి కడుపుబ్బు
• ముగ్గురు మంత్రులు నిరంతర శ్రామికులు
• జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు పువ్వాళ్ళ దుర్గాప్రసాద్ ఫైర్

**ఖమ్మం (జనంసాక్షి):** బీఆర్ఎస్ హయాంలోనే శాంతి భద్రతలకు విఘాతం కల్పించారని, నేడు రాష్ట్రంలో, జిల్లాల్లో ప్రజలు సుఖంగా వారి పనులు వారు చేసుకుంటున్నారని జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు పువ్వాళ్ళ దుర్గాప్రసాద్ అన్నారు. గురువారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. జిల్లాలో శాంతి భద్రతలు క్షీణిస్తున్నాయని ఎమ్మెల్సీ తాత మధు అనడం దెయ్యాలు వేదాలు వల్లించినట్టు ఉందని ఎద్దేవా చేశారు. 10 సంవత్సరాల బీఆర్ఎస్ ప్రభుత్వంలో వేల ఎకరాల భూమి, గుట్టలు కబ్జాకు గురైందని ఎంతోమంది అమాయకులు నరకయాతన అనుభవించారాని విమర్శించారు. మీ హయాంలోనే తయారైన ఇంకొంతమంది దొంగలు మిగిలారని వారికి కొద్ది రోజుల్లోనే చర్యలు తప్పవని హెచ్చరించారు. పోలీసింగ్ వ్యవస్థ గురించి మాట్లాడే అర్హత తాత మధు కు లేదని గతంలో పోలీస్ వ్యవస్థను పార్టీ కార్యకర్తల్లా వాడుకున్న ఘటనలు కోకొల్లలు అని ఆరోపించారు. పోలీసు అధికారులను మీ గడీలకు కాపలా పెట్టుకొని శాంతి భద్రతలకు విఘాతం కలిగించే పోలీసు వ్యవస్థను ఉపయోగించుకొని మీరు చేసిన అఘాయిత్యాలు ప్రజలకు తెలుసనని ఈనాడు రాష్ట్రంలో మంత్రులు ప్రతి ఒక్కరు కష్టపడి రాష్ట్ర అభివృద్ధి కోసం సంక్షేమ పథకాలు పేద ప్రజలకు అందించడానికి నిరంతర శ్రామికుల్లా పరితపిస్తున్నారని అన్నారు. అది చూసి ఓర్వలేక కారు కూతలు కూస్తున్న మీకు ప్రజలు మళ్ళీ ఇదే గతి పట్టించడం ఖాయమని అన్నారు. సుభిక్షంగా ఉన్న రాష్ట్రంలో శాంతి భద్రతల విషయంలో జిల్లా క్షేమంగా ఉందని నోరు ఉంది కదా అని అడ్డగోలుగా మాట్లాడితే సహించబోమని హెచ్చరించారు. మీ హయాంలో గల్లి గల్లికి గంజాయి పొట్లాలు అమ్మి యువతని మత్తులో మమేకం చేసి మీరు పరిపాలన కొనసాగించారని అన్నారు. అలాంటి వారిని ఏరి పారేసే పనిలో ప్రభుత్వం ఉందని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక అధికారులతో సమన్వయం పాటిస్తూ ప్రజా పాలన ప్రజలకు అందించాలని మంత్రి మండలి శ్రమిస్తుంటే దానిపై కడుపుబ్బు ఎందుకు అని ప్రశ్నించారు.



సెలవు దినాల్లో కూడా ప్రజల్లో ఉంటూ ప్రజా సమస్యలను తెలుసుకుంటూ వారికి మేము ఉన్నామంటూ భరోసా కల్పిస్తూ ముందుకు పోతున్న మంత్రులపై విమర్శలు చేయడం ఏంటని ప్రశ్నించారు. తస్మాత్ జాగ్రత్త మీలాగా గడీల పాలన కాదు ప్రజల గడప దగ్గరకు పోయి ప్రజాపాలన అందించే సువర్ణమైన అవకాశం మాకు ప్రజలు కల్పించారు. కాబట్టే ఈరోజు ప్రజాపాలనను ప్రజలకు అందిస్తున్నాం.. తాత మధుగా ఇకనైనా మీరు ఇలాంటి కారు కోతలు మానేసి నిజ నిజాలు తెలుసుకోవాలని లేని ఎడల కచ్చితంగా మీకు సరైన గుణపాఠం చెప్పడానికి మరల కూడా మా కార్యకర్తలు నాయకులు ప్రజలు సిద్ధంగా ఉన్నారని హెచ్చరించారు.

## కార్మికుల ఆధ్వర్యంలో వెయ్యి అడుగుల జాతీయ జెండా

• ఖమ్మం నగరం పురవీధుల్లో ర్యాలీ
• ర్యాలీని ప్రారంభించిన వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

**ఖమ్మం (జనంసాక్షి) :** ఖమ్మం నగరం బైపాస్ రోడ్డు తారకరామా ఆటోనగర్ ఫోర్ వీలర్స్ టెక్నీషియన్ అసోసియేషన్ ఆధ్వర్యంలో పంద్రాగస్టు పురస్కరించుకొని ఈ అడుగుల జాతీయ జెండాను కార్మికులు తన భుజాల మీద ఖమ్మం నగర పురవీధుల్లో ర్యాలీ నిర్వహించారు. ప్రతినిత్యం పని ఒత్తిళ్లలో ఉన్న కార్మికులు జాతీయత భావంతో సుమారు 500 మంది జెండాకు ఇరువైపులా పట్టుకొని నగర పురవీధులు ర్యాలీ నిర్వహించారు. బైపాస్ రోడ్డు కాలవద్దు మయూరి సెంటర్ మీదుగా జడ్పీ సెంటర్ ఐటీ



హబ్ సర్కిల్ మీదుగా ఇందిరా నగర్ వరకు సాగింది. అందరూ భారత్ కి జై అంటూ ఖమ్మం పురవీధులు మారుమ్రోగాయి. ఈ కార్యక్రమంలో తారకరామా ఆటోనగర్ అధ్యక్షులు మహంకాళి మల్లికార్జున్, రవి, జానీ పాషా, కిషోర్, శ్రీనివాసరావు, చామేందర్ రెడ్డి, స్థానిక కార్మిక నాయకులు పెద్దఎత్తున పాల్గొన్నారు.

## అట్రాసిటీ కేసులో ఒకరి అరెస్ట్

**నిజామాబాద్ జిల్లా బ్యూరో ఆగస్టు 14 (జనంసాక్షి) :** కామారెడ్డి జిల్లా బీర్కూర్ మండల కేంద్రానికి చెందిన నర్రా సాయిలు అనే వ్యక్తిని ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులో బుధవారం రాత్రి అరెస్ట్ చేసి, గురువారం డిమాండ్‌కు తరలించినట్లు బాన్సువాడ డీఎస్పీ విఠల్ రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ జులై 24 వ తేదీన బీర్కూర్ మండల కేంద్రంలో జరిగిన గొడవలో బీర్కూర్ మండల కేంద్రానికి చెందిన నల్లజెరు జ్యోతిని ఆమె భర్త నర్రా సాయిలు అదేవిదంగా అయనతో పాటు మరో ముగ్గురు వ్యక్తులు కులం పేరుతో దూశించిన ఒదున నలుగురిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు కాగా నర్రా సాయిలు పరార్ అయ్యా డని, దీంతో అయినను బుధవారం రాత్రి బీర్కూర్ పోలీసులు చాకచక్యంగా పట్టుకొని అరెస్ట్ చేసినట్లు అయన తెలిపారు. అదేవి దంగా నర్రా సాయిలును గురువారం రిమాండ్ చేసినట్లు అయన తెలియజేశారు. ఈ కార్యక్రమంలో బాన్సువాడ రూరల్ సీఐ తిరుపతయ్య, బీర్కూర్ ఎస్ఐ రాజశేఖర్, సిబ్బంది పాల్గొన్నారు.

## మద్యం మత్తులో పరస్పర దాడులు

• ఏడుగురు అరెస్టు
• టౌన్ ఏసీపీ రమణమూర్తి

**ఖమ్మం (జనంసాక్షి) :** మద్యం మత్తులో ఇరువర్గాలు రెచ్చిపోయి పరస్పర దాడులకు తెగబడిన ఘటనలో 11 మందిపై కేసులు నమోదు చేసి ఏడుగురిని అరెస్టు చేసి రిమాండ్ కు తరలించినట్లు టౌన్ ఏసీపీ రమణమూర్తి తెలిపారు. బుధవారం రాత్రి ఖమ్మం అర్బన్ పోలీస్ స్టేషన్ పరిధిలోని గోపాలపురంలో మద్యం తాగిన మత్తులో రాకేష్ అనే వ్యక్తి రోడ్డుపై అడ్డంగా పడుకోవడంతో రాకేష్ భార్య దుర్గ భవానితో సమీపంలో దుకాణం నడుపుతున్న కవిత, వేణుగోపాల్ వరించడంతో మొదలైన గొడవ, పాత కక్షలు కూడా తోడు కావడం, కొంతమంది ఆకతాయిలు జత కావడంతో పరస్పరం దాడులు చేసుకున్నారు. ఈ నేపథ్యంలో ఆకతాయిల బ్యాచ్ పెట్రోల్ తెచ్చి షాపు ఎదుట వున్న వస్తువులపై పెట్రోల్ పోసి నిప్పు అంటించగా పక్కన పార్క్ చేసిన స్కూటీ పాక్షికంగా తగలబడిందని తెలిపారు. దాడుల పాల్పడిన నేపథ్యంలో పరస్పరం ఖమ్మం అర్బన్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసుకో వడంతో ఇరువురిపై కేసులు నమోదు చేసి విచారణ అనంతరం ఏడుగురిని అరెస్టు చేసి రిమాండ్ తరలించామని అన్నారు. మరో ఇద్దరు హాస్పటల్ లో చికిత్స పొందుతూన్నారని, ఇద్దరు పరారీ వున్నారని పేర్కొన్నారు. మాదక ద్రవ్యాలు ఏమైనా స్వికరించరా? లేదా తెలుసుకునేందుకు గంజాయి కిట్ ద్వారా అందరికి మూత్ర పరీక్షలు నిర్వహించి,గంజాయి. మాదక ద్రవ్యాలు తీసుకో



లేదని నిర్ధారించారు. గంజాయి తీసుకునే వ్యక్తులకు 15 రోజుల వరకు మూత్ర పరీక్షలలో తెలుసుకునే అవకాశం వుంటుందని ఈ సందర్భంగా తెలిపారు. రుదావత్ దుర్గా భవానీ ఫిర్యాదుతో ఏ1 గోపాల్, ఏ2 వేణు, ఏ3 వినోద్, ఏ4 లక్ష్మి, ఏ5 కవిత.. బానోత్ వేణు ఫిర్యాదుతో ఏ1 రాకేష్, ఏ2 శ్రీనాథ్, ఏ3 మహేష్, ఏ4 ఉమేష్, ఏ5 వరుణ్ తేజ, ఏ6 కార్తీక్ లపై కేసులు నమోదు చేశారు. ఎలాంటి ఆధారాలు, నిర్ధారణ లేకుండా గంజాయి మత్తులో దాడులు చేశారని, సంభంధిత పోలీస్ అధికారుల వివరణ లేకుండా పత్రికల్లో ప్రచురించి ప్రజలను తప్పుదోవ పట్టించవద్దని సూచించారు.

## అల్ఫోర్స్‌ల్లో ముందస్తు శ్రీకృష్ణాష్టమి ఉత్సవాలు

**కరీంనగర్ జిల్లా బ్యూరో, ఆగస్టు 14 (జనంసాక్షి) :** శ్రీకృష్ణుని లీలలు చాలా మహిమాన్వితమైనవని ఆనందాన్ని కలిగిస్తాయని అల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత డాక్టర్ వి.నరేందర్ రెడ్డి కరీంనగర్‌లోని కొత్తపల్లిలో ని అల్ఫోర్స్ ఇ-టెక్నో పాఠశాల, వావిలాలపల్లిలో అల్ఫోర్స్ టైనీ టాట్స్ , అల్ఫోర్స్ స్కూల్ ఆఫ్ జెన్ నెక్స్ట్, కిసాన్ నగర్‌లో అల్ఫోర్స్ హై స్కూల్, భగత్ నగర్ లో అల్ఫోర్స్ ఇ-టెక్నో స్కూల్ , మంకమ్మతోటలో గల అల్ఫోర్స్ ప్లానెట్ కిడ్స్‌లో వేడుకగా నిర్వహించినటువంటి ముందస్తు శ్రీ కృష్ణాష్టమి వేడుకలకు ముఖ్య అతిథిగా హాజరై వారు మాట్లాడారు. ప్రారంభానికి ముందు వారు ప్రాంగణంలో అందంగా అలంకరించినటువంటి శ్రీకృష్ణుని విగ్రహానికి పూజ కార్యక్రమాన్ని నిర్వహించి వివిధ పూలమాలలను సమర్పించి కార్యక్రమాన్ని అట్టహాసంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... మనదేశంలోనే కాకుండా ప్రపంచంలో ఈ పండుగను వేడుకగా జరుపుకుంటారని చెప్పారు. శ్రీకృష్ణుని చరిత్ర చాలా విశిష్టమైనదని, ధర్మము గురించి తెలిపినటువంటి విషయాలు ఆలోచింప చేస్తాయని వారు చెప్పారు. శ్రీకృష్ణాష్టమిని గోకులాష్టమి జన్మాష్టమని కూడా పిలుస్తారని, శ్రావణ మాసం కృష్ణ పక్షంలోని 8వ రోజున వేడుకలను చాలా వైభవంగా నిర్వహించు కోవడం జరుగుతుందని చెప్పారు. కృష్ణాష్టమి పరిష్కరించుకుని పలు ఆలయాల్లో శ్రీకృష్ణుని విగ్రహాలకు వివిధ రకాల ద్రవ్యాలతో అభిషేక కార్యక్రమాన్ని చాలా వైభవపేతంగా నిర్వహిస్తారని, స్వామివారిని ఉయ్యాలలో వేసి ఊపుతానని ఈ ఘట్టం అపూర్వమైనదని అనందాన్ని ఇస్తుందని వారు చెప్పారు. చిన్నారులందరు శ్రీకృష్ణ వేషధారణలో సమూహంగా ఏర్పడి ఉట్టి వేడుకలలో పాల్గొంటారని ముఖ్యంగా శ్రీ కృష్ణ జన్మస్థలమైన మధురలో వారం రోజులపాటు సందడిగా ఈ కార్యక్రమాలను వేడుకగా నిర్వహించడమే కాకుండా పలు భజనలు కీర్తనలను, శ్రీకృష్ణ వైభవాన్ని తెలిపినటువంటి చరిత్రను చదువుతారని వారు పూర్తి చేశారని, స్త్రీలు దాండియా ఆడుతూ పురుషులందరూ వివిధ రకాల వృత్యాలతో స్వామివారిని పూజిస్తారని వారు చెప్పారు. కార్యక్రమంలో భాగంగా 25 మంది విద్యార్థులు రాధా గోపిక వేషధారణలో విచ్చేశారు, పండుగ వాతావరణాన్ని అని రెట్టింపు చేశారు. వేడుకలలో భాగంగా విద్యార్థులు ప్రదర్శించినటువంటి సాంస్కృతిక కార్యక్రమాలు ముఖ్యంగా గోవర్ధన గొప్పతనం నాటిక చాలా ఆలోచింపజేసింది. ప్రాంగణమంతా జై శ్రీ కృష్ణ ....జై శ్రీ కృష్ణ నామంతో మారు మ్రోగింది.ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు తల్లిదండ్రులు, విద్యార్థులు పాల్గొన్నారు.



# అప్పుడు పిచ్చోడిలా చూశారు!

**లక్నో జట్టు ఓనర్ సంజీవ్ గోయెంకా**



**కోల్‌కతా (జనంసాక్షి) :** ఐపీఎల్ 2022 సీజన్‌కు ముందు లక్నో సూపర్ జెయింట్స్‌ను రూ. 7090 కోట్లకు కొనుగోలు చేసినందుకు అందరూ తనను పిచ్చోడిలా చూశారని ఆ జట్టు ఓనర్ సంజీవ్ గోయెంకా అన్నారు. కానీ ప్రస్తుతం ఆ జట్టు విలువ రూ. 13,147 కోట్లకు చేరిందని చెప్పారు. ది హండ్రెడ్ లీగ్‌లో కూడా తాను కొనుగోలు చేసిన ఫ్రాంచైజీ విలువ ఇలానే పెరుగుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఐపీఎల్ 2022 సీజన్‌కు ముందు బీసీసీఐ కొత్త రెండు జట్ల కోసం టెండర్లు ఆహ్వానించగా.. సంజీవ్ గోయెంకా రూ. 7090 కోట్లకు బిడ్ వేసి లక్నో టీమ్‌ను దక్కించుకున్నాడు. మరోవైపు గుజరాత్ టైటాన్స్‌ను సీవీసి క్యాపిటల్స్ అనే సంస్థ రూ. 5,625 కోట్లకే కొనుగోలు చేసింది. లక్నో అదనంగా రూ. 1500 కోట్లు ఖర్చు చేయడంపై అప్పట్లో చాలా మంది విమర్శలు గుప్పించారు. ఆ తర్వాత నాలుగు సీజన్లు ఆడిన లక్నో.. రెండు సార్లు ప్లేఆఫ్స్ చేరింది. అనంతరం సంజీవ్ గోయెంకా తన ఫ్రాంచైజీ సామ్రాజ్యాన్ని విస్తరించారు. సౌతాఫ్రికా 20 లీగ్‌లో డర్బన్ సూపర్ జెయింట్స్, హండ్రెడ్ లీగ్ మాంచెస్టర్ ఒరిజనల్స్ జట్టును కొనుగోలు చేశారు. ఫుట్‌బాల్ లీగ్‌లోనూ సంజీవ్ గోయెంకా పెట్టుబడి పెట్టారు. అయితే తాజాగా ఓ ఇంటర్వ్యూలో గోయెంకా చేసిన వ్యాఖ్యలు చర్చనీయాంశమయ్యాయి.' ఐపీఎల్‌లో లక్నో జట్టును రూ. 7090 కోట్లకు కొనుగోలు చేసినప్పుడు ఈ ప్రపంచం నన్ను పిచ్చోడిలా చూసింది. కానీ మూడేళ్లలో ఆ జట్టు విలువ రూ. 13,147 కోట్లకు పెరిగింది. ఐపీఎల్ వంటి టోర్నీ ప్రపంచంలో మరెక్కడా లేదు. హండ్రెడ్ లీగ్ కూడా ఇదే విధంగా ఆదరణ పొందుతుంది. ఆ నమ్మకం నాకుంది. ఇది కేవలం క్రీడతోనే కాకుండా, ఫార్మాట్‌తో పాటు ముఖ్యంగా జట్టుతో ఒక మానసిక బంధాన్ని ఏర్పరుచుకోవడం. అయితే ఇది రాత్రికి రాత్రి జరగదు. ఐపీఎల్ ఈ స్థాయికి చేరుకోవడానికి 18 ఏళ్లు పట్టింది.'అని సంజీవ్ గోయెంకా చెప్పుకొచ్చాడు.

# వన్డేలకు రోహిత్ గుడ్‌బై?



**న్యూఢిల్లీ (జనంసాక్షి) :** ఇదివరకే టెస్టులు, టీ20ల నుంచి రిటైరైన రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీ కూడా వన్డేల నుండి రిటైర్మెంట్ తీసుకోబోతున్నారా? తాజా నివేదికలో విషయాలు అభిమానుల్లో ప్రశ్నల్ని రేకెత్తించాయి. ఇద్దరు దిగ్గజ ఆటగాళ్లు మూడు ఫార్మాట్లలో భారత జట్టుకు కెప్టెన్లుగా వ్యవహరించారు, ఇప్పుడు వారు కేవలం వన్డే ఫార్మాట్‌లో మాత్రమే కొనసాగుతున్నారు. టీ20, టెస్టుల తర్వాత ఇక వన్డే జట్టు పగ్గాలు కూడా యువ ఆటగాళ్ల చేతుల్లోకి వెళ్తాయని రిపోర్ట్ చెబుతోంది. రోహిత్-కోహ్లీ 2027 వన్డే ప్రపంచ కప్ తరువాత రిటైర్మెంట్ ప్రకటిస్తారని ఇప్పటివరకూ అంతా భావించారు. టీ20 ప్రపంచ కప్ 2024 గెలిచిన తర్వాత రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీ ఈ ఫార్మాట్‌కు వీడ్కోలు పలికారు. ఇంగ్లాండ్ పర్యటనకు ముందు, రోహిత్- విరాట్ కోహ్లీ ఒక వారం వ్యవధిలోనే సుదీర్ఘ ఫార్మాట్ టెస్టులకు వీడ్కోలు పలికారు. దాంతో యువ జట్టు శుభ్‌మాన్ గిల్ సారథ్యంలో ఇంగ్లాండ్ పర్యటనకు వెళ్లి సత్తా చాటింది. అంతగా అనుభవం లేని ఆటగాళ్లు జట్టులో ఉన్నా సిరీస్ ను 2-2తో డ్రా చేసుకుంది. భారత తదుపరి టోర్నమెంట్ ఆసియా కప్, కాగా సెప్టెంబర్‌లో టీ20 ఫార్మాట్‌లో ఇది నిర్వహిసస్తారు. టీమిండియా తదుపరి వన్డేలు ఆస్ట్రేలియాతో ఉన్నాయి. ఇది అక్టోబర్‌లో షెడ్యూల్ చేశారు. తాజా ఓ మీడియా నివేదిక ప్రకారం, ఈ సిరీస్ వీరిద్దరికీ చివరి వన్డే సిరీస్ అవుతుంది. .మీడియా నివేదికలో, %దీజజ×% వర్గాల సమాచారం ప్రకారం, ప్రస్తుత కెప్టెన్ రోహిత్ శర్మ, మాజీ కెప్టెన్ విరాట్ కోహ్లీ ఆస్ట్రేలియా పర్యటన తర్వాత కూడా జట్టులో కొనసాగాలనుకుంటే, వీరిద్దరూ విజయ్ హజారే ట్రోఫీలో ఆడాల్సి ఉంటుంది. డిసెంబర్ చివరిలో ఈ ట్రోఫీ ప్రారంభమవుతుంది. ఇద్దరూ ఈ సంవత్సరం ప్రారంభంలో రంజీ ట్రోఫీ మిగిలిన మ్యాచ్‌లలో ఆడారు. టెస్ట్‌లో పేలవమైన ప్రదర్శన తర్వాత, %దీజజ×% అంతర్జాతీయ మ్యాచ్‌లు ఆడని సమయంలో ఆటగాళ్లు దేశవాళీ టోర్నమెంట్‌లను మిస్ చేయకూడదని నిర్ణయించడంమే అందుకు కారణం. ఇందులో కూడా రోహిత్ శర్మ, కోహ్లీలు అంతగా రాణించలేదు. ఈ క్రమంలో ఇద్దరూ కీలకమైన ఇంగ్లాండ్ టెస్ట్ సిరీస్‌కు కొన్ని రోజుల ముందు వారం రోజుల వ్యవధిలో రిటైర్మెంట్ తీసుకున్నారు. ఆ నివేదికలో పేర్కొన్న సమాచారం ప్రకారం, ఈ ఇద్దరు దిగ్గజ ఆటగాళ్లు భారత క్రికెట్‌కు రెండు దశాబ్దాలుగా ఎంతో చేశారు. కానీ ఇప్పుడు యువ ఆటగాళ్లకు అవకాశం కల్పించడం, అదే సమయంలో వయసు మీద పడిన.. ప్రదర్శన బాగోలేని వారిని జట్టు నుంచి తప్పించడమై సరైన నిర్ణయమని సెలెక్టర్లు భావిస్తున్నారు. 2027 వన్డే ప్రపంచ కప్‌ను దృష్టిలో ఉంచుకుని జట్టును సిద్ధం చేయాలంటే ఇలాంటి నిర్ణయాలు తప్పవని సన్నాహాలు చేస్తున్నారు. ఈ నివేదిక ప్రకారం, రోహిత్ శర్మ, కోహ్లీ రెండేళ్ల తరువాత జరగనున్న వన్డే ప్రపంచ కప్ జట్టు కూర్పులో సెట్ అవ్వరు. అంటే వారు ఆస్ట్రేలియాతో సిరీస్ తో పాటు దేశవాలీలో ఆడి రాణిస్తేనే వన్డే వరల్డ్ కప్ జట్టులో చోటు దక్కించుకుంటారు. లేనిపక్షంలో రిటైర్మెంట్ ప్రకటించాలని మేనేజ్ మెంట్ నుంచి వారికి సంకేతాలు వెళ్లినట్లు సమాచారం.

# ఆసియా కప్ 2025కు కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్!



**న్యూఢిల్లీ (జనంసాక్షి) :** ఆసియా కప్ 2025 ప్రారంభం కావడానికి ఒక నెల కంటే తక్కువ సమయం ఉంది. సెప్టెంబర్ 9 నుండి 28 వరకు యూఏఈలో జరగనున్న ఈ టోర్నమెంట్ కోసం బీసీసీఐ ఇంకా భారత జట్టును ప్రకటించలేదు. దీనికి ప్రధాన కారణం.. టీమ్ కెప్టెన్సీపై ఇంకా స్పష్టత లేకపోవడం. సూర్యకుమార్ యాదవ్ ఫిట్‌నెస్ సరిగ్గా లేకపోవడంతో, కెప్టెన్ ఎవరు అవుతారనే దానిపై అనేక ఊహాగానాలు వినిపిస్తున్నాయి. ఈ సస్పెన్స్‌కు ఇప్పుడు తెర పడింది. ఆసియా కప్ కోసం టీమ్ ఇండియా కెప్టెన్‌గా సూర్యకుమార్ యాదవ్ ఉండనున్నారని, శుభ్‌మన్ గిల్‌కు ఈ టోర్నమెంట్‌లో చోటు దక్కడం కష్టమేనని నివేదికలు చెబుతున్నాయి. భవిష్యత్తులో శుభ్‌మన్ గిల్ భారత జట్టుకు కెప్టెన్‌గా ఉంటాడనడంలో సందేహం లేదు, కానీ టీ20 కెప్టెన్సీ మాత్రం 2026 టీ20 ప్రపంచ కప్ తర్వాతే అతనికి దక్కే అవకాశం ఉంది. ప్రస్తుతం అందిన నివేదికల ప్రకారం, సూర్యకుమార్ యాదవ్ తన గాయం నుంచి పూర్తిగా కోలుకున్నారు. ఇప్పటికే అతను నేషనల్ క్రికెట్ అకాడమీలో బ్యాటింగ్ ప్రాక్టీస్ కూడా ప్రారంభించారు. త్వరలోనే అతని ఫిట్‌నెస్ గురించి అధికారిక ప్రకటన రానుంది. ఈ నేపథ్యంలో ఆసియా కప్‌లో టీమ్ ఇండియాకు కెప్టెన్‌గా సూర్యకుమార్ యాదవ్ ఉండనున్నారని దాదాపుగా ఖరారైంది. మీడియా నివేదికల ప్రకారం, ఆగస్టు 19 లేదా 20న బీసీసీఐ ఆసియా కప్ కోసం భారత జట్టును ప్రకటించనుంది. టీ20 ఫార్మాట్‌లో భారత్ గత ఏడాది కాలంగా ఒక నిర్దిష్ట జట్టుతో ఆడుతోంది. ఆ జట్టులోని ఆటగాళ్లు అద్భుతమైన ప్రదర్శన కనబరిచారు. కాబట్టి, ఆసియా కప్‌లో కూడా మేనేజ్‌మెంట్ అదే జట్టుపై నమ్మకం ఉంచే అవకాశం ఉంది. దీంతో శుభ్‌మన్ గిల్‌కు 15 మంది సభ్యుల జట్టులో చోటు దక్కడం కష్టమేనని తెలుస్తోంది. విరాట్ కోహ్లీ, రోహిత్ శర్మ వంటి సీనియర్ ఆటగాళ్లను టీ20 ఫార్మాట్‌కు దూరంగా ఉంచే అవకాశం ఉంది.

# ఛత్తీస్ ఘడ్‌లో మావోయిస్టుల డంప్ స్వాధీనం



**చర్ల (జనంసాక్షి) :** చత్తీస్‌ఘడ్‌లో బీజాపూర్ జిల్లాలో మావోయిస్టుల భారీ డంప్ ను గురువారం భద్రత బలగాలు స్వాధీనం చేసుకున్నాయి. తర్రెం పోలీస్ స్టేషన్ పరిధిలోని కోమటిపల్లి అటవీ ప్రాంతంలో గుట్టలపై మావోయిస్ట్‌లు దాచి ఉంచిన ఈ భారీ డంప్ ను స్వాధీనం చేసుకున్నారు. వీటిలో ఆయుధాలు, బిజిఎల్ (బ్యారెల్ గ్రెనడ్ లాంచర్)లు, బీజీయల్, రౌండ్స్, పార్టులు, పేలుడు పదార్థాలున్నాయి.. ఆ ప్రాంతంలో సెర్చింగ్ ఆపరేషన్ కొనసాగుతున్నట్లు పోలీసు ఉన్నతాధికారులు వెల్లడించారు.

**మావోయిస్టుల స్తూపం కూల్చివేత**

ఛత్తీస్ ఘడ్ లోని బీజాపూర్ జిల్లా పామేడు పోలీస్ స్టేషన్ పరిధిలోని ఉడత మల్ల అటవీ ప్రాంతంలో. గురువారం మావోయిస్టు ల భారీ స్మారక స్తూపాన్ని భద్రతా బలగాలు నేలకుల్చాయి. అక్కడి అటవీ ప్రాంతంలో కూంబింగ్ ఆపరేషన్ చేపట్టిన బలగాలు ఈ స్తూపాన్ని ధ్వంసం చేసాయి.



# ట్రంప్ సుంకాలకు కారణాలు అనేకం

**కేవలం రష్యాతో చమురు బేరం మాత్రమే కాదు**

**విశ్లేషకుల లోతైన అంచనా**

**న్యూఢిల్లీ, ఆగస్ట్14 (జనంసాక్షి) :** ట్రంప్ భారీ సుంకాల విధింపు వెనక అనేకానేక కారణాలు ఉన్నాయని విశ్లేషకులు వెల్లడిస్తున్నారు. కేవలం రష్యా (నుంచి చమురు కొనుగోలు చేస్తున్నారనే కారణంతో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ భారత్ పై భారీగా సుంకాల భారాన్ని మోపారనడానికి లేదంటున్నారు. ఇదొకకారణం మాత్రమేనని, అలాంటివి ఎన్నో ఇప్పుడు ఆన ముందుకేసుకుని ఉన్నారని అంటున్నారు. ట్రంప్ సుంకాల విధింపుపై భారత మాజీ దౌత్యవేత్త వికాస్ స్వరూప్ మాట్లాడుతూ.. కీలక వ్యాఖ్యలు చేశారు. భారత్- పాక్ మధ్య జరిగిన కాల్పుల విరమణలో ఎవరి ప్రమేయం లేదని న్యూదిల్లీ పేర్కొనడంతోనే సుంకాలు విధించారని విమర్శించారు.

# ఒక్క ఆర్‌ఓబీ.. దశాబ్దాల తరబడి

- పెద్దంపేటలో రైల్వే వంతెనకు మోక్షం లభించేనా..?
- పెరిగిన రైళ్లు.. ఆగిపోతున్న ప్రయాణికులు
- ఆపద సమయంలో వచ్చే అంబులెన్సుకూ ఇదే పరిస్థితి
- రైతులూ, విద్యార్థులూ, కూలీలకూ నిత్యం అంతరాయం
- ఆర్‌ఓబీ కోసం ఎంపీ, ఎమ్మెల్యే చొరవ చూపాలని విన్నపాలు



**రామగుండం, ఆగస్టు 14 (జనంసాక్షి) :** హైదరాబాద్ నుండి న్యూఢిల్లీకి ప్రధాన రైల్వే మార్గం కావటం, నూతనంగా మూడవ రైల్వే లైన్ నిర్మాణం, ప్రతి ఐదు నిమిషాలకు రైలు చొప్పున వెళ్తుండటం, రైల్వే గేటు గంటల తరబడి మూసి ఉండటం.. వెరసి ప్రయాణికులు గంటల తరబడి ఆగలేక విసుగెత్తిపోతున్నారు. దశాబ్దాల కాలంగా ఇక్కడ రైల్వే ఓవర్ బ్రిడ్జి (ఆర్‌ఓబీ) నిర్మించాలని ప్రయాణికులు ఎదురుచూస్తున్నారు. పెద్దపల్లి జిల్లా అంతర్గాం మండలంలోని పెద్దంపేట గ్రామం పరిధి ఎల్‌సి నంబర్ 52/టీ రైల్వే గేటు మీదుగా రామగుండం, పాలకుర్తి, అంతర్గాం మండలాల ప్రజలతో పాటు ఉమ్మడి కరీంనగర్, జగిత్యాల, మంచిర్యాల జిల్లాల నుండి నిత్యం వేలాది మంది ప్రజలు ఈమార్గం గుండా ప్రయాణిస్తుంటారు. రామగుండం నియోజకవర్గం పారిశ్రామిక ప్రాంతం కావటంతో రామగుండం పట్టణంలోని జెన్కో, గోదావరిఖని సింగరేణి, ఎన్టీపీసీ, ఎఫ్‌సిఐ, పరిశ్రమలలో పనిచేసే ఉద్యోగులు, కాంట్రాక్ట్ కార్మికులు, పాఠశాల విద్యార్థులు గంటల తరబడి ఈ రైల్వే గేటు పడుతుండటంతో సమయానికి చేరుకోలేకపోతున్నారు. వీరితో పాటు సమీప గ్రామాల రైతులు, కూలీలు పంట పొలాలకు వెళ్లే రైతులు, ట్రాక్టర్‌లు, ఎడ్ల బండ్లు గంటల తరబడి నిరీక్షించాల్సి వస్తోంది. ఫలితంగా వ్యవసాయ పనులు ఆలస్యమవుతున్నాయి. మూడవ రైల్వే లైన్ నిర్మాణంతో ప్రతి ఐదు నిమిషాలకు ఒక రైలు వెళ్తోంది. రైళ్ల సంఖ్య కూడా పెరిగింది. కానీ రైల్వే గేటుకు ప్రత్యామ్నాయ మార్గం లేకపోవడం వల్ల వాహనదారులకు క్షణాల కొద్దీ ఎదురుచూపులే. సమీప గ్రామాల ప్రజలకు అపాయ సమయంలో అస్పత్రులకు వెళ్లాలంటే 108 వాహనం గంటల తరబడి నిలిచిఉండటం గమనార్హం. పలువురు రోగులకు సకాలంలో వైద్యం అందక మరణించిన సందర్భాలు కూడా ఉన్నాయి. గతంలో ఆర్‌ఓబీ నిర్మాణం కోసం ఇక్కడ సంబంధిత అధికారులు సర్వేలు సైతం చేశారని, గతంలో వంతెన నిర్మాణ ప్రతిపాదన లేకుంటే అధికారులు ఇక్కడ సర్వే ఎందుకు చేస్తారని ప్రజలు చర్చించుకుంటున్నారు. ఇకనైనా రామగుండం ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్ మఖాన్ సింగ్, పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీకృష్ణలు ఆర్‌ఓబీ నిర్మాణం మీద దృష్టిసారించి ప్రత్యేక చొరవ తీసుకోవాలని, ఆర్‌ఓబీకి కృషిచేసి స్థానిక ప్రజల దశబ్దాల కల నెరవేర్చాలని ప్రజలు కోరుతున్నారు.

**ఎంపీ దృష్టికి తీసుకుపోయాం**



పెద్దంపేటలో ఆర్‌ఓబీ నిర్మించాలని పలుమార్లు తానే స్వయంగా ఎంపి గడ్డం వంశీకృష్ణ దృష్టికి తీసుకుపోయా. ఆర్‌ఓబీ నిర్మాణానికి కృషిచేస్తానని స్వయంగా ఎంపీ చెప్పారు. త్వరలోనే స్థానిక ప్రజల కల నెరవేరుతుందని ఆశిస్తున్నా.

– గడ్డం మధు, కాంగ్రెస్ నాయకులు

**గంటల తరబడి నిలబడలేక సచ్చిపోతున్నాం**



మూడో రైల్వే లైన్ అయినప్పటి నుండి మా ప్రజల కష్టాలు పెరిగినయి. ఒక్కొక్కసారి గంటల తరబడి ఆగాల్సి వస్తున్నది. అనుకున్న సమయానికి చేరుకోలేక అవస్థలు పడుతున్నాం. ప్రజా ప్రతినిధులు చొరవ తీసుకుని బ్రిడ్జి నిర్మాణానికి కృషి చేయండి.

– చంద్రశేఖర శర్మ, పురోహితుడు

# తెలంగాణ వాస్తవ చరిత్రను భావితరాలకు అందించాలి

- అందుకు తెలంగాణ చరిత్రను సరి చేయాల్సిందే
- స్వాతంత్ర పోరాటంలో అసువులు బాసిన తెలంగాణ యోధులకు గుర్తింపు లేదు
- మజ్లిస్ పార్టీ అధ్యక్షులు ఎంపీ అసదుద్దీన్ ఓవైసి, రాష్ట్ర ప్రణాళికా సంఘం వైస్ చైర్మన్ డాక్టర్ జీ. చిన్నారెడ్డి



**హైదరాబాద్ (జనంసాక్షి) :** దేశ స్వాతంత్ర పోరాటంలో అసువులు బాసిన తెలంగాణ ప్రాంత ముఖ్యంగా హైదరాబాద్ కు చెందిన యోధులకు గుర్తింపు లేకుండా పోయిందని, అసలు తెలంగాణ చరిత్రను సమైక్యపాలనలో వక్రీకరించారని, ఈ నేపథ్యంలో తెలంగాణ వాస్తవ చరిత్రను భావి తరాలకు అందించేందుకు తెలంగాణ చరిత్రలో సమూల మార్పులు చేయాల్సిన అవసరం ఉందని మజ్లిస్ పార్టీ అధ్యక్షులు, హైదరాబాద్ పార్లమెంట్ సభ్యులు అసదుద్దీన్ ఓవైసి, రాష్ట్ర ప్రణాళికా సంఘం వైస్ చైర్మన్ డాక్టర్ జీ. చిన్నారెడ్డి అన్నారు. గురువారం బషీర్‌బాగ్ ప్రెస్ క్లబ్‌లో తెలంగాణ కౌన్సిల్ ఆఫ్ హిస్టారికల్ రీసెర్చ్ ఆధ్వర్యంలో 'అన్ వెప్ట్ అండ్ అన్ సంగ్ హీరోస్ అఫ్ తెలంగాణ " అనే అంశంపై జరిగిన సెమినార్ లో వారు ముఖ్య అతిథిలుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా అసదుద్దీన్ ఓవైసి, చిన్నారెడ్డి మాట్లాడుతూ వక్రీకరించబడ్డ తెలంగాణ వాస్తవ చరిత్రను తిరిగి రాసేందుకు అవసరమైన నిధుల కోసం తాము ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో త్వరలోనే భేటీ కానున్నట్లు తెలిపారు. 90 ఏళ్ల దేశ స్వాతంత్ర పోరాటంలో కేవలం ఆంధ్రప్రదేశ్ కు చెందిన వారే పాల్గొన్నట్లు, తెలంగాణ ప్రాంత యోధులు లేనేలేనట్లు చరిత్ర ఉందని, ఇది సరైంది కాదని వారు పేర్కొన్నారు. స్వాతంత్ర పోరాటంలో హైదరాబాద్ లోని ఆంగ్లేయుల రెసిడెన్సీపై దాడి చేసిన హైదరాబాద్ యోధులు మౌల్వి ఆలాఉద్దీన్, తుర్రే బాజ్ ఖాన్, చిదా ఖాన్ పేర్లు చరిత్రలో కానరావని వారు అన్నారు. సెల్యూలార్ (కాలాపాని) జైలులో మౌల్వి ఆలాఉద్దీన్ 30 ఏళ్ళు శిక్ష అనుభవించారని, ఆ జైలులో తొలి భారతీయుడుగా మౌల్వి శిక్ష అనుభవించారని, తుర్రే బాజ్ ఖాన్ ను ఆంగ్లేయులు కాల్చి చంపారని వారు వివరించారు. నేతాజీ సుభాష్ చంద్ర బోస్ కు పర్సనల్ సెక్రటరీగా పని చేసిన హైదరాబాద్ గ్రామర్ స్కూల్ లో చదువుకున్న ఆబిద్ అలీ హాసన్ సఫ్రాని దేశం స్వాతంత్రం కోసం ప్రాణాలు అర్పించారని, మూడు నెలలపాటు సబ్ మేరైన్ లో గడిపారని, సఫ్రాని 'జై హింద్' నినాదాన్ని సృష్టించిన ఘనత పొందారని వారు పేర్కొన్నారు. ఇలాంటి అనేక మంది స్వాతంత్ర పోరాట యోధుల పేర్లు చరిత్రలో లేవని, ఇలాంటి పొరపాట్లను సరిదిద్దాల్సిన అవసరం ఉందని అభిప్రాయ పడ్డారు. తెలంగాణ చరిత్రను తిరిగి రాసే బాధ్యతలను కెప్టెన్ పాండు రంగారెడ్డికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అప్పగించారని, వారి నాయకత్వంలో తెలంగాణ చరిత్ర తిరిగి రాయనున్నట్లు వారు తెలిపారు. తెలంగాణ కౌన్సిల్ అఫ్ హిస్టారికల్ సెంటర్ ప్రధాన కార్యదర్శి టీ. వివేక్ అధ్యక్షతన జరిగిన ఈ సెమినార్ లో ప్రముఖులు జియా ఉద్దీన్ నయ్యర్, రహమాన్, తదితరులు పాల్గొన్నారు.

## ఓక్రిడ్జ్ ఇంటర్నేషనల్ స్కూల్‌కు జీహెచ్‌ఎంసీ షోకాజ్ నోటీసు

- అనధికారికంగా పార్కింగ్ చేయడం వల్ల ప్రజలకు తీవ్ర అసౌకర్యం
- షోకాజ్ నోటీసు జారీ చేసిన శేరిలింగంపల్లి డిప్యూటీ కమిషనర్

**శేరిలింగంపల్లి, ఆగస్టు 14 (జనంసాక్షి) :** ఖాజాగూడలోని ఓక్రిడ్జ్ ఇంటర్నేషనల్ స్కూల్ యాజమాన్యానికి సెరిలింగంపల్లి డిప్యూటీ కమిషనర్ (జీహెచ్‌ఎంసీ) గురువారం షోకాజ్ నోటీసు జారీ చేశారు. ప్రభుత్వ రహదారులపై పాఠశాల వాహనాలను అనధికారికంగా పార్కింగ్ చేయడం వల్ల ట్రాఫిక్ రద్దీ ఏర్పడి, ప్రజలకు తీవ్ర అసౌకర్యం కలగడంతో షోకాజ్ నోటీసు జారీ అందజేశారు. ఖాజాగూడలోని ఓక్రిడ్జ ఇంటర్నేషనల్ పాఠశాల తన వాహనాలను శేరిలింగంపల్లిలోని ఖాజాగూడ వద్ద రోడ్డు పక్కన పార్క్ చేస్తోంది, దీని ఫలితంగా దాదాపు 500 మీటర్ల మేర ట్రాఫిక్ జామ్ ఏర్పడింది. ప్రభుత్వ రోడ్లపై అనధికారిక పార్కింగ్ ద్వారా పాఠశాల జీహెచ్‌ఎంసీ చట్టం, 1955, టీజీ-బీపాస్ చట్టం, 2020లను ఉల్లంఘించింది. తీవ్ర ట్రాఫిక్ జామ్ తో ప్రయాణికులకు అసౌకర్యాన్ని కలిగించింది. జీహెచ్‌ఎంసీ చట్టం, 1955లోని సెక్షన్ 405 ప్రకారం, ఏ వ్యక్తి కూడా ప్రభుత్వ ఆస్తిని లేదా ప్రభుత్వ భూమిని బ్లాక్ చేయడానికి గాని , ఆక్రమించడానికి అనుమతించదు. ప్రజా రహదారులపై అక్రమ పార్కింగ్ నిషేధమే కాదు, బాధ్యుల పై జరిమానాలు, చట్టపరమైన చర్యలు తీసుకోవచ్చు. అనుమతి లేకుండా పార్క్ చేసిన వాహనాలను వెంటనే తొలగించాలని , భవిష్యత్తులో పార్కింగ్ కోసం ప్రజా రహదారులను ఉపయోగించకుండా ఉండాలని జీహెచ్‌ఎంసీ ఓక్రిడ్జ్ ఇంటర్నేషనల్ స్కూల్ యాజమాన్యాన్ని ఆదేశించింది. నోటీసు అందిన మూడు రోజుల్లోపు లిఖిత వివరణను సమర్పించాలని కూడా పాఠశాలకు జీహెచ్‌ఎంసీ సూచించింది. ఈ విషయంలో విఫలమైతే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని నోటీసులో స్పష్టం చేశారు.

## బేంగబజార్‌లో కుప్పకూలిన పురాతన భవనం

**హైదరాబాద్, ఆగస్ట్14 (జనంసాక్షి) :** హైదరాబాద్‌లోని బేగంబజార్‌లో కొన్ని రోజులుగా కురుస్తున్న వర్షాలకు ఓ పురాతన భవనం కుప్పకూలింది. అయితే ఆ సమయంలో అక్కడ ఎవరూ లేకపోవడంతో పెద్ద ప్రమాదం తప్పింది. ఈ భవనం శిథిలావస్థకు చేరుకొందని, దాన్ని కూల్చేయాలని గతంలోనే జీహెచ్‌ఎంసీ అధికారులు ఆ భవనం యజమానికి నోటీసులు ఇచ్చినా పట్టించుకోలేదు. బేగంబజార్‌లో ఇలాంటి పురాతన భవనాల్లోనే వ్యాపారులు ఇప్పటికీ దుకాణాలను నిర్వహిస్తున్నారు. ఇక్కడ రద్దీ ఎక్కువగా ఉండటంతో శిథిలావస్థకు చేరిన భవనాలను కూల్చేయాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు. ఇలాంటివాటిపై బల్దియా అధికారులు కేవలం నోటీ-సులు ఇచ్చి వదిలేయడమే కాకుండా చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

# వరద కాల్వలకూ జీఐఎస్ మాపింగ్

- త్వరలోనే స్టార్మ్ వాటర్ డ్రెయిన్ల సర్వే, మ్యాపింగ్
- వరద ముంపు బాధల నుంచి విముక్తికి జీహెచ్‌ఎంసీ నిర్ణయం




**హైదరాబాద్, ఆగస్ట్ 14 (జనంసాక్షి) :** గ్రేటర్ హైదరాబాద్ నగరంలో వర్షాల కారణంగా ఉత్పన్నమయ్యే వరదనీటి ముంపు సమస్యలను తగ్గించేందుకు, వర్షపు నీటి కాలువల నిర్మాణాన్ని బలోపేతం చేయడానికి జీహెచ్‌ఎంసీ ఆధునిక జీఐఎస్ సాంకేతికతతో స్టార్మ్ వాటర్ డ్రెయిన్ల సర్వే, మ్యాపింగ్ చేపట్టాలని నిర్ణయించింది. ఈ మాపింగ్‌లో డ్రోన్ సర్వే ద్వారా రూపొందించిన బేస్ మ్యాప్ ఆధారంగా నగరంలోని అన్ని వర్షపు నీటి కాలువలు, కల్వర్టులు, క్యాచ్‌పిట్ల ఖచ్చితమైన స్థానం, కొలతలు, అనుసంధానాల వివరాలు సేకరిస్తారు. వీటిని జియోస్పేషియల్ కోఆర్డినేట్స్‌తో అనుసంధానిస్తారు. సమగ్ర స్టార్మ్ వాటర్ డ్రెయిన్ మాస్టర్ ప్లాన్ అభివృద్ధిలో, రూపకల్పనలో జీఐఎస్ మాపింగ్ దోహదం చేస్తుంది. ఈ సర్వే లక్ష్యం మోడల్ ఫ్లో ప్యాటర్న్‌లను విశ్లేషించడం, వరద ప్రమాదాల అంచనా-తగ్గింపు, వర్షపాతం ప్రభావాన్ని అంచనావేయడం, మౌలిక వసతుల ప్రణాళిక బలోపేతం, అత్యవసర ప్రతిస్పందన సామర్థ్యాన్ని పెంపొందుతుంది. అంతేకాకుండా స్మార్ట్ సిటీ నీటి నిర్వహణ వ్యవస్థలకు మద్దతు ఇవ్వడం, తక్షణ మానిటరింగ్ సౌకర్యాన్ని కల్పిస్తుంది. ప్రాజెక్ట్ ద్వారా సిద్ధమైన విజువల్ మ్యాప్‌లు స్థానిక ప్రజలతో పంచుకుని, కాలువల నిర్వహణపై అవగాహన పెంచడంతో పాటు, సమస్యలను నివేదించడంలో పౌరుల భాగస్వామ్యాన్ని ప్రోత్సహించనుంది.

జనంసాక్షి
www.janamsakshi.org
శుక్రవారం
15 ఆగస్టు 2025










# జంట జలాశయాలకు జలకళ



**హైదరాబాద్, ఆగస్టు 14(జనం సాక్షి) :** కొన్ని రోజులుగా ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న వర్షాలతో జంట జలాశయాలైన హిమాయత్ సాగర్, ఉస్మాన్ సాగర్‌లకు వరద నీరు చేరుతోంది. దీంతో హిమాయత్ సాగర్ రిజర్వాయర్‌లోని 17 గేట్లలో 9 గేట్లను జలమండలి అధికారులు నాలుగు అడుగుల మేర ఎత్తి 12046 క్యూసెక్కుల వరద నీటిని మూసీ నదిలోకి విడుదల చేస్తున్నారు. ప్రస్తుతం హిమాయత్ సాగర్‌కు 19000 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉండగా, రిజర్వాయర్ పూర్తి సామర్థ్యం 2.970 టీఎంసీలు కాగా, 2.855 టీఎంసీల నీరు నిల్వ ఉంది. పూర్తి నీటి స్థాయి 1763.50 అడుగులు కాగా, ప్రస్తుతం 1763.20 అడుగుల వద్ద ఉంది. మరోవైపు, ఉస్మాన్ సాగర్ (గండిపేట్) రిజర్వాయర్‌కు 2800 క్యూసెక్కుల వరద నీరు వస్తోంది. ఈ రిజర్వాయర్ పూర్తి సామర్థ్యం 3.9 టీఎంసీలు కాగా, ప్రస్తుతం 2.919 టీఎంసీల నీరు ఉంది. పూర్తి నీటి స్థాయి 1790 అడుగులు కాగా, ప్రస్తుతం 1785.50 అడుగుల వద్ద ఉంది. జలాశయాల నుంచి నీటిని దిగువకు విడుదల చేస్తున్న నేపథ్యంలో, జలమండలి ఎండీ అశోక్ రెడ్డి హైదరాబాద్, రంగారెడ్డి జిల్లాల అధికారులు, హైడ్రా, జీహెచ్‌ఎంసీ, పోలీసు అధికారులతో సమన్వయంతో అప్రమత్తంగా వ్యవహరించాలని జలమండలి అధికారులకు సూచించారు.













Printed, Published and Owned by M.M.RAHMAN Printed at M/s. Manair Enterprises, Plot No. 16E/4, IDA, Kattedan, Ranga Reddy Dist, Telangana - 500077, Published at #119&120, 1st Floor, Down Town Mall, Lakdikapul, Hyderabad, Telangana-500004. Editor : M.M.RAHMAN RNINo. APTEL/2013/50370